
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



20
అమరావతి
విజయవాడ
★★★★★
గురువారం 4 జనవరి 2018

ఊరు శుభ్రం



పెనమలూరు జన్మభూమి కార్యక్రమంలో భాగంగా రోడ్లు ఊడుస్తున్న విద్యార్థినులు

కానుక ఇవ్వండి



పోరంకి గ్రామ సభలో జన్మభూమి ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి లోకేశ్

- మెయిన్‌లో..



ఎంజాయ్..

- ఆల్ ఇన్ వన్.. ఎంజీ రోడ్
- ఏది కావాలన్నా ఇక్కడే
- బెజవాడకు కాస్మోపాలిటన్ లుక్
- కావలసినవన్నీ ఇక్కడే..

అడుగుకో మల్టీప్లెక్స్.. అడుగడుగునా కళ్లు చెదిరే కనకాభరణాల దుకాణాలు.. సప్తవర్ణాల వస్త్ర ప్రపంచం... ఆ పక్కనే స్టార్ హోటల్స్.. అన్నీ ఒక దగ్గరే.. బెజవాడకు సొగసు కూర్చే మహాత్మాగాంధీ రోడ్డులో ఇప్పుడిక లేనిదేదీ లేదు.. టూ టైర్ సిటీకి కాస్మోపాలిటన్ లుక్ తీసుకువచ్చిన ఈ రోడ్డుపై ప్రత్యేక కథనం

8

బదరీనాథ్‌బాబు చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

- దుర్గగుడిలో పూజలపై విచారణ జరిపించాలి
- పోలీసులకు తొలి ఫిర్యాదు

7

22 మండలాల మీదగా అవుటర్ రింగ్‌రోడ్డు

150 మీటర్ల వెడల్పుతో, 6 వరుసల నిర్మాణం



అమరావతికి...

రూ. 17,761.49 కోట్ల భారీ అంచనాతో ప్రణాళిక

ఔటర్ హారం

రాజధాని అమరావతి ప్రాంతానికే కాకుండా కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని వందలాది గ్రామాలతోపాటు విజయవాడ, గుంటూరు వంటి నగరాలు, పెద్దసంఖ్యలో పట్టణాలకు అంతర్జాతీయస్థాయి ప్రయాణ సౌలభ్యాన్ని అందుబాటులోకి తేనున్న అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పలు విశేషాల సమాహారంగా రూపుదిద్దుకోనుంది.

9

- కృష్ణా జిల్లాలో కంచికచర్ల, వీరులపాడు, జి.కొండూరు, మైలవరం, ఆగిరిపల్లి, బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు, కంకిపాడు, తోట్లవల్లూరు మండలాలు ఈ మార్గంలో ఉండనున్నాయి.

- గుంటూరు జిల్లాలో కొల్లిపర, దుగ్గిరాల, పొన్నూరు, తెనాలి, చేబ్రోలు, వట్టిచెరుకూరు, గుంటూరు, యడ్లపాడు, మేడికొండూరు, తాడికొండ, పెదకూరపాడు, అమరావతి మండలాల మీదుగా అమరావతి ఓఆర్ఆర్ వెళ్లనుంది.

జన్మభూమి గ్రామ సభల నిర్వహణలోనూ

జిల్లా ముందంజ

- ప్రభుత్వ ఐవీఆర్ఎస్ సర్వేలో రాష్ట్రంలోనే మొదటి స్థానం
- మరింత ఉత్సాహంగా పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీకాంతం పిలుపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): జన్మభూమి గ్రామ సభల నిర్వహణ, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై ప్రజలలో సంతృప్తి కొలమానంలోనూ కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. జన్మభూమి కార్యక్రమం ప్రారంభమై రెండు రోజులు అయిన నేపథ్యంలో, వీటి నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంది. ఐవీఆర్ఎస్ ద్వారా రాష్ట్ర ప్రజల నుంచి ప్రభుత్వం ఫీడ్‌బ్యాక్ తీసుకోగా ... కృష్ణా జిల్లా నుంచి 72 శాతం మేర సంతృప్తి వ్యక్తమైంది. రాష్ట్రంలోని 13 జిల్లాలలోనే కృష్ణాజిల్లా అత్యున్నతమైన సంతృప్తికర సగటును సాధించింది. జన్మభూమి - మా వూరు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలలో సంక్షేమం, సంతృప్తి శాతాన్ని పెంచామని కలెక్టర్ బాలయ్య నాయుడు లక్ష్మీకాంతం చెప్పారు. ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేయటం ద్వారా ప్రజలకు మరింత లబ్ధి కలిగించాలని, వారిని జన్మభూమి కార్యక్రమాలలో భాగస్వాములను చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గ్రామ సభలలో లబ్దిదారుల చేత వారి అభిప్రాయాలు వివరించటం ద్వారా ప్రజలలో ప్రభుత్వ పథకాల పట్ల మరింత అవగాహన పెరుగుతుంని కలెక్టర్ అన్నారు. జన్మభూమి - మావూరు కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించుకోవటం జరుగుతోందన్నారు.

కృష్ణా జిల్లా గ్రిగ్ మెమోరియల్ పోటీలు ప్రారంభం



స్కూల్స్ పీఈటీలతో విన్నర్‌గా నిలిచిన అండర్-14, 17 బాలుర హాకీ జట్లు

విజయవాడ స్పోర్ట్స్, జనవరి 3: 81వ జిల్లా గ్రిగ్ మెమోరియల్ స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో భాగంగా బుధవారం స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని క్రీడా ప్రాంగణంలో అండర్-14, 17 బాల, బాలికల ఫుట్‌బాల్, హాకీ, హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు సుమారుగా 130 మంది బాలబాలికలు పాల్గొన్నారు. అండర్-17 హాకీ బాలుర విజేత మాంటిస్సోరి స్కూలు, రన్నర్‌గా ఏకేటీపీఎం స్కూల్ నిలిచాయి. అండర్-14 విభాగంలో నలందా విద్యానికేతన్ విన్నర్, జడ్‌పీహెచ్‌ఎస్ స్కూలు రన్నర్‌గా నిలిచింది.



అద్భుత ఆలోచనా శక్తే పెట్టుబడిగా అటు పేరు, ఇటు ఉపాధి పొందు తున్నాడు విజయవాడకు చెందిన యువకుడు సాయికుమార్ రెడ్డి. ఒక్కో అడుగు వేస్తూ భవిష్యత్‌కు పునాది వేసుకుంటున్నాడు. వెబ్‌సైట్లలో దొర్లే పొరపాట్లను (బగ్స్)ను గుర్తించి సైబర్ నేరాలు అరికట్టేందుకు తన వంతు కృషి చేస్తున్నాడు. ఆ సంస్థల ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తున్నాడు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించిన సాయి యువ తకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

- గూగుల్‌ను మెప్పించిన బీటెక్ విద్యార్థి
- వెబ్‌సైట్ తప్పులను గుర్తించిన సాయికుమార్‌రెడ్డి
- పారితోషికంగా రూ.8.70 లక్షలు
- అప్పుల బాధ తీర్చాడంటున్న తల్లిదండ్రులు
- సెక్యూరిటీ ఎనలిస్ట్‌గా స్థిరపడాలనుకుంటున్న సాయి

బగ్ మేధావి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

నగరంలోని పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ (కం ప్యూటర్ సైన్స్) చదువుతున్న సాయికుమార్ ఇంటర్ సెకండియర్ నుం చే వెబ్‌సైట్ల బగ్స్ వెతకడంపై ఆసక్తి పెంచుకున్నాడు. ఫ్రెండ్స్‌తో ముచ్చ ట్లలో భాగంగా విన్న బగ్స్ సెర్చింగ్‌ను సీరియస్‌గా తీసుకున్న సాయి నిరంతరం బగ్స్ పనిలో మునిగిపోయేవాడు. అర్ధరాత్రి వరకు కంప్యూటర్‌లో మునిగిపోతున్న తమ కుమారుడిని చూసి భయపడే వారమని, తనకు పలానా సంస్థ డబ్బులు బదిలీ చేస్తుందని, బ్యాంకు అకౌంట్ నంబరు, ఆధార్ నంబరు కావాలని అడిగిన రోజు కూడా కం గారు పడ్డామని తల్లిదండ్రులు చెబుతున్నారు. కానీ నేడు తమ బిడ్డను చూసి సంతోషపడుతున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ ద్వితీయ సంవ త్సరం చదువుతుండగా.. కాలేజీలో 48 గంటలపాటు సైబర్ సెక్యూరిటీ మారథాన్ నిర్వహించారు. అది తనకు బాగా ఉపయోగపడిందని, వెబ్ సైట్‌ను ఎలా టెస్ట్ చేయాలి.. తదితర అంశాలపై అవగాహన పెంచుకు నేందుకు సహకరించిందని సాయి చెబుతున్నాడు. తనలాగే బగ్ సెర్చింగ్ చేసే వాళ్లు ఏపీలో చాలా మందే ఉన్నారు కానీ.. ఇంత పెద్ద మొత్తాన్ని బగ్స్ గుర్తించడం వల్ల వచ్చింది మాత్రం తనకేనని, భవిష్యత్ లో సెక్యూరిటీ ఎనలిస్ట్ అవ్వాలనుకుంటున్నానని వివరించాడు.

బగ్ అంటే?

వెబ్‌సైట్లో ఉండే సెక్యూరిటీ ప్రాబ్లమ్‌ను బగ్ అంటారు. దాన్ని సం బంధిత సంస్థే గుర్తిస్తే డిలేట్ చేస్తారు. లేదా సాయిలా బయట నుంచి బగ్స్ గుర్తించిన వాళ్లు రిపోర్టును అందజేస్తే పరిష్కారం దొరుకుతుంది. అలా పరిష్కార మార్గం చూపిన వారికి రివార్డు కింద ఆ సంస్థలు కొంత మొత్తాన్ని అందిస్తుంటాయి. ఒక దానికి 13 వేల 337 డాలర్లను సంస్థ నిర్వాహకులు పంపారు. ఒక బగ్‌కు చెందిన కంపెనీని గూగుల్ విలీనం చేసుకుని ఆరు నెలల్లోపే అయిందని, ఆరు నెలలు దాటితేనే ఇవ్వగల మని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఆ బగ్‌కు సొమ్ముకు బదులు గూగుల్లో 104 పేజీలకు ఉన్న హాల్ ఆఫ్ ఫేమ్ కింద సాయికుమార్ రెడ్డి ఫొటోను 15వ పేజీలో ఉంచారు.

రూ.లక్షల అప్పు తీర్చిన సాయి

లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న తండ్రి శ్రీనివాసరెడ్డి కొన్నేళ్లుగా లక్షల అప్పుతో ఇబ్బంది పడుతున్నాడు. అయినా సాయి చదువుకు ఎలాంటి ఆటంకం కలగనివ్వలేదు. ప్రస్తుతం సాయి సంపాదించిన సొమ్ముతో దాదాపు రూ.3.70 లక్షల అప్పు తీర్చాడని



సాయి తల్లిదండ్రులు శ్రీనివాస్‌రెడ్డి, సుధారాణి

తండ్రి సంతోషపడుతున్నాడు. మిగిన సొమ్మును కుమారుడి చదువుకే కేటాయించామని చెబుతున్నారు.

బగ్స్ గుర్తింపు ఇలా!

గూగుల్‌కు చెందిన యూ ట్యూబ్ వెబ్‌సైట్‌లో సిస్కో రూటర్‌ను ఆడి యో, వీడియో సిగ్నల్స్ డీ కోడ్ ఇన్‌కోడింగ్ అవ్వడం కోసం వాడతారు. బగ్స్ వెతకడంలో ఆసక్తితో సెర్చింగ్‌లో ఉన్న సమయంలో సర్వర్ నుంచి వచ్చే, వెళ్లే రిక్వెస్ట్‌ను చెక్ చేశాను. అదే సమయంలో దానికి సంబంధిం చిన ఐపీ కోడ్‌ను గుర్తించి, ఆ ఐపీ అడ్రస్ మొత్తం నెట్‌వర్క్‌ను స్కాన్ చేశాను. అందులో కొన్ని నంబర్లు ప్రత్యేకంగా కనిపించాయి. దీంతో ఆ ఐపీ అడ్రస్‌ను బ్రౌజ్ చేసి చెక్ చేస్తే.. యూజర్ నేమ్ లాగిన్ ప్యానెల్ ఓపెన్ అయింది. సిస్కో రూటర్స్ (శాటిలైట్ రిసీవర్) అని ఉన్నాయి. అవి ఆడియో, వీడియో సిగ్నల్స్‌ను ఎన్‌కోడ్ చేసుకుంటుందని తెలిసింది. నాకు దొరికిన డిఫాల్ట్ యూజర్ పాస్‌వర్డ్ గూగుల్‌లో చెక్ చేశాను. కనిపించిన ప్రతీ పాస్‌వర్డ్‌ను నోట్ చేసుకుని, ఒకదాని తరువాత ఒకటి లింకప్ చేసుకుంటూ వెళితే లోకల్ అడ్మిన్, లోకల్ పాస్‌వర్డ్ లభించింది. వాటిని ఉపయోగించి గూగుల్లో లాగిన్‌కు ప్రయత్నిస్తే ఓపెన్ అయి పోయింది. దాన్ని వెంటనే స్క్రీన్ రికార్డు(స్క్రీన్ షాట్) చేసి వెంటనే గూగుల్‌కి మెయిల్ పంపించాను. నెల తరువాత నాకు గూగుల్ నుంచి మెయిల్ వచ్చింది. అనంతరం రూ.8.70 లక్షలు బ్యాంకు అకౌంట్‌కు వచ్చి చేరింది. బగ్‌ను కనిపెట్టినందుకు ఆ మొత్తాన్ని అందుకున్నాను.

- సాయికుమార్ రెడ్డి

శ్రీవారి సమాచారం



తిరుమల తిరుపతి శ్రీవారి ఆర్జిత సేవలు వివరాలు టీటీడీ కళ్యాణ మండపంలోని ఈ దర్శనం కౌంటర్‌లో...

ప్రత్యేక దర్శనం : జనవరి 9 నుంచి ఫిబ్రవరి 28 వరకు అందుబాటులో ఉ న్నాయి. డిసెంబర్ 26 నుంచి జనవరి 1 వరకు, జనవరి 24వ తేదీలో దర్శనం టికెట్ల జారీ చేయబడవు.

కాటేజీలు : ఫిబ్రవరి 15, 27, 28 తేదీలో మాత్రమే అందుబాటులో ఉన్నాయి.


ఆర్జితం: మార్చి 5వ తేదీకి గురువారం జారీ చేస్తారు.

గమనిక : ఇప్పటి వరకు 60 రోజులు ముందుగా జారీ చేస్తున్న నిజపాదం, సుప్రబాతం, అష్టాదళ పాదపద్మారాధన సేవలు ఈ కౌంటర్‌లలో జారీ చే యటం నిలిపివేశారు.

- రూ.300 టికెట్లు ఒక్కరు ఎంత మందికైనా పొందవచ్చు. సేవా టికెట్లు ఇద్దరికే జారీ చేస్తారు.

టికెట్ల కోసం వెళ్ళే భక్తులు తమ గుర్తింపు కార్డును, టికెట్లు ఎవరికి తీసుకుంటు న్నారో వారి గుర్తింపు కార్డులు కూడా తీసుకు వెళ్ళాలి. సేవా టికెట్లు 60 రోజులు ముందుగా, ప్రత్యేక దర్శనం టికెట్లు, కాటేజీలు 120 రోజులు ముందు ఖాళీగా ఉన్న ప్రకారం జారీ చేస్తారు.

దుర్గగుడిలో ఆర్జిత సేవలు



- తెల్లవారు జాము 3.00గంటలకు కవాట ఉద్ఘాటన. అనంతరం సుప్రభాత సేవ, ప్రాతఃకాలర్చాన, బాలభోగనివేదన, హారతి
- ఉదయం 6-7, 10.45-11.45, 4.45 నుంచి 5.45 గంటల వరకు త్రికాలార్చన
- 4 గంటలకు సర్వదర్శనం, 5 గంటల వరకు ఖడ్గమాల పూజ
- 6.30గం. అమ్మవారికి నివేదన
- ఉదయం 7 నుంచి తొమ్మిది గంటల మధ్య రుద్రహోమం
- ఉదయం 9 - 12.00 మధ్య లక్ష కుంకుమార్చన, శ్రీచక్రార్చన, చండీహోమం, శాంతి కల్యాణం
- 11 - 12 మధ్య సౌభాగ్య ప్రదాయనీ పూజ
- మధ్యాహ్నం 12 గంటలకు మహానివేదన
- సాయంత్రం 3.30 - 4.30 గంటల మధ్య స్వర్ణపుష్పార్చన
- సాయంత్రం 6- 6.30 పంచహారతులు
- రాత్రి 10 గంటలకు ఆలయం మూసివేత

బెజవాడకు సైబర్ స్టేషన్

- కమిషనరేట్ ఆవరణలో ఏర్పాటు
- త్వరలో ప్రారంభం
- విచారణాధికారిగా ఏసీపీ?

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

'మీ క్రెడిట్, డెబిట్ కార్డులకు సంబంధించిన వివరాలను ఏ బ్యాంకూ అడగదు. పిన్, సీవీవీ నంబర్లనూ అడగదు. ఒకవేళ ఎవ రైనా ఫోన్ చేసి అడిగినా వాటి గురించి చెప్పొద్దు'... పోలీసులు పదే పదే చేస్తున్న విజ్ఞప్తి ఇదీ! బ్యాంకర్లు ఖాతాదారుల మొబైల్ ఫోన్లకు సందేశాలు పంపుతున్నాయి. అయినా ఖాతాదారుల్లో అవగాహన పెరగడం లేదు. సాంకేతిక, బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన లేని వారే కాకుండా అవగాహన ఉన్న వారూ 'ఈ' నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్నారు. ఏటా సైబర్ నేరాలు పెరుగుతుండటంతో వాటి దర్యాప్తునకు ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పిన అధికారులు కొత్త సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. ప్రస్తుతం కమిషనరేట్‌లోని సంయుక్త కమిషనర్ కార్యాలయం పై అంతస్థులో సైబర్ నేరాల నియంత్రణ విభాగం ఉంది. వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులను ఈ విభాగంలో విచారిస్తున్నారు. దీనికి ప్రత్యేకంగా కమిషనరేట్ ఆవరణలోనే ఒక భవనాన్ని సమకూర్చుతున్నారు. నెలాఖరులో దీన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

గడచిన నాలుగేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ప్రతి ఏడాది సైబర్ నేరాలూ పెరుగుతూనే ఉన్నాయి. 2016 కంటే 2017లో ఈ సంఖ్య బాగా పెరిగింది. ఎక్కువగా ఓటీపీ (వన్ టైమ్ పాస్‌వర్డ్), ఆన్‌లైన్ నేరాలు పెరిగాయి. గడచిన ఏడాది మొత్తం 120 ఓటీపీ కేసులు నమోదయ్యాయి. వివిధ రాష్ట్రాల నుంచి ఫోన్లు చేసిన 'ఈ' నేర గాళ్లు ఏటీఎం, క్రెడిట్ కార్డుల వివరాలు తెలుసుకుని ఖాతాల నుంచి రూ.లక్షలు కొల్లగొడుతున్నారు. అసలు మోసం ఆలస్యంగా తెలుసుకుంటున్న బాధితులు పోలీస్‌స్టేషన్లకు వెళ్లి గగ్గోలు పెడుతున్నారు. ఓ వైపు బ్యాంకులు, పోలీసులు వీటిపై ప్రచారం చేస్తున్నా.. ఖాతాదారుల్లో అవగాహన కలగడం లేదు. వాటి గురించి పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. లబోదిబోమంటూ బ్యాంకుల వద్దకు వెళ్లినా సరైన స్పందన లేకపోవడంతో పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

విచారణాధికారిగా ఏసీపీ?

విజయవాడ పోలీస్ కమిషనరేట్‌ను సిబ్బంది కొరత వేధిస్తోంది. పదవీ విరమణ చేసిన వారు బయటకు వెళ్తుండగా కొత్త కనిపిం చడం లేదు. ఫలితంగా అందరిపైనా అదనపు పనిభారం పడుతోంది. సైబర్ క్రైం విభాగంలో ప్రస్తుతం ఒక ఇన్‌స్పెక్టర్, ఎస్సై, మరో అయిదుగురు సిబ్బంది ఉన్నారు. దీన్ని మరింత బలోపేతం చేయాలని పోలీస్ కమిషనర్ గౌతమ్ సవాంగ్ భావిస్తున్నారు. సైబర్ క్రైం విభాగానికి ప్రత్యేకంగా ఒక సహాయ కమిషనర్‌ను నియమించాలని యోచిస్తున్నారు. ఆయనకు దిగువన ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్ స్పెక్టర్, హెడ్ కానిస్టేబుల్, పోలీస్ కానిస్టేబుళ్లు ఉంటారు. సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు ఉన్న వారిని ఈ విభాగంలో నియమించి పటిష్ఠం చేయబోతున్నారు.

సైబర్ నేరాలు	2016	2017
ఓటీపీ, ఆన్‌లైన్ నేరాలు	52	120
ఆన్‌లైన్ మోసాలు	06	24
ఫేస్‌బుక్ నేరాలు	12	21
ఎస్ఎంఎస్ వేధిపులు	06	11
ఈ మెయిల్ వేధింపులు	05	03
వాట్సాప్ నేరాలు	03	02
అసభ్యకర వీడియోలు	04	01
కోడ్‌ల దొంగతనాలు	01	01

రైవస్ కాల్వలో యువకుడి మృతదేహం

గుణదల, జనవరి 3: రైవస్ కాల్వలో జారిపడి ఒకరు మృతి చెందినట్లు పటమట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ప్రసాదంపాడు పురుషోత్తమ నగర్‌కు చెందిన వలబాపురం బాలాజీ (28) ఆటోనగర్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. మంగళవారం ఇంటి నుంచి కంపెనీకి వెళ్లిన బాలాజీ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బాలాజీ స్నేహితులు అతని ఆచూకీ కోసం ఎంత వెతికారు. రామవరప్పాడు వంతెన సెంటర్ వద్ద రైవస్ కాల్వలో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పటమట పోలీసులు అక్కడికి చేరుకొని మృతుడు బాలాజీగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

కానూరు (పెనమలూరు), జనవరి 3: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు బుధవారం మృతి చెందాడు. పెనమలూరుకు చెందిన గోపాలకృష్ణమూర్తి (78) మంగళవారం కామయ్యతోపు వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని గాయ పడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిపై బైండోవర్ కేసులు

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 3: సంక్రాంతికి కోడిపందేలు వేసేందుకు సిద్ధమవుతున్న ఇద్దరిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు బుధవారం బైండోవర్ కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం న్యూ రాజరాజేశ్వరి పేట ప్రాంతానికి చెందిన గంధసిరి గురవయ్య, దాసరి చిన్నకోటయ్య పందేలకు సిద్ధమవుతుండగా ఎస్సై ఫణీంద్ర అదుపులోకి తీసుకుని బైండోవర్ కేసులు పెట్టారు.

లారీ ఢీకొని సైక్లిస్టు మృతి

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 3: అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పైపుల రోడ్డు సెంటర్ సమీపంలో ఇన్నర్ రింగ్ రోడ్డుపై బుధవారం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెం దారు. పోలీసుల కథనం ప్రకారం గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రాంతానికి చెందిన ముత్యాల దుర్గారావు (60) ఇందిరా నాయక్ నగర్‌లో ఓ ఇంటికి వడ్రంగి పని చేసే నిమిత్తం వచ్చాడు. పని ముగిం చుకుని సాయంత్రం తన సైకిల్‌పై వెళ్తుండగా రోహిత్ బార్ సమీపంలో బస్సు ఆగి ఉంది. బస్సు పక్క నుంచి వెళ్తున్న దుర్గారావును వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు గాయమైన దుర్గారావును వెంటనే 108లో చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీని సీజ్ చేసి అజిత్ సింగ్‌నగర్ ఎస్సై నరేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన లారీ, (ఇన్‌సెట్)లో దుర్గారావు (ఫైల్)

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్ జనవరి 3: కుమారుడు అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కేఎల్ నగర్ 8వలైన్‌లో నివసిస్తున్న షేక్ అషీనా బుక్ బైండింగ్ షాపులో పని చేస్తుంది. ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల భర్త సుభాని అనారోగ్యంతో మృతి చెందాడు. పెద్ద కుమారుడు అమీర్‌బాషా (15) ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కొత్త సంవత్సరం సందర్భంగా బైక్‌పై స్నేహితుడితో కలసి సరదా తిరిగిసాయంత్రం ఇంటికి వచ్చాడు. బైక్ కిందపడి పలుచోట్ల దెబ్బతినటంతో తల్లి అషీనా మందలించింది. మనస్తాపం చెందిన బాషా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దిగుమతి అయిన వస్తువులను పరిశీలిస్తున్న అధికారులు

రెడీమేడ్ వస్త్రాలు, ఎలక్ట్రికల్ హార్డ్‌వేర్ సామగ్రి స్వాధీనం

రైల్వేస్టేషన్, జనవరి 3: విజయవాడ రైల్వే పార్శిల్ కార్యాలయంలో బిల్లులు, వే బిల్లులు లేకుండా దిగుమతి అయిన రూ.లక్షల విలువైన రెడీమేడ్ వస్త్రాలు, ఎలక్ట్రికల్ హార్డ్‌వేర్ వస్తువులను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అడిషనల్ కమిషనర్ యు.ఏడుకొండలు, జాయింట్ కమిషనర్‌లు వి.రఘునాథ్, వై.కిరణ్ కుమార్‌లు రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ రాజేంద్ర ప్రసాద్ సహకారంతో పార్శిల్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి, దాదాపు రూ.40 లక్షల విలువైన బండిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ రైళ్లలో రూ.లక్షల విలువైన రెడీమేడ్ వస్త్రాలు, ఇతర వస్తువులు నగరానికి దిగుమతి అవుతున్నాయి. అయితే ఈ వస్తువులకు వ్యాపారులు పన్నులు చెల్లించటం లేదు. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వ్యాపారులతో లాలూచి పడి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

గన్నవరం విమానాశ్రయంలో తుపాకీ కలకలం

- ఓ ఎమ్మెల్యే సోదరుడి కుమారుడి ఘన కార్యం
- బొమ్మ తుపాకీ అంటూ సమాధానం

విమానాశ్రయం (గన్నవరం), జనవరి 3: గన్నవరం విమానాశ్రయంలో బుధవారం సాయంత్రం ఓ యువకుడి వద్ద తుపాకీ లభించడం కలకలం సృష్టించింది. లగేజీలో తుపాకీ ఉన్నట్లు భద్రతా సిబ్బంది గుర్తిం చడంతో అక్కడ ఉన్నవారంతా భయాందోళన చెందారు. సేకరించిన వివరాల ప్రకారం గన్నవరం నుంచి హైదరాబాద్ మీదుగా ఢిల్లీ వెళ్లే ఎయిర్ ఇండియా విమానంలో వెళ్లేం దుకు తణుకుకు చెందిన ఓ యువకుడు విమానాశ్రయానికి వచ్చాడు. లోపలికి రాగానే లగేజీని భద్రతా తనిఖీ విభాగం సిబ్బంది స్కానింగ్ చేస్తుండగా తుపాకీ ఉన్నట్లు గుర్తిం చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లగేజీ బ్యాగ్‌ను పూర్తిగా తనిఖీ చేశారు. బ్యాగులో ఉన్న తుపాకీ స్వాధీనం చేసుకుని అతనిని విచారించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే సోదరుడి కుమారుడు అని చెప్పినట్లు తెలిసింది. పుణేలో ఎంబీఏ చదువుతున్నానని, చిన్నప్పుడు కొనుక్కున్న టాయ్ పిస్టల్ అని చెప్పినట్లు తెలిసింది. పోలీ సులు స్వాధీనం చేసుకున్న ఆయుధం వెపనా కాదా అని నిర్ధారించేందుకు విజయవాడ కమి షనరేట్‌లో ఉన్న నిర్ధారణా కేంద్రానికి పంపినట్లు సమాచారం. దీనిపై వివరాలు చెప్పేందుకు గన్నవరం పోలీసులు, విమానాశ్రయం పోలీసులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ దాటవేశారు.

మైలవరం
నియోజకవర్గం

మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం,విజయవాడ రూరల్

54 మందికి దుల్హన్ పథకం నిధులు

విజయవాడ రూరల్, జనవరి 3 : మండలంలో దుల్హన్ పథకం కింద 54 మంది మైనార్టీ యువతులకు నిధులు మంజూరైనట్లు డిప్యూటీ కలెక్టర్ (అండర్ ట్రైనీ తహసీల్దార్) ఎ.రవీంద్రరావు బుధవారం తెలిపారు. పథకం కింద ఒక్కొక్కరికి రూ.50 వేలు ఆర్థిక సాయం చేయనున్నట్లు పేర్కొన్నారు. గొల్లపూడిలో 14 మంది, జక్కంపూడిలో ఐదుగురు, కుందావారి కండ్రికలో 12 మంది, ఎనికేపాడులో ఒక్కరు, నిడమానూరులో 15 మంది, నున్నలో ఇద్దరు, పి.నైనవరం, పాతపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు, కె.తాడేపల్లిలో ఒక్కొక్కరికి మంజూరైందన్నారు. నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతుందన్నారు.

సంక్షిప్తం

నేరాలు తగ్గాయి


మాట్లాడుతున్న ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

మైలవరం, జనవరి 3: జిల్లా పరిధిలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం మైలవరం విచ్చేసిన ఆయన పోలీస్‌స్టేషన్‌లో అధికారులతో పలు విషయాలపై చర్చించారు. డిసెంబర్ 30న పట్టణ పరిధిలో జరిగిన ఆటో, కారు యాక్సిడెంట్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రెండేళ్లుగా నేరాలు తగ్గాయని, అందరూ కలసికట్టుగా పనిచేస్తుండటంతో చక్కని ఫలితాలు వస్తున్నాయన్నారు. ప్రమాదాల సంఖ్య పెరుగుతుందన్న విలేకర్ల ప్రశ్నకు సౌకర్యాలు పెరిగే కొద్దీ ప్రమాదాలు పెరగడం సహజమన్నారు. స్టేషన్లలో సిబ్బంది కొరతను త్వరలో అధిగమిస్తామన్నారు. కార్యక్రమంలో నూజివీడు డీఎస్పీ వి.శ్రీనివాసరావు, సీఐ పి.రామచంద్రరావు, ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

భూసేకరణ చట్టంతో పేదలకు నష్టం

మైలవరం, జనవరి 3: పేదల భూములు పెద్దలకు కట్టబెట్టేందుకే 2013 భూసేకరణ చట్ట సవరణ ఉపయోగపడుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు పేర్కొన్నారు. పేద, సామాన్య రైతులకు ప్రయోజనకరంగా ఉన్న భూసేకరణ చట్టానికి చంద్రబాబు ప్రభుత్వం సవరణలు చేయడం పేదల భూములను కొట్టేయడానికేనని కోటేశ్వరరావు ఆరోపించారు. సీపీఐ కార్యాలయంలో(శ్రామికభవన్) బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూసేకరణ చేసేందుకు ముందుగా ఆ భూముల యజమానులను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలన్నారు. మార్కెట్ విలువకు మూడు రెట్లు అదనంగా నష్టపరిహారం ఇచ్చేలా ఉన్న చట్టాన్ని గత నెలలో జరిగిన శాసనసభ సమావేశాల్లో సవరణలు చేయడం దుర్మార్గమన్నారు. ఈ బిల్లు అమలులోకి వస్తే భూ యజమానుల అభిప్రాయాలతో సంబంధం లేకుండా భూములను బలవంతంగా తీసుకుని, ప్రభుత్వం తమ ఇష్టం వచ్చిన ధరను రైతులకిచ్చి, ఆ భూములను పరిశ్రమల పేరుతో పెద్దలకు కట్టబెట్టే ప్రజా వ్యతిరేక కుట్ర జరుగుతుందని కోటేశ్వరరావు ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కారుమూడి రత్నకుమారి, బొడ్డు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

మైలవరం టౌన్, జనవరి 3: సమస్యలు ఉంటే జన్మభూమి సభల్లో తెలిపి పరిష్కరించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.విజయకృష్ణన్ పేర్కొన్నారు. మండలంలోని గణపవరం ఎంపీపీ పాఠశాల ఆవరణలో బుధవారం జన్మభూమి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెద్ద సంఖ్యలో పెన్షన్‌లు, పక్కా గృహాలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.వి శివయ్య, ప్రత్యేకాధికారి ఎం.రామారావు, ఎంపీపీ బాణోతు లక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు రాము, పీఏసీఎస్ అధ్యక్షురాలు గుంటక అన్నపూర్ణ, సర్పంచ్ సుధారాణి, వెంకటేశ్వర రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమం.. జన్మభూమి లక్ష్యం

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడటమే జన్మభూమి లక్ష్యమని వైస్ ఎంపీపీ చెరుకూరి వెంకటకృష్ణ పేర్కొన్నారు. ఐదో విడత జన్మభూమి కార్యక్రమం బుధవారం మూలపాడు, కేతనకొండ గ్రామాల్లో నిర్వహించారు. మూలపాడు జడ్పీ పాఠశాలలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంపాల సీతారామయ్య, రామినేని రాజశేఖర్, చెన్నుబోయిన రాధ, ఎంపీడీవో కె.శ్రీనివాస రెడ్డి, సర్పంచ్‌లు బర్రె శ్రీనివాసరావు, పులి మేరిమ్మ, పత్రి లేపాక్షిరావు, ఎంపీటీసీ సభ్యుడు సంజీవరావు పాల్గొన్నారు.

గ్రామాలు శరవేగంగా అభివృద్ధి

పైడూరుపాడు(గొల్లపూడి): టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ వడ్లమూడి జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పైడూరుపాడు, రాయపాడులో జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. పైడూరుపాడులో ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.2.30 కోట్లతో 12 రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. జక్కంపూడి, పైడూరుపాడు గ్రామాల మధ్య నూతన రోడ్డు పూర్తవుతుందన్నారు. కొత్తూరు తాడేపల్లి నుంచి పైడూరుపాడు, రాయనపాడు వరకు సుమారు రూ.6 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ డొక్కా కోటేశ్వరమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, జాలిపర్తి గోపాలకృష్ణ, రంగినేని నరేంద్ర, తహసీల్దారు రవీంద్ర, ఎంపీడీవో అనురాధ, ఎంపీటీసీ సభ్యురాలు సీతరామయ్య, సర్పంచ్ అరుణకుమారి, శీలంనేని సాంబశివరావు, నోడల్ అధికారి మనోహర్ పాల్గొన్నారు.


కేతనకొండలో పింఛన్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు


పైడూరుపాడులో సామూహిక సీమంతాలు

అందరికీ సంక్షేమ ఫలాలు

జి.కొండూరు: అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందించేందుకే ప్రభుత్వం జన్మభూమి-మా ఊరు గ్రామ సభలు నిర్వహిస్తోందని ఎంపీడీవో బిఎం.లక్ష్మీకుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోని కుంటముక్కల, గుర్రాజుపాలెం గ్రామాల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను ప్రజా ప్రతినిధులు, అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వేములకొండ తిరుపతిరావు, జడ్పీటీసీ సభ్యుడు కాజ బ్రహ్మయ్య, మంగలంపాటి వెంకటేశ్వరరావు, ఉయ్యూరు నరసింహారావు, కొల్లి నాగేశ్వరరావు, లంక రామకృష్ణ, యర్రగుంట భారతి, తమటం వెంకట్రామయ్య, తహసీల్దార్ కె.సుధారాణి, ఏఈ కె.శ్రీనివాస్, ఏపీఎం శేఖర్, ఏపీవో వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రుద్రవరం, ఓబులాపురం గ్రామాల్లో..

రెడ్డిగూడెం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జన్మభూమి గ్రామ సభలు నిర్వహిస్తుందని ప్రత్యేకాధికారి ఎం.రామారావు పేర్కొన్నారు. మండలంలోని రుద్రవరం, ఓబులాపురం గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ తోటకూర నారాయణరావు, జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మీ, ప్రత్యేకాధికారి ఆంజనేయరెడ్డి, ఎంపీడీవో రామకృష్ణనాయక్, తహసీల్దార్ శివకుమార్, ఎంఈవో రఘురామ్, ఆర్ఐ కరీముల్లా, సర్పంచ్‌లు జమలయ్య పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

శిథిలావస్థలో కట్టుబడిపాలెం పంచాయతీ భవనం

జి.కొండూరు, జనవరి 3: మండలంలోని కట్టుబడిపాలెం పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. గ్రామంలో 1997లో పంచాయతీ భవనాన్ని నిర్మించారు. రెండు దశాబ్దాలకే భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం శ్లాబు పెచ్చులూడిపోయి, ఇనుప చువ్వలు బయటపడ్డాయి. శ్లాబు పెచ్చులూడి భవనంలో పని చేస్తున్న సిబ్బందిపై పడుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల భవనాన్ని పరిశీలించిన అధికారులు అందులో విధులు నిర్వహించవద్దని పంచాయతీ సిబ్బందికి సూచించారు. గ్రామంలో వేరే కార్యాలయం లేకపోవడంతో సిబ్బంది అందులోనే పని చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే నూతన భవన నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న పంచాయతీ భవనం, పెచ్చులూడిపోతున్న శ్లాబు

ఘనంగా ముగిసిన ముగ్గురమ్మల జాతర


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ఇబ్రహీంపట్నం, జనవరి 3: మండలంలోని దొనబండలో ముగ్గురమ్మల జాతర బుధవారం ఘనంగా ముగిసింది. క్వారీ క్రషర్స్ ఎక్కువుగా నివసించే ప్రాంతం కావటంతో తమకు ఎటువంటి కష్టం రాకుండా ఉండాలని కోరుతూ కాళికామాత, మెరిమ్మ, సత్తెమ్మ విగ్రహాలకు నిమ్మకాయలు, పసుపు, కుంకమలు కట్టి పూజలు నిర్వహించారు. ఆఖరి రోజు బోణాలు ఇచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. వాహనాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆఖరి రోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇనుప సులాలు గుచ్చుకుని కార్లను లాగే కార్యక్రమాన్ని చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంపాల సీతారామయ్య, చెరుకూరి వెంకటకృష్ణ, రామినేని రాజశేఖర్, కందుల భాస్కరరావు, సర్పంచ్ కన్నమ్మ, ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫిజియోథెరపి

రెడ్డిగూడెం, జనవరి 3: స్థానిక మండల వనరుల కేంద్రంలో సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో దివ్యాంగులైన విద్యార్థులకు బుధవారం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. శిబిరంలో 12 మంది విద్యార్థులకు ఫిజియోథెరపీ చేయించినట్లు ఫిజియో థెరపిస్ట్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఫిజియోథెరపీ చేస్తున్న శ్రీనివాసరావు

పేదలకు ఆసరా.. సీఎం సహాయ నిధి

- ధైర్యంగా వైద్యం చేయించుకుంటున్న పేదలు
- ఎన్టీఆర్ వైద్యసేవల్లో లేని వాటికి సాయం
- నియోజకవర్గంలో రూ.9 కోట్లు అందజేత
- ప్రాణాలు నిలుపుతుందంటూ లబ్దిదారుల హర్షం

జి.కొండూరు, జనవరి 3: రోగం చిన్నదా, పెద్దదా అనేది సమస్య కాదు. సరైన వైద్యం చేయించామా లేదా అనేది ముఖ్యం. అది చిన్న ఆసుపత్రి అయినా కావచ్చు.. కార్పొరేట్ ఆసుపత్రి అయినా కావచ్చు.. ఖర్చుకు నేడు ఎవ్వరూ కూడా వెనుకాడటం లేదు. కారణం తెల్లరేషన్ కార్డుపై చాలా రోగాలకు ఉచితంగా వైద్యం అందుతోంది. తెల్లరేషన్ కార్డు లేకపోయినా ఎన్టీఆర్ హెల్త్ కార్డుపై పలు పెద్దాసుపత్రుల్లో ఉచితంగా వైద్యం చేస్తున్నారు. ఒక వేళ చేయించుకున్న వైద్యం ఎన్టీఆర్ హెల్త్ కార్డు లేదా తెల్లరేషన్‌కార్డు పరిధిలోకి రాకుంటే మిమ్మల్ని ఆదుకునేందుకు సీఎం సహాయనిధి సిద్ధంగా ఉంది.

మైలవరం నియోజవర్గంలో రూ.9 కోట్లు అందజేత

జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమా ప్రాతినిథ్యం వహిస్తున్న మైలవరం నియోజకవర్గంలోని బాధితులకు పార్టీలకు అతీతంగా పెద్ద మొత్తంలో నెలనెలా సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్నారు. మూడేళ్ల కాలంలో మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల్లో సుమారు రూ.9 కోట్లు అందించారు. స్థానిక టీడీపీ నేతలు బాధితులకు సహాయనిధి అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఎలా దరఖాస్తు చేసుకోవాలి

సీఎం సహాయనిధి పొందేందుకు వెలగపూడి సచివాలయం బ్లాక్-1లో దీని నిమిత్తం ప్రత్యేక విభాగం ఉంది. అందులో నేరుగా అర్జీలు సమర్పించవచ్చు. ఒక వేళ వైద్యం చేయించుకుని ఉంటే ఆస్పత్రి ఖర్చుల వివరాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు అందజేసి దరఖాస్తు చేసుకోవాలి. ఒకవేళ వైద్యం చేయించుకోవాలనుకుంటే ఎంత ఖర్చవుతుంది, ఏ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలనే వివరాలతో లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ)తో సంప్రదించాలి. లేదా స్థానిక టీడీపీ నేతలను కలిస్తే సీఎం సహాయనిధి పూర్తి వివరాలు తెలియజేస్తారు.


సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న మంత్రి ఉమా (ఫైల్)

ప్రభుత్వానికి రుణపడి ఉన్నా



నాకు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి వచ్చింది. దీంతో వైద్యం ఖర్చుల కోసం చాలా ఇబ్బంది పడ్డా. మంత్రి ఉమా మా గ్రామం వచ్చినప్పుడు నా ఇబ్బందిని ఆయన దృష్టికి తీసుకెళ్లా. ఆయన స్పందించడంతో వైద్య ఖర్చుల నిమిత్తం సహాయనిధి నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఆ సొమ్ముతో వైద్యం చేయించుకున్నా. ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నా. ప్రభుత్వానికి రుణపడి ఉన్నా.

\- మొండితోక కోటేశ్వరి, ఆత్కూరు

రూ.10 లక్షలు మంజూరయ్యాయి



నాకు కాలేయ మార్పిడి జరిగింది. పెద్ద మొత్తంలో ఖర్చయ్యింది. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నాకు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. నా ప్రాణాలు కాపాడిన ప్రభుత్వానికి కృతజ్ఞుడిని. ఇంత మొత్తంలో సాయం అందుతుందని కలలో కూడా ఊహించలేదు. ప్రభుత్వానికి, మంత్రి ఉమాకు, స్థానిక నేతలకు కృతజ్ఞతలు.

\- చల్లా శ్రీను, హెచ్.ముత్యాలంపాడు

వైద్య ఖర్చులు వచ్చాయి



రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయా. సీఎం సహాయనిధికి అర్జీ పెట్టుకున్నా. రూ.1.50 లక్షలు మంజూరయ్యాయి. వైద్య ఖర్చులకు సరిపోయాయి. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మా కుటుంబానికి అవి ఎంతో మేలు చేశాయి. నన్ను ఆదుకున్నందుకు ముఖ్యమంత్రికి, మంత్రి ఉమాకు, ఇతర టీడీపీ నేతలకు కృతజ్ఞతలు.

\- పొందుగల శ్రీహరి, కందులపాడు

సంక్షిప్తం

సీసీ రోడ్ల పరిశీలన


రోడ్డును పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

రాయనపాడు(గొల్లపూడి), జనవరి 3: రాయనపాడులో రూ.70 లక్షలతో నూతనంగా నిర్మించిన రోడ్లను క్వాలిటీ కంట్రోల్ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సంధర్భంగా క్వాలిటీ కంట్రోల్ ఏఈ వంకినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో అన్ని రోడ్లను క్వాలిటీ కంట్రోల్ మిషన్‌తో పరిశీలించామన్నారు. టెస్టింగ్ నిమిత్తం నూతన రోడ్డు నుంచి మిషన్ ద్వారా తీసిన బ్రిక్‌ను లాబ్‌కు తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఏఈ సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే గ్రామంలో రోడ్ల నిర్మాణం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తలారి సాంబశివరావు, టీడీపీ నేత కోమటి జగన్‌మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలకు అడ్డుకట్ట

విజయవాడ రూరల్, జనవరి 3: సంక్రాంతి కోడి పందేల నిర్వహణకు అడ్డుకట్ట పడనుంది. కోడి పందేలు, జూద క్రీడల నిర్వహణపై హైకోర్టు సీరియస్ అయిన నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక వచ్చింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ ఆదేశాల మేరకు కలెక్టర్లు, ఎస్పీ, నగర పోలీస్ కమిషనర్ ఆగమేఘాలపై అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పోలీసు, రెవెన్యూ, పశుసంవర్ధకశాఖ అధికారులతో ఉమ్మడి కమిటీలు వేశారు. జిల్లాలోని తహసీల్దార్‌లతో కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, పోలీసు అధికారులతో విజయవాడ సీపీ గౌతమ్ సవాంగ్ వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. కోడి పందేల నిర్వహణపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు


గరిమెళ్ల గోపాలరావు

జి.కొండూరు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులా చంద్రబాబు ప్రభుత్వం పని చేస్తుందని తెలుగు రైతు జిల్లా కార్యదర్శి గరిమెళ్ల గోపాలరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ జన్మభూమి పేదలకు పండుగ లాంటిదన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు, చంద్రన్న సంక్రాంతి కానుకలు అందిస్తూ సభల్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. పట్టిసీమతో డెల్టాతో పాటు పలు ప్రాంతాలకు సాగు నీరు అందించిన ఘనత మంత్రి ఉమాకు దక్కిందన్నారు.

సావిత్రిభాయి పూలేకు ఘన నివాళి


సావిత్రిభాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

ఇబ్రహీంపట్నం, జనవరి 3: సాంఘిక దురాచార నిర్మూలనోద్యమంలో సావిత్రి భాయిపూలే కీలక పాత్ర పోషించారని నియోజకవర్గ సమన్వ కమిటీ అధ్యక్షుడు నిడుముక్కల శంకర్రావు పేర్కొన్నారు. ఆనాడు అనేక కష్టాలు ఎదుర్కొని వేలాది మంది బడుగు, నిమ్నజాతుల స్త్రీలకు ఆమె విద్యా బోధన చేశారన్నారు. పూలే సహచర ధర్మచారిణిగా ఆయన జరిపిన పోరాటాలకు పని చేసిన ఘనత ఆమెకు దక్కుతుందన్నారు. తొలుత రింగ్ సెంటర్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూర్యప్రకాశరావు, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

స్వచ్ఛతే సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి


రోడ్లను శుభ్రం చేస్తున్న ప్రజాప్రతినిధులు

మూలపాడు(ఇబ్రహీంపట్నం), జనవరి 3: ఆత్మ గౌరవ దీక్షల్లో భాగంగా 16వ రోజు బుధవారం మండలంలోని మూలపాడులో అధికారులు, ప్రజా ప్రతినిధులు రోడ్లను శుభ్రం చేసి, ప్రజలకు అవగాహన కల్పించారు. జడ్పీటీసీ సభ్యురాలు చెన్నుబోయిన రాధ మాట్లాడుతూ స్వచ్ఛతేసేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. చెరుకూరి వెంకటకృష్ణ, ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్, సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

రాయనపాడు(గొల్లపూడి), జనవరి 3: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మందా వెంకటేశ్వరరావుమాదిగ డిమాండ్ చేశారు. మూడు రోజులుగా చేపట్టిన రిలే నిరాహారదీక్షల్లో భాగంగా బుధవారం రాయనపాడులో జరిగిన జన్మభూమి సభలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేర్చాలని, అఖిలపక్షాన్ని డిల్లీకి తీసుకువెళ్లి వర్గీకరణకు చట్టబద్ధతకు కృషి చేయాలన్నారు. మాదిగలను మోసం చేస్తే రానున్న ఎన్నికలలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ ఇన్‌చార్జి కొలకలూరి రవి, గుళ్ల ప్రభాకరరావు, మందా ఎస్సయ్య, ఎం.చిన్నా, కె.యిర్మియా, ఎం.సిలువ్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలి

ఇబ్రహీంపట్నం: ఎస్సీ వర్గీకరణ కోసం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు బుధవారం మూడో రోజు కొనసాగాయి. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి దొండపాటి సుధాకర్‌మాదిగ, సురేష్ మాదిగ, అరుణ్ మాదిగ, కిషోర్ మాదిగ, సుమంత్‌మాదిగ, కోట దానియేలు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పోరాటం తీవ్రం చేస్తాం

రెడ్డిగూడెం: ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు రెడ్డిగూడెం ప్రధాన సెంటర్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టినట్లు నియోజకవర్గ అధ్యక్షుడు మల్లాది రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలన్నారు. లేని పక్షంలో పోరాటం తీవ్రం చేస్తామన్నారు. కార్యక్రమంలో వి.రమేష్, కిషోర్, ఆటో యూనియన్ నాయకులు నాగరాజు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో దీక్షలను ప్రారంభిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, రెడ్డిగూడెంలో దీక్ష

చీడపీడలను నివారించగలిగారా?


సదస్సులో ప్రసంగిస్తున్న సుభాష్ పాలేకర్

- పరిశోధనలతో రైతులకు ఒరిగిందేమిటి?
- ఆత్మహత్యల నివారణకు ప్రకృతి సేద్యమే శరణ్యం
- శిక్షణ తరగతుల్లో సుభాష్ పాలేకర్


శిక్షణకు హాజరైన అధికారులు, ఉద్యోగులు, రైతులు

గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): 'జాతీయ స్థాయిలో రూ. వేలకోట్లతో జరుగుతున్న వ్యవసాయ పరిశోధనల వల్ల రైతులకు జరిగిన మేలు ఏమిటి? ఈ ఏడాది పింక్ బోల్‌వామ్‌తో పత్తి రైతులు దేశ వ్యాప్తంగా పెద్దఎత్తున నష్టపోయారు.. రెండేళ్ల నుంచి పింక్ బోల్‌వామ్ వస్తోంది. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, శాస్త్రవేత్తలు, కార్పొరేట్ సంస్థలు దీనిని ఎందుకు నివారించలేకపోయాయి' అని పెట్టుబడి లేని ప్రకృతి సేద్యం సృష్టికర్త సుభాష్ పాలేకర్ ప్రశ్నించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట బైబిల్ మిషన్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న ప్రకృతి సేద్యం శిక్షణ తరగతులు నాలుగోరోజు బుధవారం కొనసాగాయి. కార్యక్రమానికి వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ హరిజవహర్‌లాల్ అధ్యక్షత వహించారు. సుభాష్ పాలేకర్ మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యల ఘటనలను అరికట్టాలంటే ప్రకృతి సేద్యమే శరణ్యమన్నారు. దేశవ్యాప్తంగా పెట్టుబడి లేని ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులు ఎక్కడా ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు లేవని పేర్కొన్నారు.

వ్యర్థాలు దగ్ధం చేయడం తగదు

భూమిపై ఉండే వివిధ రకాల వ్యర్థాలను దగ్ధం చేయడం మయసభలో ద్రౌపది వస్త్రాపరహణంతో సుభాష్ పాలేకర్ పోల్చారు. వస్త్రాపరహణం చేసే దుశ్శాసనులుగా ప్రభుత్వాలను పరిగణించారు. ఈ జాబితా నుంచి సీఎం చంద్రబాబును మినహాయిస్తున్నట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వం ముందుగానే మేల్కొన్నట్లు తెలిపారు. ప్రభుత్వమే ఈ విధానాన్ని ప్రోత్సహించడం వలన 4-5 ఏళ్లలోనే ప్రపంచమంతా ఏపీ వైపు చూసే దశ వస్తుందన్నారు. భూమిపై ఉండే వ్యర్థాలను దగ్ధం చేయకుండా, అక్కడే కలిసే విధంగా ఏర్పాట్లు చేయాలి. దీని వల్ల భూమిలో పోషక పదార్థాలు పెరిగి మొక్కలకు మేలు జరుగుతాయని పాలేకర్ వివరించారు.

పర్యావరణానికి మేలు

ప్రకృతి సేద్యం పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ హరిజవహర్‌లాల్ తెలిపారు. రైతులు విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఉపయోగించడం వల్ల ఆర్థికంగా నష్టపోవడమేకాకుండా వ్యవసాయ ఉత్పత్తుల్లో నాణ్యత తగ్గుతున్నట్లు చెప్పారు. పెట్టుబడి లేని సేద్యం వల్ల రైతులు ఆర్థికంగా ఎదుగుతారని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు సూచించారు. ప్రధానంగా ఆవుల వలనే ఇది సాధ్యమన్నారు. జాయింట్ కలెక్టర్-2 ముంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో పెట్టుబడి లేని సేద్యంపై దృష్టి పెట్టామన్నారు. మారిషస్ హైకమిషనర్ జగదీష్ ప్రకాశ్ మాట్లాడుతూ సుభాష్ పాలేకర్ విధానాల వల్ల తమ దేశం ఎంతో అభివృద్ధి చెందినట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ విజయభారతి, డీడీలు తిరుపయ్య, రామలింగయ్య, ప్రకృతి సేద్యం జిల్లా అధికారి రామ్మోహన్, గుంటూరు డీఎల్‌పీవో సుబ్రమ్మణ్యం పాల్గొన్నారు.


శిక్షణలో పాల్గొన్న ఐటీ ఉద్యోగులు


శిక్షణలో జీరో బడ్జెట్ సిబ్బంది...


భోజన నాణ్యతను పరిశీలిస్తున్న జేసీ-2 ముంగా, వ్యవసాయ అధికారులు

ప్రకృతి సేద్యమే సరైన సమాధానం

- మారిషస్ హై కమిషనర్ జగదీష్ ప్రకాష్



గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా పొంచి ఉన్న ఆహార కొరత నివారణకు ప్రకృతి సేద్యమే సరైన సమాధానమని మారిషస్ హైకమిషనర్ జగదీష్ ప్రకాష్ పేర్కొన్నారు. ప్రకృతిసేద్యంతో రైతులకు, వినియోగదారులకు, భూమికి మేలు జరుగుతుందన్నారు. ప్రకృతి సేద్యాన్ని మారిషస్‌లో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఇటువంటి శిక్షణ తరగతులు నిర్వహించటం హర్షణీయమన్నారు. దేశీయ ఆవులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రకృతి సేద్యంలో అంతర పంటల విధానం వల్ల రైతులకు అధిక ప్రయోజనం కలుగుతుందన్నారు. అయితే పండిన పంటను మార్కెటింగ్ చేయటంలో రైతులకు సరైన సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఘనంగా ముగిసిన నాటకోత్సవాలు


యండమూరి వీరేంద్రనాథ్‌ను సత్కరిస్తున్న సాంబశివరావు, సుబ్బరాయశర్మ

విజయవాడ కల్చరల్, జనవరి 3: మహతి క్రియేషన్స్, ఏపీ ప్రభుత్వ భాషా సాంస్కృతిక, ఉప్పులూరి సుబ్బరాయశర్మ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రథమ సాంఘిక నాటకోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఏపీ నాటక అకాడమీ ఉపాధ్యక్షుడు కందిమళ్ల సాంబశివరావు, ఉప్పులూరి సుబ్బరాయశర్మ, మద్దాలి రఘురామ్‌లు ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం విశాఖపట్నం తెలుగు కళాసమితి బృందం ప్రదర్శించిన కుక్కపిల్ల నాటిక అలరించింది. భారతుల రామకృష్ణ కథకు జె.ఎస్.సతీష్ దర్శకత్వం వహించారు. గీతాంజలి ఆర్ట్స్ థియేటర్ ప్రదర్శించిన అనగనగా ఓ ఆఫీసు నాటిక సందేశాత్మకంగా సాగింది. బి.వి.శ్యామ్‌ప్రసాద్ రచనకు వడ్డాది సత్యనారాయణ దర్శకత్వం వహించారు.

విజేతలుగా తిరిగి రావాలి

విజయవాడ స్పోర్ట్స్, జనవరి 3: జాతీయ స్థాయి సీనియర్ బాల్‌బాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికైన బాల, బాలికలను బుధవారం స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో శాప్ వీసీ, ఎండీ బంగార్రాజు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలలో గెలుపొంది విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

హర్యానా రాష్ట్రంలోని గుర్గాన్‌లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరుగనున్న 63వ జాతీయస్థాయి సీనియర్ బాల్ బాడ్మింటన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరుపున పాల్గొనే జట్ల వివరాలను బాల్‌బాడ్మింటన్ జనరల్ సెక్రటరీ ఆర్.వెంకట్రావు వెల్లడించారు. **బాలుర జట్టు-** వి‌ఎస్.సురేష్(కర్నూలు), వైవి.శివకుమార్‌రెడ్డి(తూర్పుగోదావరి), ఎం.సురేష్(నెల్లూరు), పి.కార్తిక్(చిత్తూరు),ఆర్.అనిల్‌కుమార్(తూర్పుగోదావరి), ఎస్‌కె.చాన్‌బాషా(నెల్లూరు), ఎస్‌వి.శివరామకృష్ణ (కృష్ణా), పి.శ్యామ్ కుమార్(విశాఖపట్నం), బి.రవికుమార్(అనంతపూర్), కె.శివశంకర్‌నాయుడు(కర్నూలు)

బాలికల జట్టు- ఆర్.అపర్ణ(కృష్ణా), పివివిఎస్.ఐశ్వర్య(విజయనగరం), పివిఎస్‌ఎస్.జయలక్ష్మి(విజయనగరం), జెవివిఎస్.వరలక్ష్మి(తూర్పుగోదావరి), పి.ప్రభావతి(విశాఖ), బి.కళ్యాణి(కృష్ణా), కె.ఫణితచౌదరి(కర్నూలు), ఎ.పార్వతి(విజయనగరం), డి.శ్రావణి(గుంటూరు), జి.శిరిష(కర్నూలు)

ఏడీసీకి 'తుడా' ఓఎస్డీ పెంచలరెడ్డి బదిలీ

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణకు ఓఎస్డీగా 'తుడా'లో పని చేస్తున్న సీహెచ్ పెంచలరెడ్డిని విజయవాడలోని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ)కు డిప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తుతం సమన్వయపరుస్తున్న పెంచలరెడ్డి ఏడీసీకి బదిలీ అయిన తర్వాత కూడా మంత్రి ఓఎస్డీగా కొనసాగుతూ, ఆయా కార్యక్రమాలను పర్యవేక్షిస్తుంటారని పేర్కొంది. ఈయనను తగిన పోస్టులో నియమించాల్సిందిగా ఏడీసీ సీఎండీని ప్రభుత్వం ఆదేశించింది.

ఏఎన్‌యూలో 60 పోస్టులు

- నేడు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి నోటిఫికేషన్
- ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 25 వరకు గడువు
- పూర్తి చేసిన దరఖాస్తులు 30 లోగా అందజేయాలి

ఏఎన్‌యూ, జనవరి 3: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయనున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి వర్సిటీ అధికారులు గురువారం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులను గురువారం నుంచి ఈనెల 25వ తేదీ లోపు పూర్తిచేయాల్సి ఉంటుంది. పూర్తిచేసిన ఆన్‌లైన్ దరఖాస్తులను, అకనాలెడ్జ్‌మెంట్, రిజిస్ట్రేషన్ ఫీజులను డౌన్‌లోడ్ చేసి వర్సిటీ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈనెల 30వ తేదీ లోగా అందజేయాలి. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ గతేడాది విడుదల చేసిన జీవో 41 ప్రకారం మొత్తం 60 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు రోస్టర్ పాయింట్లను నిర్ణయించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు గతంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈనెల 6 లోగా విశ్వవిద్యాలయాలలో నోటిఫికేషన్ జారీచేయాలనే అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ఏఎన్‌యూ ముందస్తుగా ఉద్యోగాల నియామకానికి నోటిఫికేషన్ జారీచేస్తున్నారు. ఆర్ట్స్ గ్రూపుల్లో -26, సైన్స్ గ్రూపుల్లో -22, ఇంజనీరింగ్ గ్రూపులో -11, పరిశోధనా కేంద్రాల్లో -1 వంతున పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

ప్రభుత్వం సూచించిన మేరకు స్ర్కీనింగ్ టెస్టులో రెండు పేపర్లు, అభ్యర్థులు రాయాల్సి ఉంటుంది. పేపర్-1లో 120 మార్కులు, పేపర్ -2లో 180 మార్కులు ఉంటాయి. అబ్జెక్టివ్ విధానంలో జరిగే పరీక్ష పేపర్-1 రెండు గంటలు, పేపర్- 2 మూడు గంటలు వ్యవధిలో పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షలు ప్రతి తప్పు జవాబుకు 1/3 వంతు నెగిటివ్ మార్కులు ఉంటాయి. ఆన్‌లైన్ స్ర్కీనింగ్ టెస్టుల్లో అర్హత సాధించిన అభ్యర్థులు ఓరల్ ఇంటర్వ్యూలకు ఓసీ అభ్యర్థులు 40 శాతం, బీసీ అభ్యర్థులు 35శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులు 30 శాతం అర్హత మార్కులను సాధించాల్సి ఉంటుంది. ఇంటర్వ్యూల నిర్వహణ బాధ్యతను వర్సిటీలే తీసుకోనున్నాయి. స్ర్కీనింగ్ టెస్టు బాధ్యతను విశ్వవిద్యాలయం లేదా ఏదైనా ఏజెన్సీకి అప్పగించే అవకాశం ఉంది.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీల వివరాలు

ఆర్ట్స్ గ్రూపులో... కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్- 4, ఎకనామిక్స్ -5, ఇంగ్లీష్ -2, లా -3, పొలిటికల్ సైన్స్ - 3, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ -4, రూరల్ డెవలప్‌మెంట్ -1, తెలుగు ఓరియంటల్ లాంగ్వేజెస్ -4 వంతున పోస్టులు ఉన్నాయి.

సైన్స్ గ్రూపులో..

బయోటెక్నాలజీ -4, బోటనీ అండ్ మైక్రో బయాలజీ -4, కెమిస్ట్రీ -2, జియాలజీ -2, మ్యాథమెటిక్స్ -3, ఫార్మసీ -2, ఫిజిక్స్ -1, స్టాటిస్టిక్స్ -1, యునిక్ -1, జువాలజీ -2 పోస్టులు

ఇంజనీరింగ్ గ్రూపులో...

ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్‌లో 1, సివిల్ ఇంజనీరింగ్ -2, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ -3, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) -2, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ -1, మెకానికల్ ఇంజనీరింగ్ -2, పరిశోధనా కేంద్రాల గ్రూపులో సెంటర్ ఫర్ సైంటిఫిక్ సోషలిజం -1 వంతున పోస్టులు ఉన్నాయి. ఖాళీలు, రోస్టర్ పాయింట్లు, ఆన్‌లైన్ దరఖాస్తులు తదితర వివరాలను వర్సిటీ వెబ్‌సైట్ www.anu.ac.in, http://www.sche.ap.gov.in నుంచి పొందవలసి ఉంది.

రహదార్ల గ్రావెల్ కోసం

సీఆర్‌డీఏ కమిషనర్ పరిశీలన



లేమల్లెలో గ్రావెల్ నిల్వలను తెలుసుకుంటున్న సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్

అమరావతి, జనవరి 3: రాజధాని నిర్మాణంలో రహదారుల ఏర్పాటుకు అవసరమైన గ్రావెల్‌ను సమకూర్చేందుకు సీఆర్‌డీఏ పరిధిలోని కర్లపూడి, లేమల్లె ప్రాంతాల్లోని కొండ దిగువన ఉన్న భూములను బుధవారం సీఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ స్వయంగా పరిశీలించారు. కర్లపూడి నుంచి చావపాడు వరకు ఉన్న కొండచుట్టూ 750 మీటర్ల పరిధిలో గ్రావెల్ అందుబాటులో ఉన్నట్లు మైనింగ్ అధికారులు గుర్తించడంతో కమిషనర్ శ్రీధర్, సీఆర్‌డీఏ డైరక్టర్ చెన్నకేశవులు, అదనపు కమిషనర్ శ్రీనివాసులు, షణ్ముగన్‌లు గ్రావెల్ నిల్వలు ఉన్న ప్రదేశాలను పరిశీలించారు. వీరి వెంట అమరావతి తహసీల్దార్ భాస్కరరావు ఉన్నారు.

పుస్తక సంబరాల్లో రచ్చ

- సైబాబా పుస్తకావిష్కరణను అడ్డుకున్న సమైక్యవాదులు
- తెలంగాణ ఉద్యమ సమయంలో రాసిన కవితపై అభ్యంతరం
- క్షమాపణ చెప్పాలని డిమాండ్
- ప్రతిగా రచయితల వేదిక ఆందోళన
- ప్రధాన ద్వారం వద్ద 'మొఖామి' ఆవిష్కరణ
- పోటాపోటీగా నినాదాలు



నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు



నచ్చచెబుతున్న నిర్వాహకులు

విజయవాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ... ఇంకెంత కాలం నీ గారడీ పాట... భాడ్‌ఖావ్... నా కొడక... ఈ పదాలతో తెలంగాణ కవి స్కైబాబా రాసిన కవిత పుస్తక సంబరాల్లో రచ్చకు దారి తీసింది. నాడు కవితలో ఉపయోగించిన పదాలు సమైక్యవాదుల మనస్సులను ఎంతో గాయపరిచాయి. విజయవాడ స్వరాజ్య మైదానంలో జరుగుతున్న పుస్తక సంబరాల్లో ప్రతి రోజూ సాయంత్రం అయిదు గంటల నుంచి వివిధ అంశాలపై చర్చ, అనంతరం పుస్తకావిష్కరణలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా తెలంగాణకు చెందిన కవి స్కైబాబా రాసిన 'మొఖామి' పుస్తకావిష్కరణ షెడ్యూల్ ఉంది. ఈ విషయం తెలుసుకున్న సమైక్యవాదులు ఆవిష్కరణ వేదిక వద్దకు వచ్చారు. దీనికి ముందు జరిగిన 'సాహితీసృజనలో స్త్రీలు' అన్న అంశంపై స్కైబాబా సతీమణి షాజహానా మాట్లాడారు. ఆ సమయంలో స్కైబాబా అక్కడే ఉన్నారు. కార్యక్రమం అనంతరం వారు వెళ్లిపోయారు. డాక్టర్ ఇండ్ల విశాల్ రాసిన 'పిల్లల పెంపకం ఒక కళ' పుస్తకావిష్కరణ కార్యక్రమం ప్రారంభమతున్న తరుణంలో టీడీపీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ వేదిక ఎక్కి స్కైబాబా వేదిక వద్దకు రావాలని మైక్‌లో పిలిచారు. అనంతరం టీడీపీ నేత గన్నె ప్రసాద్, పలువురు స్కైబాబా ఆంధ్రులకు వ్యతిరేకంగా రాసిన కవితలకు సంబంధించిన ప్రతులను చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. స్కైబాబా క్షమాపణ చెప్పిన తర్వాతే పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని పట్టుబట్టారు. ఆయన 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' పాటను ఒక గారడీగా వర్ణించడాన్ని దుయ్యబట్టారు. స్కైబాబాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దక్షిణ మండలం సహాయ కమిషనర్ కంచి శ్రీనివాసరావు, సూర్యారావుపేట ఇన్‌స్పెక్టర్ వినయ్‌మోహన్ సిబ్బందితో రంగప్రవేశం చేసి ఆందోళనకారులను అడ్డుకున్నారు. కాసేపటికి ప్రచురణకర్త సజయ, స్కైబాబా దంపతులు మరి కొంతమంది రచయితలు సభావేదిక వద్దకు వచ్చారు. పుస్తకావిష్కరణ ను అడ్డుకోవడంతో రచయితలూ నిరసన వ్యక్తం చేశారు. భావప్రకటన స్వేచ్ఛను కాపాడాలని వారు నినాదాలు చేశారు. స్కైబాబా దంపతు లకు రక్షణగా నిలిచారు. భావప్రకటన స్వేచ్ఛను కాపాడాలని రచయితలు నినాదాలు చేస్తుంటే, జై తెలుగుతల్లి అంటూ సమైక్యవాదులు నినాదాలు చేశారు. రెండు వర్గాలు ఎదురెదురుగా నినాదాలు చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు రచయితలను వేరే వాహనంలో ఎక్కించి తరలించడానికి బయటకు తీసుకెళ్తుండగా ప్రధాన ద్వారం వద్ద 'మొఖామి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అక్కడ స్కైబాబా మీడియాతో మాట్లాడారు. "పుస్తకావిష్కరణను అడ్డుకోవడం ప్రజాస్వామ్యంలో హక్కులను కాలరాయడమే. నేను క్షమాపణ చెప్పను" అని స్పష్టం చేశారు. అనంతరం ప్రత్యేక కారులో వారిని పోలీసులు అక్కడి నుంచి పంపించివేశారు.



సీఐ కాశీనాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న న్యాయవాదులు తదితరులు

బదరీనాథ్‌బాబు చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

- దుర్గగుడిలో పూజలపై విచారణ జరిపించాలి
- పోలీసులకు తొలి ఫిర్యాదు

విజయవాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి అంతరాలయంలో గతనెల 26వ తేదీ అర్ధరాత్రి జరిగిన భైరవి పూజ విషయంలో ఆలయ ముఖ్య అర్చకుడు బదరీనాథ్‌బాబు చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. దుర్గమ్మను దర్శించుకునేందుకు రాష్ట్రపతి సతీమణి వస్తున్నందున ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేయడం కోసం అర్ధరాత్రి కార్యక్రమాన్ని నిర్వహించామని చెబుతున్నప్పటికీ, వారి ఉద్దేశం వేరుగా ఉందన్నది స్పష్టమవుతోంది. ముఖ్య అర్చకుడు బదరీనాథ్‌బాబుతో పాటు ఆయన వదిన మనవడు సుజన్, పిన్నికొడుకు పార్థసారథి అలియాస్ రాజ, ఆలయ అర్చకుడి బంధువు ప్రణవ్ మొత్తం నలుగురితోపాటు మరో ముగ్గురు సిబ్బంది ఆ రోజున ఆలయంలో తంతును నడిపించినట్టు తెలుస్తోంది. పోలీసులు సుమోటోగా స్వీకరించి చేపట్టిన ప్రాథమిక విచారణలో రాత్రి పూజలు జరిగినట్టు చెప్పారు కానీ, ఏ పూజ అన్నది చెప్పలేకపోతున్నారని తేలింది. అయితే పోలీసు విచారణలో తామంతా బదరీనాథ్ బాబు పిలిస్తే వచ్చామని, ఏదో పూజఉంది రమ్మని పిలిపించారని కూడా స్పష్టంచేశారు. తమకు ఏమీ తెలియదని తొలుత బుకాయించినప్పటికీ చివరికి పూజలు జరిగినట్టు అంగీకరించారు. తాము అలంకారం మాత్రమే చేశామని, పూజలు నిర్వహించిందెవరో తమకు తెలియదని స్పష్టం చేశారు. ఆ రోజు అక్కడ రెగ్యులర్‌గా ఉండే సిబ్బందిని బయటకు పంపించినట్టు కూడా పోలీసుల విచారణలో తేలింది. రెగ్యులర్‌గా ఉండే ఎస్పీఎఫ్ పోలీసులు మాత్రమే అక్కడ ఉండడం గమనార్హం!

ప్రత్యేక పూజలపై విచారణ జరిపించాలి

దుర్గగుడిలో అర్ధరాత్రి పూజలపై బుధవారం తొలిసారిగా వన్‌టౌన్ పోలీసు స్టేషన్ సీఐ దాసరి కాశీనాథ్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. గుడిలో అర్ధరాత్రి పూజ ఆగమానికి విరుద్ధమని, భైరవి పూజలు పరిచయం ఉన్నవారే చేయాల్సి ఉంటుందని, దీనికి భారీ వ్యయయమవుతుంది, దీని వెనుక ఎవరు ఉన్నారో విచారణ చేయించి దర్యాప్తు చేయించాలని ధర్మ ప్రచార సమితి నాయకులు ఏలేశ్వరపు జగన్మోహనరాజు, బ్రాహ్మణ సంఘం నాయకులు కొప్పరపు బలరామ్, న్యాయవాదులు కోటంరాజు వెంకటేష్ శర్మ, అన్నవరపు వెంకటేశ్వరరావు, కొణిజేటి రమేష్, కొనకళ్ళ విద్యాధరరావు తదితరులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

దర్యాప్తు చేస్తాం

డిసెంబరు 26వ తేదీ అర్ధరాత్రి ఘటనపై ఇద్దరు న్యాయవాదులతో పాటు మరికొందరు కలిసి మొదటిసారిగా ఫిర్యాదుచేశారు. ఫిర్యాదు ఆధారంగా విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి వారిచ్చే ఆదేశాల మేరకు దర్యాప్తు చేస్తాం. భక్తుల మనోభావాలకు భంగం వాటిల్లకుండా సున్నితమైన ఈ అంశంపై జాగ్రత్తగా విచారణ చేయాల్సి ఉంది. ఆలయ నిబంధనలకు విరుద్ధంగా జరిగి ఉంటే చర్యలు తీసుకుంటాం.


- సీఐ కాశీనాథ్

పుస్తక మహోత్సవంలో నేడు

- సాయంత్రం 4.00 గం. : పుస్తక ప్రియుల పాదయాత్ర.. ప్రెస్‌క్లబ్ నుంచి..
- **సీవీ సాహిత్య వేదికపై..**
- సాయంత్రం 5.00 గంటలకు : ప్రత్యేక సభ
- సాయంత్రం 6.30 గంటలకు : డాక్టర్ బి.వి.పట్టాభిరామ్ టాక్ షో
- రాత్రి. 8.00 గంటలకు : సోర్సెస్ ఆఫ్ హిస్టరీ ఆఫ్ తెలుగు పుస్తకావిష్కరణ
- **అబ్దుల్ కలాం ప్రతిభ వేదికపై..**
- సా.6.00 నుంచి: పిల్లలకు ప్రత్యేక కార్యక్రమాలు

గౌరీ లంకేశ్.. కొలిమి రవ్వలు

ఇటీవల మతోన్మాదుల చేతిలో హత్యకు గురైన ప్రముఖ పాత్రికేయురాలు గౌరీ లంకేశ్ జాతీయ స్థాయిలో రాసిన పలు పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక కథనాల సమాహారం 'కొలిమి రవ్వలు' పుస్తకం బుక్ ఫెస్టివల్‌లో కొలువుతీరింది. ఎందరో అభిమానాన్ని చూరగొన్న గౌరీ లంకేశ్ జీవితాన్ని, జర్నలిస్టుగా, యాక్టివిస్టుగా ఆమె పనితీరును పరిచయం చేసే పుస్తకం ఇది. వివిధ రంగాలలో చోటు చేసుకుంటున్న ఛాందస ధోరణులను, ప్రభుత్వ బాధ్యతారహిత చర్యలను, రాజకీయ నాయకుల తప్పులను, వ్యాపారవేత్తల అవకతవకలను ఎత్తి చూపుతాయి ఆమె రచనలు. హైదరాబాద్ బుక్ ట్రస్టు వెలువరించిన ఈ పుస్తకం పుస్తక మహోత్సవంలో కొలువుదీరింది.



వస్తు గుణ ప్రణాళిక

ఇది.. ప్రాచీన ప్రామాణిక ఆయుర్వేద గ్రంథం. 1983 నుంచి ప్రచురిస్తున్న గ్రంథం ఇది. వీటూరి వాసుదేవ శాస్త్రి ఈ పుస్తకావిష్కరణకు ఆద్యులు. ఆయన ఇప్పుడు లేరు. కానీ ఆయన కర్తగా వచ్చిన ఈ పుస్తకం అనేక ముద్రణలకు నోచుకుంది. ఆయుర్వేద వైద్యానికి కూడా ఈ గ్రంథం ఎంతగానో దోహదపడుతోంది. ఎంతోమందికి రీసెర్చి గ్రంథంగానూ మారుతోంది. ఈ పుస్తకంలో ఆయుర్వేద మొక్కలు, ఔషధాల వివరాలు, వైద్య విధానాలు, చికిత్సా పద్ధతులు ఉంటాయి. కోటికి పైగా ఔషధ గుణాల వివరణ ఉంటుంది.



మనసులో మాట

శాస్త్ర గ్రంథాలన్నీ తెలుగులో రావాలి

» ఆంధ్రజ్యోతితో పీకాక్ క్లాసిక్స్ ఎడిటర్ గాంధీ



సమాజంలో సాహిత్య అభిరుచిని పెంపొందింప చేసేందుకు 60 సంవత్సరాల క్రితమే మంచి కథా సాహిత్యం వచ్చింది. ఎందరో కవులు, మేధావులు, రచయితలు, జాతీయ నేతలు, ప్రముఖులు జీవిత చరిత్రలు ఎన్నో తెలుగులో ఉన్నాయి. తెలుగు భాషకు ఎంతో ప్రాధాన్యత ఉన్నప్పటికీ నేటికీ ఇంగ్లీషులో రాయడం, చదవడం దురదృష్టకరమైన విషయం. ఇప్పటికీ ఫిలాసఫీ, సైన్సు, ప్రకృతి శాస్త్రాలకు సంబంధించి తెలుగులో ఒరిజనల్ పుస్తకాలు లేవు. సరైన అనువాదాలూ లేవు. తత్వ శాస్త్రాలు, ఇతర శాస్త్రాలకు సంబంధించిన పుస్తకాలు ఆణిముత్యాలు లాంటివి. ఇవి పూర్తిగా తెలుగులో రావాలి. పీకాక్ క్లాసిక్స్ ఆ ప్రయత్నంలో ఉంది. పుస్తకాలను అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగా ఈ పుస్తక మహోత్సవంలో ఏర్పాటు చేసిన పీకాక్ క్లాసిక్స్‌లో (స్టాల్ నెంబరు 92)లో అన్ని రకాల పుస్తకాలపై 30 శాతం రాయితీ ఇస్తున్నాం.

జ్ఞానాంధ్రగా మార్చేందుకు...

» వాసిరెడ్డి నవీన్, 'కథ' సంపాదకుడు



పుస్తక ప్రదర్శన అంటే నాకు మహా ఇష్టం. దేశంలో అతి పెద్ద రెండవ పుస్తక ప్రదర్శన విజయవాడలో నిర్వహిస్తున్నాం. సాహిత్య కార్యక్రమాల నిర్వహణ ఈ ఏడాది ప్రత్యేకత. ఈ బాధ్యతలను నాపై ఉంచడం ఆనందంగా ఉంది. దీనికోసమే ఈ సారి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 80 మంది రచయితలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి మాట్లాడించాలని నిర్ణయించాం. ఇది గొప్ప ప్రయత్నం. రచయితలకు, పుస్తకాలకు ఎప్పుడూ ఒక రకమైన ఆత్మీయ సంబంధం ఉంది. ఈ సంబంధాలను మెరుగు పరచడం నేను చేస్తున్న ప్రయత్నం. రోజుకు ఎనిమిది నుంచి పది మంది సాహితీవేత్తలు సదస్సులో పాల్గొంటున్నారు. కవులు, రచయితల భాగస్వామ్యంతో నవ్యాంధ్రను జ్ఞానాంధ్రగా మార్చడానికి ప్రయత్నిస్తున్నాం.

విప్లవ సాహిత్యం ప్రజల్లోకి వెళ్లాలి

» అరసవిల్లి కృష్ణ, విరసం



విప్లవ అభ్యుదయ సాహిత్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన అవసరం ఉంది. గత ఐదేళ్లుగా ఈ ప్రాంగణంలో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాం. ప్రధానంగా బోల్షివిక్ పార్టీ చరిత్ర, బీళ్ళు దున్నేరు, నిషిధ, గౌరీ లంకేష్ 'కొలిమి రవ్వలు', పూలన్ దేవి జీవిత కథ, కోకూ సాహిత్యం వంటి పుస్తకాలు బాగా కొంటున్నారు. విప్లవ, అభ్యుదయ భావాలను తెలియజెప్పే పుస్తకాలు మా వద్ద ఉన్నాయి.

అలకనందకు మంచి ఆదరణ

» నరసింహారావు, అశోక్ బుక్ సెంటర్



తెలుగులో అలకనందన ప్రచురణలకు పాఠకుల నుంచి మంచి ఆదరణ ఉంది. ప్రధానంగా మా స్టాల్స్‌లో చిన్నపిల్లల కార్టూన్ బుక్స్, లైఫ్ సైన్స్, పాలిటిక్స్, బయోగ్రఫీ పుస్తకాలు ఎక్కువగా అమ్ముడు పోతున్నాయి. పాఠకులు ఎప్పటికీ తగ్గరు. ఆదరణ చూపించే వారు తగ్గినా పుస్తకాలు నిరంతరం చదువుతున్న వారు ఉన్నారు. ఇంకా పాఠకుల అభిరుచులకు అనుగుణంగా పుస్తకాలు తీసుకు రావడానికి కృషి చేస్తున్నాం.



సాహితీ శోభ

పుస్తక మహోత్సవ ప్రాంగణంలో సాహితీ శోభ వెల్లివిరుస్తోంది. ప్రతి ఏటా అక్షర ప్రేమికులైన సాహితీవేత్తలు ఈ మహోత్సవాలకు వస్తూనే ఉన్నా, ఈ ఏడాది ప్రత్యేకించి సాహితీ సభలు పెట్టడంతో సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు.. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పుస్తక మహోత్సవానికి వస్తున్నారు. బుధవారం వీరి సంఖ్య రోజూ కంటే అధికంగా కనిపించింది. సందర్శకుల సంఖ్య కూడా పెరగటంతో పుస్తక మహోత్సవానికి ప్రత్యేక కళొచ్చింది. విద్యార్థులు అధిక సంఖ్యలో రావడం ఈ ఏడాది ప్రత్యేకంగా కనిపిస్తోంది.





అనువాదంతోనే తెలుగుకు వెలుగు

- » హిందీ అకాడమీ ఏర్పాటుతోనే అది సాధ్యం
- » మాజీ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

విజయవాడ కల్చరల్, జనవరి 3 : తెలుగు రచనలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించాలంటే అనువాదం కావాలని, దీని కోసం హిందీ అకాడమీని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని మాజీ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సూచించారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఆధ్వర్యంలో బుధవారం పుస్తక ప్రదర్శన ప్రాంగణంలోని ప్రధాన వేదికపై ఏర్పాటు చేసిన పుస్తకాల ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఇతర రాష్ట్రాలకు అనువాద రూపంలో వెళితే మన రచనల శక్తి తెలుస్తుందని, ఈ విషయంలో మన రాష్ట్రం మాత్రమే దేశంలో వెనుకబడి ఉందన్నారు. మన రచనలకు అనువాదాలు జరగకపోవటంతో జ్ఞానపీఠంలాంటి అవార్డులు మనకు దక్కటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనువాదాల అవసరాలు తెలుసుకొని హిందీ అకాడమీని ఏర్పాటు చేసి, ఒక చైర్మన్‌ను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న, ద్వానా శాస్త్రి రచించిన తెలుగు భాష చరిత్ర పుస్తకాలు విద్యార్థులకు తల్లిదండ్రులలాంటివన్నారు. సిమ్మన్న రచించిన తెలుగు భాష చరిత్ర పుస్తకాన్ని యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆవిష్కరించగా, తాళ్లూరు నాగేశ్వరరావు, ఉషశ్రీ రచించిన శతవసంతాల తెలుగు కథను ప్రొఫెసర్ సిమ్మన్న ఆవిష్కరించారు. పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి రచించిన మహాభారత చరిత్రం పుస్తకాన్ని ఎం.నాగేశ్వరరావు, ముక్తవరం పార్థసారథి రచించిన విశ్వకథా శతకం పుస్తకాన్ని డాక్టర్ గుమ్మా సాంబశివరావు ఆవిష్కరించారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ గడ్డం కోటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించగా, మేనేజర్ మనోహర్‌నాయుడు వందన సమర్పణ చేశారు.



తెలుగు భాష చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వెలమల సిమ్మన్న, గడ్డం కోటేశ్వరరావు, మనోహర్‌నాయుడు తదితరులు

నేడు పుస్తక ప్రియుల పాదయాత్ర

- » సాయంత్రం 4 గంటలకు ప్రెస్‌క్లబ్ నుంచి..
- » నేతృత్వం వహించనున్న ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్

విజయవాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : 29వ పుస్తక మహోత్సవం సందర్భంగా.. గురువారం నగరంలో పుస్తకప్రియుల పాదయాత్ర జరగనుంది. పుస్తకం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించటానికి, పుస్తకానికి ఆదరణ తీసుకురావటానికి 27 సంవత్సరాలుగా బుక్‌ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ పాదయాత్రను నిర్వహిస్తున్నారు. ప్రతిఏటా భావితరానికి ప్రతీకలైన విద్యార్థులను, యువతను పెద్ద ఎత్తున ఈ పాదయాత్రలో భాగస్వాములను చేస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు విజయవాడ ప్రెస్‌క్లబ్ నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుంది. సీనియర్ సంపాదకులు కె.రామచంద్ర మూర్తి జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తారు. ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ పాదయాత్రకు నేతృత్వం వహిస్తారు. అనంతరం బుక్ ఫెస్టివల్ గ్రౌండ్‌లోని సీవీ సాహిత్య వేదికపై ప్రత్యేకసభ జరుగుతుంది. సభలో ఇండియా టుడే మ్యాగజైన్ సంపాదకులు ఎస్ వెంకటనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. విశిష్ట అతిథులుగా ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్, సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి పాల్గొంటారు.



యండమూరి రచించిన 'పిల్లల పెంపకం ఒక కళ' పుస్తకాన్ని సాహిత్య వేదికపై మంత్రి కొల్లు రవీంద్ర, రచయిత యండమూరి, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, డాక్టర్ విశాల్ తదితరులు బుధవారం ఆవిష్కరించారు.

రచనల్లో ఇంటర్ సెక్షనాలిటీ రావాలి

- » కొత్త పుంతల్లో దళిత సాహిత్యం
- » క్రిస్టియన్, మైనారిటీ రచనలు పెరగాలి
- » 'సాహితీ సృజనలో స్త్రీలు' చర్చావేదికపై రచయిత్రులు

విజయవాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి)
'దళిత సాహిత్యం ఇప్పుడిప్పుడే కొత్త పుంతలు తొక్కుతోంది. క్రిస్టియన్, మైనారిటీ వర్గాలపై రచనలు మరింతగా పెరగాలి. కోస్తాంధ్ర, రాయలసీమల్లో రచయిత్రులు పెరగాల్సిన ఆవశ్యకత ఉంది...' అని మహిళా రచయితలు అభిప్రాయపడ్డారు. విజయవాడ పుస్తక సంబరాల్లో సీవీ సాహిత్య వేదికపై బుధవారం 'సాహితీసృజనలో స్త్రీలు' అన్న అంశంపై చర్చ జరిగింది. ప్రముఖ రచయిత్రులు ఓల్గా, విమల, పి.సత్యవతి, ఏఎన్ మల్లీశ్వరి, చంద్రలత, షాజహానా ఈ సదస్సులో ప్రసంగించారు.

నాడు తమకు తెలిసిన అంశాలపై రచనలు చేసే మహిళలు ఇప్పుడు ప్రపంచాన్ని అవగాహన చేసుకుని రచనలు చేసే స్థాయికి ఎదిగారన్నారు. సాహిత్యంలో ఇంటర్ సెక్షనాలిటీ పెరగాలని అభిప్రాయపడ్డారు. నాడు బాధితులుగా ఉన్న రచయిత్రులు ఇప్పుడు సంరక్షకులుగా మారారని, రాబోయే రోజుల్లో సాహిత్యానికి రక్షకులుగా ఎదగాలన్నారు. ముస్లిం మహిళలు బుర్ఖాలు, పరదాల విషయంలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని దేశాల్లో వారికి ఓటు హక్కు లేని దుస్థితి ఉందన్నారు. శాశ్వత తలాక్‌లు లేకుండా, వారి సమస్యలకు శాశ్వత మార్గాలను ప్రభుత్వాలు చూపాలన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఓల్గా

అనువాద సాహిత్య ఝరి..!

- » విభిన్న భారతీయ భాషల సమాహారం కేంద్ర సాహిత్య అకాడమీ స్టాల్



ఈ సారి కొత్తగా కనువిందు చేస్తున్న తెలుగు అనువాద రచనలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ):
ఆణిముత్యాల్లాంటి అనువాద రచనల సమాహారం అది. వైజ్ఞానికాంశాలు, వర్తమాన విషయాలు, జీవిత చరిత్రలు, భారతీయ కథలు, జానపదాలు, వాస్తవిక ప్రాపంచిక విషయాలు ఇలా ఎన్నెన్నో అంశాలు, ఇతివృత్తాలకు సంబంధించి దేశ వ్యాప్తంగా విభిన్న భాషల్లో కొన్ని వేల పుస్తకాలు ముద్రితమవుతుంటాయి. అయితే వీటిలో కొన్ని మాత్రమే అత్యున్నత సాహిత్యంగా నిలుస్తాయి. అవి ప్రజలను ప్రభావితం చేస్తాయి. పురస్కారాలకు ఎంపికవుతాయి. అటువంటి సాహిత్యం ఏ భాషలో వచ్చినా కేంద్ర సాహిత్య అకాడమీ సేకరిస్తుంది. వీటిని దేశ వ్యాప్తంగా మొత్తం 24 భాషలలో అనువాదం చేసి ముద్రిస్తుంటుంది. కేంద్ర సాహిత్య అకాడమీ స్టాల్ (నెం53)లో లభ్యమయ్యే రచనల్లో నవ్యత కనిపిస్తుంది. విభిన్న భాషా సాహిత్యాల కమ్మదనాన్ని తెలుగు పాఠకులకు అందించేందుకు కేంద్ర సాహిత్య అకాడమీ కృషిచేస్తోంది. ఈ ఏడాది పుస్తక మహోత్సవంలో కేంద్రసాహిత్య అకాడమీ, బెంగళూరు శాఖ వారు ప్రత్యేకంగా స్టాల్ ఏర్పాటు చేశారు. తెలుగులోకి అనువదించిన పలు రచనలను ఆ స్టాల్లో ఉంచారు. వీటిలో వైజ్ఞానిక కథలు, బయోగ్రఫీలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. ఆంగ్లంలో సమకాలీన భారతీయ కథానికలు, అమృతం - విషం, ఒక తరం తెలుగు కథ, తమిళ దేశపు జానపదకళలు, తెలుగు కావ్యమాల, ముద్రలు, పాకిస్తాన్ కథానికలు, హిందీ కథా సంగ్రహం, కిషన్ చందర్ ఎన్నిక చేసిన కథానికలు, గుప్పెడు సూర్యుడు వంటి అనేక తెలుగు అనువాద పుస్తకాలు ఇక్కడ ఆకట్టుకుంటున్నాయి.



కేంద్ర సాహిత్య అకాడమీ ఏర్పాటు చేసిన స్టాల్

పుస్తక సమాచారం

ఏ స్టాల్.. ఎక్కడ?

29 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా జరుగుతున్న విజయవాడ పుస్తక మహోత్సవంలో ప్రతి ఏటా నవ్యత కనిపిస్తోంది. ఇక్కడ పెద్ద సంఖ్యలో పుస్తక స్టాల్స్ ఏర్పాటవుతుంటాయి. దేశ వ్యాప్తంగా అనేక ప్రచురణ సంస్థలు బెజవాడలో స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి కనబరుస్తుంటాయి. ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాది మూడు శతకాల స్టాల్స్ ఏర్పాటయ్యాయి. ఈ ఏడాది కూడా అకడమిక్, ఆధ్యాత్మిక స్టాల్స్ అగ్రస్థానంలో నిలిచాయి. తర్వాత బాల సాహిత్యం, పిల్లల స్టాల్స్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. సాహిత్యం - బయోగ్రఫీలు మూడో స్థానానికి పరిమితమయ్యాయి. ఈసారి అభ్యుదయ - విప్లవ సాహిత్య స్టాల్స్ పెరిగాయి. కంప్యూటర్, లా, మెడికల్ పుస్తకాల స్టాల్స్ కూడా అధికంగానే ఉన్నాయి. ఏ కేటగిరీ పుస్తకాలు ఏ స్టాల్స్‌లో ఉన్నాయో చూద్దాం..

– ఆంధ్రజ్యోతి, విజయవాడ

ఆధ్మాత్మికం స్టాల్స్
స్టాల్ నెం. 1, 2, 7, 8, 18, 29, 30, 31, 33, 39, 51, 58, 59, 60, 63, 81, 82, 94, 95, 96, 97, 98, 100, 109, 129, 131, 138, 149

అకడమిక్ స్టాల్స్
స్టాల్ నెం. 2, 9, 10, 19, 20, 27, 32, 43, 44, 67, 68, 69, 76, 77, 78, 80, 88, 101, 102, 107, 126, 190, 215

కంప్యూటర్, టెక్నికల్, సాంకేతికత స్టాల్స్
స్టాల్ నెం. 13, 14, 15, 87, 93, 104, 189, 193, 218, 229

సాహిత్యం - బయోగ్రఫీ
స్టాల్ నెం. 11, 12, 21, 22, 23, 42, 49, 50, 53, 85, 91, 103, 105, 110, 115, 116, 117 , 118, 119, 120, 121, 128, 139, 81, 182, 202, 213, 219, 220, 221, 221

ఆంగ్ల సాహిత్యం
స్టాల్ నెం. 26, 27, 33, 49, 50, 123, 124, 125, 157, 158, 164, 204

బాల సాహిత్యం
స్టాల్ నెం. 14, 17, 18, 25, 26, 27, 28, 46, 47, 48, 54, 55, 56, 57, 58, 64

అభ్యుదయ - విప్లవ సాహిత్యం
స్టాల్ నెం. 83, 99, 140, 141, 142, 143, 170, 171, 172, 173, 194, 195, 196, 197, 201

పిల్లల అకడమిక్, యాక్సెసరీస్ స్టాల్స్
స్టాల్ నెం. 36, 40, 50, 51, 65, 79, 111, 112, 122, 130, 135, 136, 144, 147, 148, 152, 153, 176, 179, 187, 210, 211

సైకాలజీ
స్టాల్ నెం. 4, 13, 126, 127, 132, 133, 134


కథలు - నవలలు
స్టాల్ నెం. 2, 14, 22, 33, 48, 75, 84, 89, 92, 165, 166

ఆయుర్వేదం - మెడికల్ - హెల్త్
స్టాల్ నెం. 2, 13, 14, 15, 29, 185, 186, 203

న్యూమరాలజీ - ఆస్ట్రాలజీ
స్టాల్ నెం. 4, 48, 62, 66

మహిళల సౌందర్యం - వంటలు
స్టాల్ నెం. 70, 74, 90, 126, 127

లా, పోలీసు - సీడీలు
71, 72, 86, 169, 177, 178, 212



సంక్షిప్తం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మురళీమోహన్

కాంగ్రెస్ మహా పాదయాత్ర

ఏడు నుంచి

మైలవరం, జనవరి 3 : పోలవరం కోసం కాంగ్రెస్ పార్టీ మహా పాదయాత్ర చేపట్టనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ధనేకుల మురళీమోహన్ పేర్కొన్నారు. మైలవరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక విలేకర్లతో బుధవారం మాట్లాడారు. పాదయాత్ర ఈనెల 7, 8, 9 తేదీల్లో జరగనున్నట్లు వివరించారు. ఏడో తేదీ ధవళేశ్వరం కాటన్ విగ్రహం నుంచి ప్రారంభమై తొమ్మిదిన పోలవరం వద్ద ముగుస్తుందన్నారు. 10న పోలవరంలో సామూహిక సత్యాగ్రహం చేపట్టనున్నట్లు తెలిపారు. 2018-19 నాటికి పోలవరం ప్రాజెక్ట్ పనులన్నీ పూర్తిచేయాలని, రాష్ట్రానికి భారం కాకుండా కేంద్రమే పనులు చేపట్టాలని నిర్వాసితులకు న్యాయం చేయాలని, పనుల్లో నాణ్యత పాటించాలన్న డిమాండ్లను పేర్కొన్నారు. రాజకీయ ఆధిపత్యం కోసమో లేదా కమీషన్లలో వాటా కోసమో తెలియదుగానీ ఈ విషయంలో టీడీపీ, బీజేపీ మధ్య ఇటీవల తలెత్తిన విభేదాలు బాహాటంగానే బయటపడ్డాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొర్రా కిరణ్, పీసీసీ సభ్యుడు కఠారి ఉమా, నేతలు ఏసుదాసు, వీరంకి శ్రీధర్, పజ్జూరు తిరుపతిరావు, తదితరులు పాల్గొని, వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

సీనియారిటీ ప్రకారమే ప్రమోషన్లు ఇవ్వాలి

▸▸ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

గవర్నర్‌పేట, జనవరి 3 : విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులకు ప్రమోషన్స్ లేదా ఎఫ్ఏసీలుగా నియమించేటప్పుడు సీనియారిటీ ప్రకారం ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ బాబ్జీ, పి. బాబురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల డిప్యూటీ డీఈవో పోస్టుల్లో ఎఫ్ఏసీ నియామకాలు అక్రమంగా చెపట్టారన్నారు. రాజకీయ వత్తిళ్ళ, పైరవీలతో పదుల సంఖ్యలో సీనియర్లను తప్పించి జూనియర్లకు ప్రమోషన్స్, ఎఫ్ఏసీలు ఇచ్చారన్నారు.

ఉన్నత స్థాయి పోస్టుల్లో పైరవీలతో వచ్చిన వారిని నియమిస్తే నిజాయితీగా విధులు నిర్వహించలేరన్నారు. రూల్స్‌కు విరుద్ధంగా నియమిస్తే పోరాటాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.





బెజవాడకే.. సెంటరాఫ్ అట్రాక్షన్! టూ టైర్ సిటీకి కాస్మోపాలిటన్ లుక్ తెచ్చిన రోడ్డు!! ద కంప్లీట్ రోడ్. పేరు మహాత్మా గాంధీ రోడ్డు. నగర ప్రధాన రోడ్లలో అగ్రస్థానంలో ఉన్న ఎంజీ రోడ్‌పై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం...

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

ఎంజాయ్.. ఎంజీ రోడ్డు

▸▸ బెజవాడకే సెంటరాఫ్ అట్రాక్షన్ ▸▸ టూ టైర్ సిటీకి కాస్మోపాలిటన్ లుక్ ▸▸ స్టార్ హోటల్స్ , వస్త్ర, బంగారు, ఆటోమొబైల్, హైపర్ మార్కెట్స్ ▸▸ వస్త్ర, బంగారు దుకాణాలు, ఆస్పత్రులు, , యాక్సెసరీస్ షోరూమ్‌లు ▸▸ భారీ మల్టీప్లెక్స్, 13 సినిమా థియేటర్లు

నగర భౌగోళిక విస్తీర్ణం 61.88 చదరపు కిలోమీటర్లు! పదిహేను లక్షల మంది జనాభా నివశిస్తున్న విజయవాడకు అత్యంత ప్రధానమైనది ఎంజీ రోడ్డు. 3.97 కిలోమీటర్ల పొడవున బెంజ్‌సర్కిల్ నుంచి పోలీసు కంట్రోల్ రూమ్ వరకు స్ట్రెయిట్‌గా ఉంటుంది. నగరంలోనే ఉన్నా, ఆర్‌అండ్‌బీ పర్యవేక్షణలో హైదరాబాద్ తలపిస్తుంది. అభివృద్ధి చెందిన నగర ఛాయలు కనిపిస్తాయి. ఈ రోడ్డుతోనే బెజవాడకు బ్రాండ్ ఇమేజ్ వచ్చిందంటే అతిశయోక్తి కాదు! 2006వరకు సాధారణంగా ఉన్నా అంచెలంచెలుగా నాలుగేళ్లుగా రూపురేఖలు మారిపోయాయి. ఎన్నింటికో కేంద్రంగా మారింది. తెల్లవారితే బందరురోడ్డులోకి రాకుండా పని జరగని పరిస్థితి! సగటున నిమిషానికి ఒక బస్సు తిరిగే ఇక్కడ రద్దీ ఏస్థాయిలో ఉందో తెలిసిందే. అలాంటి రోడ్డు ప్రజల అవసరాలు తీర్చే ఆల్ ఇన్ వన్‌గా మార్పు చెందడం గమనార్హం.

ఆర్థిక కార్యకలాపాలకు బెజవాడ పెట్టింది పేరు. వర్తక, వాణిజ్యానికి వన్‌టౌన్, సినిమా, వ్యాపార రంగాలకు గాంధీనగర్, వస్త్ర, బంగారు వ్యాపారాలకు బీసెంట్ రోడ్డు, ఆస్పత్రులకు సూర్యారావుపేట ఒకప్పుడు కేంద్రాలు. ఇప్పుడు ఎంజీరోడ్డు వాటన్నింటికీ కేంద్రంగా మారింది. ఎలక్ట్రానిక్స్, యాక్సెసరీస్, ఫ్యాన్సీ, కాస్మొటిక్స్ షోరూమ్‌లతో రూపురేఖలు మారడానికి దోహదపడితే... భారీ వస్త్ర దుకాణాలు, స్టార్ హోటల్స్ క్రేజీలుక్ తెచ్చాయి. కాంధారి వంటి టూస్టార్ హోటల్, మనోరమ, మమత హోటల్స్ ఇక్కడే ఉండేవి. క్వాలిటీ ఇన్ పేరుతో త్రీ స్టార్ రేటెడ్‌గా డీవీ మానర్ ఏర్పాటుతో హోటల్ రంగం ఇక్కడ కేంద్రీకృతమైంది. డీవీమానర్ అంటే అట్రాక్షన్‌గా మారింది. కాలక్రమంలో కాంధారి ఆధునీకరణ చెంది ఫోర్ స్టార్ రేటెడ్‌తో మురళీ ఫార్చ్యూన్‌గా సంతరించుకుంది. తర్వాత తొలి ఫైవ్‌స్టార్ హోటల్‌గా గేట్‌వే ఏర్పాటైంది. మనోరమ, మమత కూడా ఆధునీకరణ చెందాయి. మానర్ ప్లాజా, ఫ్యాబ్ హోటల్ వంటివి ఏర్పడ్డాయి. రసూయ్, సదరన్ స్పైస్, బర్కాస్, ప్యారడైజ్ బిర్యానీ వంటి ఎన్నో బడ్జెట్ హోటల్స్ వచ్చాయి. ఇవికాక ఆహారపరంగా వీగ్రిల్ టేక్ అవే, ఇడ్లీ ఎన్ ఇడ్లీ, జీ బార్, బిర్యానీస్ అండ్ మోర్, డోమినోస్ పిజ్జా, ఖాన్‌సాబ్ రెస్టారెంట్, బిస్మిల్లా ప్యారడైజ్, క్యూబ్ రెస్టారెంట్ వంటి వెజ్ అండ్ నాన్‌వెజ్ రెస్టారెంట్స్ వచ్చాయి. రుచికరమైన ఫుడ్‌కు కేంద్రంగా మారడంతో సరదాగా ఫ్యామిలీలతో పెద్ద ఎత్తున వచ్చి వెళతారు.

న్యూలుక్ వచ్చిందంటే

ఈ రోడ్డుకు న్యూ లుక్ వచ్చిందంటే... భారీ వస్త్రశ్రేణి షోరూమ్‌లు ఏర్పాటు కావడమే. రిలయన్స్ ట్రెండ్స్, ఎంఅండ్ ఎం, లైఫ్ స్టయిల్, రేమాండ్, కళాంజలి, వీఐపీ, ఎంవీఆర్, కళానికేతన్, చందనా గ్రాండ్, గోలి శిల్క్స్, మాన్య, ఆర్ఎస్ బ్రదర్స్, టిప్సీ టాప్సీ, ట్విల్స్, మెట్రో ఎక్స్‌పోర్ట్, కంకటాల వంటి స్వదేశీ, విదేశీ బ్రాండ్లతో కూడిన అనేక వస్త్రశ్రేణి మెగా షోరూమ్స్ వచ్చాయి. కళ్లు చెదిరే దుకాణాలతో ఈరోడ్డు సరికొత్తగా కనిపిస్తోంది. తర్వాత బంగారు దుకాణాలు పెద్ద ఎత్తున ఏర్పడ్డాయి. మలబార్ జ్యూబెవలరీ, కొఠారి జ్యూవెలరీ, దీపక్ సిల్వర్స్, కల్యాణ్ జ్యూవెలర్స్, కీర్తిలాల్స్ డైమండ్ జ్యూవెలరీ వంటి భారీ మాల్స్ ఏర్పాటు కావడం మరో కారణం. వాటి తర్వాత ఆటోమొబైల్ దుకాణాలదే ప్రత్యేక స్థానం. సుందరం హోండా, టాటా మోటార్స్, బజాజ్ ఆటో లిమిటెడ్, మారుతీ నెక్సా (మిత్రా హోండా), ఆర్ఎం మోటార్స్, కుశలవ హ్యూండయ్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి భారీ వాహన దుకాణాలతోపాటు ఫీనిక్స్, మద్రాస్ ఆటో సర్వీస్ వంటి యాక్సెసరీస్, సర్వీస్ ఓరియంటెడ్ షాపులు పెద్ద ఎత్తున ఏర్పడ్డాయి. ఎలక్ట్రానిక్స్ మరింత విస్తృతమయ్యాక మొబైల్ షోరూమ్స్ పెద్ద ఎత్తున ఏర్పడ్డాయి. ఎంజీ రోడ్డులో బీసెంట్ రోడ్డు నుంచి కంట్రోల్ రూమ్ వరకు గ్లాస్ అండ్ వుడ్ మెగా షోరూమ్‌లకు పెట్టింది పేరుగా మారింది. ఏషియన్ పెయింట్స్, మహావీర్ గ్లాస్ కంపెనీ వంటి ఫేమస్ దుకాణాలు వెలిశాలి. కేటగిరీల వారీ వెలసిన దుకాణాలు వరుసగా కొలువు తీరడంతో కళ వచ్చింది. ఆస్పత్రులు కూడా ఇక్కడే కొలువు తీరాయి. అమెరికన్ ఆస్పత్రి, రమేష్‌హెల్ప్, గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ, ఆశ్రఫియన్, ప్రశాంత్ వంటివి ఏర్పడ్డాయి. రిలయన్స్, నీల్‌గిరీస్, బాలాజీ, గ్రాండ్ ఆధునిక, మెట్రో షూస్ వంటి సూపర్ బజార్లు అనేకం వచ్చాయి. ఇలా అన్నిరకాల సమాహారంగా రోడ్డు ఉండడంతో ప్రజల అవసరాలకు కేంద్రంగా మారిపోయింది.

భారీ మల్టీప్లెక్స్‌లతో సూపర్ అట్రాక్షన్

భారీ మల్టీప్లెక్స్ మాల్స్ ఏర్పాటుతో ఎంజీ రోడ్డుకు సూపర్ అట్రాక్షన్ వచ్చేసింది. ట్రెండ్‌సెట్, పీవీఆర్, పీవీపీ మల్టీప్లెక్స్‌లు ఈ రోడ్డుకే హైలెట్స్. ఈ మూడు మల్టీప్లెక్స్‌లో కలిపి 13 సినిమా థియేటర్లు ఉన్నాయి. వాటిలో ఒకటి 9డీ థియేటర్, ఒకటి 7డీ, ఒక త్రీడీ థియేటర్ ఉండడం గమనార్హం.

కళ్లు చెదిరే అద్దెలు

ఈ రోడ్డులో అద్దెకు తీసుకోవాలంటే అత్యంత కాస్ట్లీ వ్యవహారం. చదరపు అడుగు సగటు అద్దె రూ.100 గా ఉంది. ఒక షోరూమ్ పెట్టుకోవాలంటే నెలకు కనీసం లక్ష రూపాయలు అద్దె చెల్లించాలి. ఆరు నెలల అడ్వాన్స్ ముందుగా చెల్లించాలి. అంటే ఆరు లక్షలను ముందుగా చెల్లించాలి. పెద్దతరహా దుకాణాలయితే కనీసం మూడువేల చదరపు అడుగుల స్థలమైనా కావాలి. ఈ లెక్కన మూడు లక్షల రూపాయల అద్దె చెల్లించాలి. ఇటీవల తాజాగా ఎంజీరోడ్డులో ఏర్పాటు చేసిన డీ అడ్రస్ మాల్‌లో డ్యూప్లెక్స్ మాల్ అద్దెలు చూస్తే కళ్లు తిరుగుతాయి. అందులోని ఒక్కొక్క షాపు అద్దె ఐదారు లక్షల రూపాయల మధ్య ఉండడం గమనార్హం.

ప్రపంచ బ్యాంకు రుణం దారుణం



దాసరిభవన్‌లో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

గవర్నర్‌పేట, జనవరి 3 : విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం సహకరించాల్సి ఉండగా ప్రపంచబ్యాంకు రుణాన్ని మంజూరు చేయిస్తామని కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఇప్పటికే పీకల లోతు అప్పుల్లో ఉన్న రాష్ట్రంపై మరింత రుణభారాన్ని మోపడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. దాసరిభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాజధాని నిర్మాణం పేరుతో ఒకవిధంగా రాష్ట్రాన్ని ప్రపంచబ్యాంకుకు తాకట్టుపెట్టడమే అవుతుందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు సహా టీడీపీ ఎంపీలకు చిత్తశుద్ధి ఉంటే రాజధాని నిర్మాణ నిధులను కేంద్రమే భరించే విధంగా వత్తిడి పెంచాలని సూచించారు.

పార్టీ ఫిరాయింపులపై ఎందుకు ప్రశ్నించరు...

అసెంబ్లీ ఆమోదం తెలిపినా నాలా బిల్లును గవర్నర్ ఆమోదించకుండా జాప్యం చేయడంపై రాద్ధాంతం చేస్తున్న బీజేపీ పక్షనేత విష్ణుకుమార్‌రాజు పార్టీ ఫిరాయింపుదార్లపై చర్యలను ఎందుకు నిలదీయరని ప్రశ్నించారు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మాత్రమే ఉపయోగపడే బిల్లుపై ఆగ్రహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

సీఎంను అడ్డుకోవడం దారుణం

▸▸ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న

విజయవాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజల కోసం పరితపిస్తూ, అధికారులను ప్రజల వద్దకు తీసుకెళ్లి వారి సమస్యలను పరిష్కరించడానికి సీఎం చేస్తున్న కృషిని దేశ, విదేశాల్లో పొగుడు తుంటే కడపలో సీఎం జన్మభూమి సభను అవినాష్‌రెడ్డి అడ్డుకోవడం దారుణమని ఎమ్మెల్సీ బుద్దావెంకన్న ఖండించారు. దానిపై ఆయన సీఎంకు ప్రజలముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పులివెందులలో గొడవ చేసేందుకే వచ్చారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలను గౌరవించాల్సిన సంస్కృతి వారికి లేదన్నారు. పులివెందులకు నీళ్లు ఇస్తుంటే జగన్ అడ్డుకోవాలని చూస్తున్నాడన్నారు. పోతిరెడ్డిపాడు, గండికోట కాల్వలు వెడల్పుచేసి రైతులకు నీళ్లు ఇచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో పులివెందులలో టీడీపీజెండా ఎగరడం ఖాయమన్నారు.

విశేషాల సమాహారం..

అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) రూ.17,761.49 కోట్ల భారీ అంచనా వ్యయంతో, (సవరించిన అలైన్‌మెంట్ ప్రకారం) 189 కిలోమీటర్ల పొడవు, 150 మీటర్ల వెడల్పుతో, 6 లేన్లుగా నిర్మితం కానుంది. ఈ రహదారికి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 87 గ్రామాలకు చెందిన 3404 హెక్టార్ల భూమి అవసరం. కృష్ణా జిల్లాలోని 49 గ్రామాలకు చెందిన 1850 హెక్టార్ల భూమిగుండా 99.4 కిలోమీటర్ల పొడవైన రహదారి ఏర్పాటవనుండగా, గుంటూరు జిల్లాలోని 38 గ్రామాలకు చెందిన 1554 హెక్టార్ల గుండా సాగే 88.6 కి.మీ. పొడవైన రోడ్డు నిర్మితం కానుంది. ఈ భూమి వ్యయం రూ.4198 కోట్లుగా అంచనా వేశారు.

- పలు స్థానిక, జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులను అనుసంధానిస్తూ సాగే ఈ రోడ్డులో భాగంగా 11 పెద్ద వంతెనలు, 7 రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ)లను నిర్మించనున్నారు.
- 2 చోట్ల సొరంగాలు కూడా తవ్వనున్నారు.. వీటిల్లో కృష్ణా జిల్లా జి.కొండూరు వద్ద తవ్వే టన్నెల్ పొడవు ఏకంగా 5.50 కి.మీ. కాగా గుంటూరు జిల్లా పేరేచర్ల వద్ద ఏర్పాటవబోయేది 800 మీటర్ల పొడవు ఉండనున్నాయి!
- గంటకు 120 కిలోమీటర్ల వేగంతో వాహనాలు సురక్షితంగా ప్రయాణించగలిగేలా ఈ ఓఆర్ఆర్‌ను నిర్మించనున్నారు.
- మొత్తం 3 దశల్లో, 11 ప్యాకేజీలుగా ఈ ప్రతిష్ఠాత్మక రహదారిని ఏర్పాటు చేయాలన్నది ప్రణాళిక.
- తొలి దశలో భాగంగా ఎన్.హెచ్. 65 నుంచి ఎన్.హెచ్.16లను కలిపే కంచికచర్ల- పొత్తూరు భాగం (ప్యాకేజీ 8 నుంచి 11 వరకు- పొడవు 63 కిలోమీటర్లు) నిర్మిస్తారు. దీనిలో భాగంగానే కృష్ణానదిపై 3.1 కి.మీ. పొడవైన ఐకానిక్ బ్రిడ్జిని, 0.4 కి.మీ. పొడవైన సొరంగాన్ని నిర్మిస్తారు.
- 2వ దశలో ప్యాకేజీ 5 నుంచి ప్యాకేజీ 8 వరకు (ఎన్.హెచ్.16ను ఎన్.హెచ్.65తో కలిపే), అంటే పొత్తూరు నుంచి పొట్టిపాడు వరకు 53 కిలోమీటర్ల పొడవైన రోడ్డును అభివృద్ధి పరుస్తారు. దీనిలో భాగంగా కృష్ణానదిపై 4.8 కిలోమీటర్ల పొడవైన మరొక ఐకానిక్ బ్రిడ్జిని నిర్మిస్తారు.
- 3వ దశలో ప్యాకేజీ 1 నుంచి ప్యాకేజీ 5 (ఎన్.హెచ్.65 నుంచి ఎన్.హెచ్.16 వరకు)లను కలిపేలా పొట్టిపాడు నుంచి కంచికచర్ల మధ్య 65 కిలోమీటర్ల పొడవైన రోడ్డును, అందులో భాగంగా 4.4 కిలోమీటర్ల పొడవైన సొరంగాన్ని నిర్మిస్తారు.



ఎక్కడెక్కడ.. ఎంతెంత భూమి అవసరమంటే..

అమరావతి ఓఆర్ఆర్ కోసం కృష్ణా జిల్లాలోని వివిధ మండలాల్లో కలిపి మొత్తం 1850 హెక్టార్లు, గుంటూరు జిల్లాలో మొత్తం 1554 హెక్టార్లు అవసరమని గుర్తించారు.

- వీటిలో కృష్ణాజిల్లాలోని కంచికచర్లలో 211, వీరులపాడులో 221, జి.కొండూరులో 293, మైలవరంలో 108, ఆగిరిపల్లిలో 436, బాపులపాడులో 19, గన్నవరంలో 20, ఉంగుటూరులో 290, కంకిపాడులో 134, తోట్లవల్లూరులో 120 హెక్టార్లు- మొత్తంమీద 1850 హెక్టార్లు అవసరం.
- గుంటూరు జిల్లాలో.. కొల్లిపరలో 93, దుగ్గిరాలలో 49, పొన్నూరులో 5, తెనాలిలో 107, చేబ్రోలులో 276, వట్టిచెరుకూరులో 169, గుంటూరులో 104, యడ్లపాడులో 37, మేడికొండూరులో 400, తాడికొండలో 33, పెదకూరపాడులో 152, అమరావతిలో 129 హెక్టార్లు- మొత్తంమీద 1554 హెక్టార్లు అవసరం.

అటవీ భూమి కూడా అవసరమే..

ఈ ఓఆర్ఆర్‌కు రైతులకు చెందిన, ప్రభుత్వ భూములతోపాటు గణనీయ పరిమాణంలో అటవీ భూములు కూడా అవసరమే. కృష్ణా జిల్లాలోని జి.కొండూరు రిజర్వ్ ఫారెస్ట్‌లో 89.83 హెక్టార్ల (221.97 ఎకరాలు), గుంటూరు జిల్లాలోని కొండవీడులో 34.46 హెక్టార్ల (85.125 ఎకరాలు) కావాల్సి ఉంటుంది. ఈ భూముల మళ్లింపు సాధించడం ద్వారా వాటిల్లో గుండా రహదారి నిర్మాణానికి వివిధ ప్రభుత్వ శాఖలు ముమ్మరంగా కృషి చేస్తున్నాయి.

సంక్రాంతి ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ) జనవరి 3: సంక్రాంతి పండుగను, ఇతర ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే 84 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు సీపీఆర్‌వో ఎం.ఉమాశంకర్‌కుమార్ తెలిపారు. రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.

తిరుపతి - విశాఖపట్నం మధ్య ఏసీ ప్రత్యేక రైళ్లు... 07487 నెంబర్‌తో తిరుపతి నుంచి విశాఖపట్నం వెళ్లే రైలు జనవరి 7, 14, 21, 28, ఫిబ్రవరి 4, 11, 18, 25 తేదీలలో (ఆదివారాలు) రాత్రి 10.30 గంటలకు బయలుదేరి విశాఖపట్నంకి మరుసటిరోజు ఉదయం 10.45కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07488 విశాఖపట్నం - తిరుపతి రైలు జనవరి 8, 15, 22, 26, ఫిబ్రవరి 5, 12, 19, 26 తేదీలలో (సోమవారం) రాత్రి 7.20కు బయలుదేరి, మరుసటిరోజు ఉదయం 8.10కు తిరుపతికి చేరుకుంటుంది. ఈ రైళ్లకు అన్ని థర్డ్ ఏసీ కోచ్‌లే ఉంటాయి.

కాచీగూడ - విశాఖపట్నం వయా గుంటూరు, విజయవాడ... 07016 కాచీగూడ - విశాఖపట్నం రైలు ఫిబ్రవరి 6, 13, 20, 27 (ప్రతి మంగళవారం) సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరి విశాఖపట్నానికి మరుసటిరోజు ఉదయం 7.50కు చేరుకుంటుంది.

విశాఖపట్నం - తిరుపతి... 07479 నెంబర్ గల రైలు ఫిబ్రవరి 7, 14, 21, 28 తేదీలలో (ప్రతి బుధవారం) రాత్రి 7.05కు బయలుదేరి తిరుపతికి మరుసటిరోజు ఉదయం 9.25కు చేరుకుంటుంది.

తిరుపతి - కాచీగూడ... 07146 తిరుపతి - కాచీగూడ రైలు జనవరి 8, 15, 22, మార్చి 1వ తేదీలలో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు కాచీగూడకు చేరుకుంటుంది.

హైదరాబాద్ - విశాఖపట్నం రైలు... 07148 నెంబర్ గల రైలు జనవరి 10, 12 తేదీలలో సాయంత్రం 5.45కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.15కు విశాఖపట్నానికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07147 నెంబర్‌తో జనవరి 11, 13 తేదీలలో సాయంత్రం 6.50కు బయలుదేరి మరుసటి రోజు 9.45కు హైదరాబాద్‌కు చేరుకుంటుంది.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, కేరళ సంప్రదాయ నృత్యం, జానపద నృత్యం చేస్తున్న బాలికలు

విద్యార్థుల భవిష్యత్‌కు తల్లిదండ్రుల పర్యవేక్షణ ముఖ్యం

ఇంటెలిజెన్స్ అధికారి వెంకటేశ్వరరావు

మొగల్రాజపురం, జనవరి 3: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు క్రమశిక్షణతో పాటు తల్లిదండ్రుల పర్యవేక్షణ చాలా ముఖ్యమని ఇంటెలిజెన్స్ అడిషనల్ ఐజీ ఎ.బి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ 41వ వార్షికోత్సవం బుధవారం సాయంత్రం పాఠశాల మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందన్నారు. ప్రిన్సిపాల్ ఎల్.ఎస్.రాంబాబు మాట్లాడుతూ సిద్ధార్థ స్కూల్లో విద్యార్థుల్లోని ప్రతిభను ప్రోత్సహిస్తుండటంతో తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో ప్రతిభ చూపుతున్నారన్నారు. చదువు, ఆటల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. పాఠశాలలో 25 ఏళ్ల పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు బి.ఎల్. మోహన్, అనురాధ తదితరులను సత్కరించి మొమెంటోలు అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కోశాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, కన్వీనర్ పి.ప్రభాస్, చదలవాడ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ లతాకుమారి పాల్గొన్నారు.

మేయర్ శ్రీధర్ హయాంలోనే నగరాభివృద్ధి

టీడీపీ ఉపాధ్యక్షుడు కొట్టేటి హనుమంతరావు

విద్యాధరపురం, జనవరి 3: మేయర్ కోనేరు శ్రీధర్ హయాంలోనే విజయవాడ నగరం అభివృద్ధి దిశగా ముందుకు దూసుకుని వెళుతుందని, ఆ అభివృద్ధి చూసి ఓర్వలేక వైసీపీ, వామపక్షాల నాయకులు మేయర్, టీడీపీ పాలనపై ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ అర్బన్ ఉపాధ్యక్షుడు, మాజీ ఫ్లోర్ లీడర్ కొట్టేటి హనుమంతరావు ఒక ప్రకటనలో విమర్శించారు. మేయర్గా కోనేరు శ్రీధర్ ఎన్నికైన నాటి నుంచి నాలుగేళ్ల కాలంలో 59 డివిజన్‌లలో ఎన్ని కోట్లు ఖర్చుపెట్టి అభివృద్ధి పనులు చేపట్టారో వైసీపీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్లకు తెలియదా అని ఆయన ప్రశ్నించారు.

రాజకీయ పార్టీలో చిన్నచిన్న సమస్యలు ఉండటం సహజం అని, ఇతర రాజకీయ సమస్యలు చూపించే ముందు వారి పార్టీలో వున్న గ్రూపు రాజకీయాల గురించి తెలుసుకోవాలని ఆయన హితవు పలికారు. నగరపాలక సంస్థలో ఏక్కడైనా అవినీతి జరిగిందని ఆయా పార్టీల నాయకుల నిరూపించగలరా అని హనుమంతరావు సవాల్ విసిరారు.

అమ్మ అడ్డమైందా?

- ఎలుకలతో సహచర్యం చేస్తున్న ఓ అమ్మ
- సాయం కోసం విరిగిన బడ్డీ కొట్టులో ఎదురుచూపులు



వృద్ధురాలు శకుంతల, సర్కిల్‌లో ప్లేటులో అన్నం తింటున్న ఎలుకలు

విజయవాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పేగు పంచిన అమ్మ ఎలుకల ఎంగిలి తింటోంది. నా అనే ఆదరణ కరువై నానా అవస్థలు పడుతోంది. విరిగిన బడ్డీ కొట్టే ఆమె నివాసం. అక్కడి ఎలుకలతోనే సహచర్యం. విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ఆమెపేరు పుట్టా శకుంతల. విజయవాడలోని పశ్చిమ నియోజకవర్గంలో గల చెరువుసెంటర్ వద్ద కొండ ప్రాంతానికి దిగువన ఉన్న పాత బడ్డీ కొట్టే ఆమెకు అన్నీ. కొండపైన నివసించే కుమారుడు రోజుకో ముద్దను ఆ బడ్డీ కొట్టులో పడేస్తేనే ఆ తల్లి కడుపు నిండేది. అది కూడా సగం ఆ తల్లి తినగా, మిగతా సగం బడ్డీలోని ఎలుకలకు ఆహారంగా మారుతోంది. మళ్లీ ఆకలేస్తే ఆ ఎలుకల ఎంగిలే ఆమెకు దిక్కు. ఏ అర్ధరాత్రి దాహమేసినా.. చుక్క నీళ్లిచ్చే దిక్కులేదు. కప్పుకునేందుకే దుప్పటి కాదు.. చుట్టుకునేందుకు ఒంటిపై చినిగిన చీర తప్ప మరో వస్త్రం కూడా లేదు. ఆ వృద్ధురాలిని ఇంట్లో ఉండనివ్వబోనని, లేకుంటే ఇళ్లు ఖాళీ చేయమన్న ఇంటి యజమాని మాటలకు లొంగిన పుత్రరత్నం తల్లిని రోడ్డు మీద కూర్చోబెట్టాడు. ఇంత జరిగినా.. తనకంటూ ఓ ఇల్లు లేదని, ప్రభుత్వం తరఫున ఇల్లు ఇప్పించాలని కోరుతోంది. ఎందుకమ్మా.. అంటే 'తన తదనంతరం బిడ్డలకయినా.. మిగులుతుంది కదయ్యా!' అంటూ కన్నీళ్లు కారుస్తుంది. భర్త బతికున్న రోజుల్లో బాగా బతికామని, అతని మరణానంతరం పరిస్థితి తల్లకిందులయిందని పూడుకుపోయిన గొంతుతో అర్థమయీ అవ్వని మాటలతో వివరిస్తోంది. మంచానికి అతుక్కున్న తాను అందరికీ భారమైపోయానని, చివరకు ఈ బడ్డీనే ఇల్లయిందని వాపోతుంది. తల్లి అవస్తను దూరం చేయాల్సిన స్థానిక కార్పొరేటర్ పింఛను ఇచ్చి చేతులు దులుపుకున్నాడు. ఎండకు ఎండుతూ.. చలికి వణుకుతూ దిక్కులేని ఆ తల్లి దీనావస్తను చూసి అయ్యో! అనేవాళ్లే తప్ప సాయమందించేవాళ్లు లేరు.

ప్రజలను చైతన్యవంతులను చేయండి

నగర కమిషనర్ జె. నివాస్



యూరినల్స్‌లో వాటర్ వసతి పరిశీలిస్తున్న కమిషనర్ నివాస్

కార్పొరేషన్, జనవరి 3 : బహిరంగంగా మలమూత్ర విసర్జనలకు పాల్పడే వారిని గమనించి, నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన టాయిలెట్స్, యూరినల్స్‌ను వారు వినియోగించుకునేలా సిబ్బంది చైతన్యవంతులు చేయాలని నగర కమిషనర్ సూచించారు. నగర పర్యటనలో భాగంగా రామలింగేశ్వరనగర్, గుల్జార్ వంతెన, నేతాజీ బ్రిడ్జి, బస్‌స్టేషన్, లోబ్రిడ్జి, కెనాల్ రోడ్డు, వినాయక గుడి తదితర ప్రాంతాలలో బహిరంగ మలమూత్ర విసర్జన జరుగు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంలో రాజీవ్‌గాంధీ కూరగాయల హోల్‌సేల్ మార్కెట్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన టాయిలెట్స్, యూరినల్స్‌ను పరిశీలించారు. యూరినల్స్‌లో నీటి వసతి గమనించి, పూర్తి చేయాల్సిన పనులను వేగవంతం చేసి, అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే పద్మావతి, కృష్ణవేణి ఘాట్‌లలో పారిశుధ్య నిర్వహణ విధానం పరిశీలించారు. పర్యటనలో కార్పొరేటర్ సురేష్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాబూ శ్రీనివాసన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్ పాల్గొన్నారు.

నవరస భరితం ద్రౌపది నృత్య రూపకం



విజయవాడ కల్చరల్, జనవరి 3 : వాగ్దేవి కూచిపూడి నృత్యాలయ, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మాలిని పేరిట మహాభారతంలోని ద్రౌపది పాత్రను ప్రత్యేకంగా తీసుకొని నృత్య రూపకం ప్రదర్శించారు. కీచకుడిగా వెంకటా చలపతి, ద్రౌపతిగా బూరదా గోమతి, భీమునిగా సురేంద్ర నాథ్‌లు అభినయించి నర్తించారు. అనంతరం కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో గొట్టిపాటి రామకృష్ణ, గోళ్ల నారాయణరావు, ఈమని శివనాగిరెడ్డి, సప్పా శివకుమార్‌లు పాల్గొన్నారు.

నోరు తిరుగుతోందా?

How can a clam cram in a clean cream can?



సామెత

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు

ఒకటికి మూడు

చిత్రంలో కనిపిస్తున్న దాన్ని తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఏమంటారంటే..!



రంగులు వేయండి



పండగ సమయాల్లో వీధులు, పార్కులను కళ్లు మిరుమిట్లుగొలిపే లైట్లతో అలంకరించుకోవడం మనకు తెలుసు. కానీ ఫ్రెంచ్ రివెరాలో మాత్రం నిమ్మకాయలతో, నారింజ పండ్లతో పార్కులన్నీ అలంకరించి పండుగ చేసుకుంటారు. ఏటా అక్కడ జరిగే లెమన్ ఫెస్టివల్ కోసం ఇలా చేస్తుంటారు. ఈ ఫెస్టివల్‌ను చూడటానికి కొన్ని లక్షల మంది పర్యాటకులు అక్కడికి వెళ్తుంటారు.

కనువిందు చేసే లెమన్ ఫెస్టివల్





ఫ్రాన్స్‌లో జరిగే ముఖ్యమైన పండుగల్లో ఈ లెమన్ ఫెస్టివల్ ఒకటి. ఫార్ములా గ్రాండ్ 1 తరువాత ఫ్రెంచ్ రివెరాలో జరిగే రెండో అతి పెద్ద ఈవెంట్ ఈ లెమన్ ఫెస్టివల్. ప్రతి ఏటా ఫిబ్రవరిలో జరిగే ఈ వేడుకకు సుమారు 2 లక్షల 50 వేల మంది సందర్శకులు హాజరవుతారు. ఈ పండుగ ఈ మధ్య పుట్టిందేమీ కాదు. 1928 నుంచి ఈ ఫెస్టివల్‌ను జరుపుకుంటున్నారు. ఫిబ్రవరి 11 నుంచి మార్చి 1 వరకు జరిగే ఈ వేడుక కోసం కొన్ని వేల మంది కార్మికులు శ్రమించి పార్కులు, ఇతర ముఖ్యమైన స్థలాలన్నింటినీ అందంగా తీర్చిదిద్దుతారు. ఇందుకోసం 120 టన్నుల నిమ్మ పండ్లను ఉపయోగిస్తారట. నిమ్మ పండ్లు మాత్రమే కాకుండా ఆరెంజ్, గ్రేప్‌ఫ్రూట్ వంటి సిట్రస్ జాతికి చెందిన పండ్లను కూడా వాడతారు. అయితే ఎక్కువగా నిమ్మపండ్లే కనిపిస్తాయి. ఇలా అలంకరించిన పార్కులను చూడటానికి సందర్శకులను అనుమతిస్తారు. అత్యంత సుందరమైన తీర ప్రాంతం కలిగిన ఈ పట్టణాన్ని లెమన్ ఫెస్టివల్ జరిగే సమయంలో సందర్శించడానికి పర్యాటకులు ఆసక్తి చూపుతారు.

గోల్డెన్ ఫ్రూట్ పరేడ్

నారింజపండ్లు, నిమ్మపండ్లు రోడ్డుపై నీటివరదలా జారుకుంటూ వస్తే ఎలా ఉంటుంది? ఈ దృశ్యం చూడాలంటే గోల్డెన్ ఫ్రూట్ పరేడ్ చూడాల్సిందే. లెమన్ ఫెస్టివల్ జరిగే రోజుల్లో ప్రతి ఆదివారం మధ్యాహ్నం ఈ పరేడ్ నిర్వహిస్తారు. జానపద బృందాలు చేసే నృత్యాలు, అభిమానుల కోలాహలంతో ఈ పరేడ్ కన్నుల పండువగా ఉంటుంది. చివరి ఆదివారం రోజున పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తారు. గురువారం రోజుల్లో పరేడ్ రాత్రివేళ ఉంటుంది. ఈ ఫెస్టివల్‌ను మెంటన్ లెమన్ ఫెస్టివల్ అని కూడా అంటారు. ఎందుకంటే మెంటన్‌లోనే నిమ్మపండ్లు ఎక్కువ పండుతుంటాయి. మెంటన్ ఒక చిన్న పట్టణం. నైస్ పట్టణానికి 30 కి.మీల దూరంలో ఉంటుంది. ఇది యూరప్‌లో అత్యధికంగా నిమ్మపండ్లను పండిస్తున్న ప్రదేశంగా గుర్తింపు పొందింది.



పద్యం

నిక్కమైన మంచినీలమొక్కటి చాలు
తళుకు బెళుకు రాళ్లు తట్టెడేల
చాటుపద్యమిలను చాలదా ఒక్కటి?
విశ్వదాభిరామ వినురవేమ

భావం : జాతిరత్నం విలువ ఎన్నటికీ పూత అద్దిన రాళ్లకు రాదు. పనికిరాని వేల కవితల కన్నా మంచి నీతిని చాటే పద్యం ఒక్కటి చాలు.

జనరల్ నాలెడ్జ్

చంద్రునిపై కాలు పెట్టిన మొదటి వ్యక్తి ఎవరు?

సూక్తి

లేని గొప్పతనం ప్రదర్శిస్తే నీలో ఉన్న నిజమైన గొప్పతనం మరుగున పడిపోతుంది.

- గౌతమ బుద్ధుడు



చుక్కలు కలపండి



జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. ENHUR ▶..............
2. NDGAIH ▶..............
3. AKTIL ▶..............
4. HAGKLOE ▶..............
5. AADZ ▶..............

జవాబులు

జంబ్లింగ్ వర్డ్స్ :
1. NEHRU
2. GANDHI
3. TILAK
4. GOKHALE
5. AZAD

జనరల్ నాలెడ్జ్ :
నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్

పొడుపు కథ :
అరుగు

నేర్చుకుందాం! Anger = కోపం



పొడుపు కథ


ఎందరు ఎక్కినా విరగని మంచం

మంచి మాట

అత్తరు దుకాణానికి వెళితే అక్కడ మనమేమీ కొనకపోయినా కొంత పరిమళాన్ని గ్రహిస్తాం. ఉత్తముల సాహచర్యమూ అంతే!..



బొమ్మ గీయండి



విజయవాడ రూరల్ యథాతథం

▸ కార్పొరేషన్‌లో కండ్రిక గ్రామం ▸ ఇకపై రెవెన్యూ సేవలు ఉత్తర మండలంలోనే

విజయవాడ రూరల్, జనవరి 3 : జిల్లాలో మండలాల పునర్విభజనలో విజయవాడ రూరల్ మండలం యథాతథంగా ఉండనుంది. రూరల్ మండలం నగరం చుట్టూ విస్తరించి ఉంది. విజయవాడ అర్బన్‌లో ప్రస్తుతం ఉన్న మండలంతో పాటు మరో మూడు అర్బన్ మండలాలు ఏర్పాటు కానున్నాయి. విజయవాడ ఉత్తరం, పశ్చిమ, దక్షిణ మండలాలు కొత్తగా ఆవిర్భవించనున్నాయి. దీంతో విజయవాడ నగరం పక్కనే ఉన్న రామవరప్పాడు, గొల్లపూడి గ్రామాలు అర్బన్ మండలాల్లో చేరతాయనే ప్రచారం జరిగింది. అయితే తాజాగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులలో మండలంలోని ఏ గ్రామం కూడా అర్బన్‌లో విలీనం కావటం లేదనే విషయం తేటతెల్లమైంది. అయితే రెవెన్యూ పరంగా రూరల్‌లో ఉన్న కుందావారి కండ్రిక మాత్రం విజయవాడ ఉత్తర మండలంలో విలీనం కానుంది. రెండున్నర దశాబ్దాల క్రితం విజయవాడ రూరల్ మండలంలో ఉన్న కుందావారి కండ్రిక గ్రామం విజయవాడ కార్పొరేషన్‌లో విలీనమైంది. అయితే కోర్టు స్టే నేపథ్యంలో 1995 వరకు ఆ గ్రామ ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికలలో పాల్గొనలేదు. 1995లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఆ గ్రామ ప్రజలు ఓట్లు వేశారు. కండ్రిక ప్రాంతానికి చెందిన భూమిని ప్రభుత్వం సేకరించి పేదలకు ఇళ్లు నిర్మించింది. ప్రస్తుతం 59వ డివిజన్‌లో ఉన్న కండ్రిక కాలనీ మాత్రం రెవెన్యూ పరంగా విజయవాడ అర్బన్‌లో ఉండగా, గ్రామం మాత్రం విజయవాడ రూరల్ మండలంలో ఉంది.

తాజాగా ప్రభుత్వం నిర్వహించనున్న పునర్విభజనలో రెవెన్యూ పరంగా విజయవాడ రూరల్‌లో ఉన్న కండ్రిక గ్రామాన్ని మాత్రమే ఉత్తర మండలంలో విలీనం కానుంది. ఈ విషయాన్ని విజయవాడ రూరల్ డిప్యూటీ కలెక్టర్ (అండర్ ట్రైనీ తహసీల్దార్) ఎ.రవీంద్రరావు ధ్రువీకరించారు. మండలంలోని మరేతర గ్రామం విజయవాడ అర్బన్ మండలాల్లో విలీనం కావటం లేదన్నారు.

నిందితులను అరెస్టు చేయాలంటూ ర్యాలీ

గవర్నర్‌పేట, జనవరి 3: రాజమండ్రి మసీదులోని మౌజాన్ దారుణ హత్యను ఖండిస్తూ అసలైన దోషులను అరెస్ట్ చేయాలని కోరుతూ బుధవారం నగరంలో ముస్లింలు నిరసన ర్యాలీ నిర్వహించి సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



ముస్లీం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

ముస్లీం ఐక్యవేదిక, అంజుమన్ ఇస్లామిక్ కమిటీ తరపున ఎంజీ రోడ్డు నుంచి మొగల్రాజపురం మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ముస్లీం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు షేక్ జలీల్ మాట్లాడుతూ మౌజన్‌ను దారుణంగా హత్య చేసిన వ్యక్తులను అరెస్ట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లీం ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు షేక్ అహ్మద్ బాషా, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. రషీద్, నేతలు షేక్ బాషా, అబ్దుల్ బాషా పాల్గొన్నారు.


ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

శాంతి ర్యాలీలో గందరగోళం

▸ రూటు మారడంతో అభ్యంతరం వ్యక్తం చేసిన పోలీసులు

విజయవాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాజమండ్రిలో ముస్లిం మతగురువు హత్య నేపథ్యంలో వివిధ వర్గాలు కలిసి సంయుక్తంగా చేపట్టిన ర్యాలీ గందరగోళానికి దారితీసింది. ముస్లిం, క్రైస్తవ, హిందూవర్గాలకు చెందిన పెద్దలు అంతాకలిసి శాంతి ర్యాలీని చేపట్టారు. విజయవాడ మొగల్రాజపురంలోని మదర్ థెరిసా విగ్రహం వద్ద నుంచి ఈ ర్యాలీ చేపట్టారు. దీన్ని పోలీసు కమిషనర్ గౌతమ్ సవాంగ్ ప్రారంభించాల్సి ఉంది. కొన్ని కారణాల వల్ల ఉపకమిషనర్ టి.కాంతిరాణా ప్రారంభించారు. అయిదో నంబర్ మార్గంలో వెళ్లాల్సిన ర్యాలీ మదర్ థెరిసా విగ్రహం నుంచి డీవీ మానర్ హోటల్ వీధిలో మళ్లి అక్కడి నుంచి మహాత్మా గాంధీ రోడ్డులోకొచ్చింది. ఆ సమయంలో ఈ మార్గంలో ట్రాఫిక్ భారీగా ఉండడం, ర్యాలీ వల్ల ఇబ్బంది కలగడంతో ట్రాఫిక్ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ర్యాలీ నిర్వహాకులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న రాణా వివాదానికి ముగింపు పలికారు. బెంజ్ సర్కిల్ వైపు ర్యాలీని పంపారు.

రాజకీయ శక్తిగా ఎదగాలి

గాంధీనగర్, జనవరి 3: దళిత బహుజన వర్గాలను ఏకతాటిపైకి తెచ్చి, రానున్న రోజుల్లో రాజకీయ శక్తిగా ఎదగాలన్నదే తమ లక్ష్యం అని, దళిత గిరిజన ప్రజా సంఘాల ఐక్యవేదిక (జేఏసీ) నాయకుడు తుమ్మల ఫ్రాన్సిస్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ నిర్మాణంపై అన్ని వర్గాల వారితో చర్చించి, 13 జిల్లాల్లో కమిటీలు వేస్తామని తెలిపారు. దళిత, గిరిజన, క్రిస్టియన్, ముస్లింలు అంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. అనంతరం మొట్టమొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమ్ కొరేగావ్ శౌర్య దినోత్సవం సందర్భంగా ఆర్ఎస్ఎస్ తీవ్రవాదులు చేసిన దాడిని ఖండిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో జేఏసీ నాయకులు మురళీకుమార్, లాం జైబాబు, పి.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేస్తా: సీఎం హామీ

ఎన్టీటీపీఎస్(ఇబ్రహీంపట్నం) జనవరి 3: కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం నాయకులకు హామీ ఇచ్చారు. కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే అంశాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రిని టీఎన్‌టీయూసీ నాయకులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కళా వెంకట్రావు కాంట్రాక్టు కార్మికుల సమస్యలు తనకు వివరించారని, దానికి సంబంధించి కమిటీని వేసినట్లు తెలిపారు. కమిటీ నివేదిక వచ్చిన వెంటనే కార్యచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు బుధవారం ఏ కాలనీ టీఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో అనేక మార్లు కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించింది టీడీపీ ప్రభుత్వమేనన్న సంగతి మరిచిమాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమమంలో కాంట్రాక్టు కార్మిక సంఘం నేతలు దుర్గారావు, ప్రవీణ్, స్వతంత్ర కుమార్ పాల్గొన్నారు.


ముఖ్యమంత్రిని కలిసిన టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు


డాక్టర్ అచ్చిరెడ్డిని అభినందిస్తున్న డాక్టర్ తుర్లపాటి కుటుంబరావు

మానవ వికాసానికి మరిన్ని రచనలు చేయాలి

డాక్టర్ తుర్లపాటి కుటుంబరావు

గవర్నర్‌పేట, జనవరి 3: జ్యోతిష్య శాస్త్రంలోనే కాకుండా సామాజిక సేవలో కూడా డాక్టర్ కోనాల అచ్చిరెడ్డి సేవలు ఎనలేనివని ప్రముఖ పాత్రికేయులు డాక్టర్ తుర్లపాటి కుటుంబరావు అన్నారు. దైవజ్ఞ డాక్టర్ కోనాల అచ్చిరెడ్డి 62వ జన్మదిన వేడుకలు సాయిత్రిశక్తి నిలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసిన అనంతరం తుర్లపాటి మాట్లాడుతూ జ్యోతిష్య, సంఖ్య, హస్త సాముద్రిక శాస్త్రాలలో 300కు పైగా గ్రంథాలను రచించిన అచ్చిరెడ్డి మానవ జీవన వికాసం కోసం మరిన్ని రచనలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నగర అధ్యక్షుడు వెల్లంపల్లి శ్రీనివాస్, జనసేన నాయకులు పోతిన వెంకట మహేష్, వివిధ పార్టీల నేతలు ఎం.వి. భాస్కరరావు, అనుమలశెట్టి జ్యోతి, శ్రీనివాసరావు, సిద్ధాంతి శ్రీనివాసరెడ్డి, పిళ్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెగా ఫుడ్ ప్రాసెసింగ్ ఎగ్జిబిషన్ ప్రారంభం నేడు

విజయవాడ,జనవరి 3(ఆంధ్రజ్యోతి): ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణా అండ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీఏపీసీసీ) ఆధ్వర్యంలో ఈ నెల నాలుగవ తేదీ నుంచి ఆరవ తేదీ వరకు స్థానిక శేషసాయి కల్యాణ మండపంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఎగ్జిబిషన్, కాంక్లేవ్ -2018 జరుగుతుందని మీడియా రిలేషన్స్ కన్సల్టెంట్ డైరెక్టర్ వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో పలు సంస్థలు పాల్గొననున్నాయని ఆయన తెలిపారు.

గన్నవరం నుంచి విమాన వేళలు

ఎయిరిండియా	సమయం
ఢిల్లీ	9.05 (ప్రతిరోజు)
	17.20, 20.40(ప్రతిరోజూ)
హైదరాబాద్	12.10 (బుధవారంమాత్రమే)
	17.20 (ప్రతిరోజూ)
విశాఖపట్నం	10.55(బుధవారం మినహా)
	15.35 (బుధవారం మాత్రమే)
తిరుపతి	7.55(బుధవారం మినహా)
స్పైస్‌జెట్	
హైదరాబాద్	8.25 (ప్రతిరోజూ)
	15.35 (బుధవారం మినహా)
	17.35 (శనివారం మినహా)
చెన్నై	15.25 (ప్రతిరోజు)
బెంగళూర్	7.45 (ప్రతిరోజూ)
	20.10 (ప్రతిరోజూ)

గరుడ, ఇంద్ర బస్సు రిజర్వేషన్



విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లు ఆర్టీసీ సర్వీసులు

సర్వీసు	సమయం	బస్సు	04	05	06	07
35105	ఉ.04.30	(మియాపూర్,గ)	44	44	42	45
3565	ఉ.05.30	(మియాపూర్,గ)	45	47	43	47
3567	ఉ.06.30	(బీహెచ్ఈఎల్)	41	41	38	47
3581	ఉ.07.30	(మియాపూర్)	43	41	37	42
3858	ఉ.11.30	(ఆర్‌జీఐఏ-గరుడ)	31	37	31	29
3599	రా.10.45	(మైలాపూర్ ఎక్స్‌రోడ్డు)	00	00	00	00
3571	మ.13.30	(బీహెచ్ఈఎల్)	34	40	43	34
35117	మ.14.15	(ఆర్‌జీఐఏ,గ)	36	35	34	33
3583	మ.14.30	(మియాపూర్,గ+)	44	43	37	38
3886	మ.15.00	(ఆర్‌జీఐఏపి,గ)	30	20	03	24
3573	మ.15.30	(మియాపూర్,గ+)	40	46	43	44
3585	సా.4.30	(మియాపూర్,గ)	43	42	47	43
35133	సా.5.00	(మియాపూర్,గ)	43	44	45	44
35135	సా.05.30	(మియాపూర్,గ)	46	43	46	43
35085	సా.06.30	(మియాపూర్,గ)	46	45	47	45
35189	రా.9.00	(ఆర్‌జీఐ,గ)	03	08	01	19
35155	రా.10.00	(మియాపూర్,గ)	22	22	22	21
35179	రా.10.00	(ఆర్‌జీఐ, ఏపీ,వె)	06	05	00	07
3938	రా.10.00	(మధురవాడ,గ)	28	36	34	35
9377	రా.11.15	(మియాపూర్,గ)	38	38	38	38
9370	రా.1130	(విఐజే-విశాఖ)	45	43	45	46
3575	రా.10.15	(మియాపూర్,ఏసీ)	43	46	47	38
3559	రా.12.00	(ఏఎస్‌రావునగర్)	46	46	46	43
3633	రా.10.30	(మియాపూర్,గ+)	43	42	45	44
3579	రా.10.45	(ఏఎస్‌రావు, గ)	36	33	37	36
3838	రా.11.00	(మియాపూర్,గ+)	44	43	46	46
3569	రా.11.15	(మియాపూర్,గ)	33	36	35	24
3545	రా.11.30	(బీహెచ్ఈఎల్)	46	45	42	42
3872	సా.5.00	(బెంగళూర్, గ)	32	37	32	35
3874	సా.6.00	(బెంగళూర్, గ)	30	33	29	27
35115	రా.8.30	(వీజేఏ-సీఎన్ఐ,గ)	33	28	36	26
3918	రా.9.30	(వీజేఏ-సీఎన్ఐ, గ)	35	36	34	26
3876	రా.8.00	(కుప్పం, గ)	35	36	29	30
47140	రా.10.00	(తిరుపతి,ఏసీ)	44	45	44	46
47138	రా.10.30	(తిరుపతి,ఏసీ)	39	42	39	45
35103	రా.10.30	(విశాఖ, ఇంద్ర)	38	38	34	35
3870	రా.7.00	(విజయ-బెంగళూరు)	17	22	15	17
6727	రా.6.15	(విజయ-ఏటీపీ)	35	31	32	27

వివరాలకు ఫోన్ : 0866- 2523928లో సంప్రదించవచ్చు

రైతుబజార్ ధరలు



(నిన్నటివి)

టమాటో 10-00, వంకాయ (గులాబీ) 18-00, వంకాయ(గుండ్రం)15-00, బెండకాయలు 20-00, పచ్చిమిర్చి సన్నం 19-00, బజ్జిమిర్చి 32-00, కాకరకాయలు 20-00, బీర నాటు 26-00, క్యాబేజీ 14-00, క్యారెట్ 43-00, దొండ 18-00, బంగాళా దుంపలు 12-00, ఉల్లిపాయలు 39-00, గోరుచిక్కుళ్ళు 20-00, దోస 18-00, సొరపెద్ద/చిన్న 8-00/7-00, పొట్ల పెద్ద/చిన్న 10-00/8-00, అరటి పెద్ద/చిన్న 5-00/4-00, చిక్కుళ్లు(నాటు) 26-00, క్యాలీఫ్లవర్ పెద్దది/చిన్నది 10-00/8-00, చామ దుంప 34-00, మునగ పెద్దది/చిన్నది 8-00/7-00, ఆకుకూరలు కట్ట 3 కట్టలు 5-00, కంద కేజీ 24-00, బీట్‌రూట్ 22-00, కాప్సికం 40-00, కీరదోస 12-00, ఫ్రెంచ్‌బీన్స్ 24-00, ఆకాకర 44-00, పెండలం 20-00, నిమ్మకాయలు డజను 12-00/10-00, బొప్పాయి 22-00, కొత్తిమీర కట్ట 5-00/3-00, పొదీన 3-00/5-00, ముల్లంగిదుంప (ఒకటికి) 5-00, పిచ్చుకపొట్ల 12-00, పచ్చిమామిడి పెద్ద/చిన్న 22-00/20-00, చిలకడదుంప కేజీ 20-00, విడిగోంగూర కేజీ 50-00, బఠాణీలు కేజీ 46-00, అలచంద 22-00, స్వీట్‌కార్న్‌కాయ 10-00/8-00

మార్గదర్శకుడు





- అంధుల జీవితాల్లో వెలుగు నింపిన లూయి బ్రెయిలీ
- అక్షరమాల, గణితం, సంగీతంలో గమకాల సృష్టికర్త
- నేడు జయంతి

ఆంధ్రజ్యోతి, విజయవాడఫీచర్స్

లోకాన్ని చూడలేని అభాగ్యులు చదువుకోవడానికి, మనసులోని భావాలను తెలపడానికి లిపి సృష్టించిన లూయీ బ్రెయిలీ జయంతి గురువారం. ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. ఆయన 1809 జనవరి నాలుగో తేదీన ఫ్రాన్స్ రాజధాని పారిస్ సమీపంలోని క్రూవె గ్రామంలో మోనిక్, సైమన్‌రెనె దంపతులకు జన్మించారు.. బాల్యంలో ప్రమాదవశాత్తూ రెండు కళ్లు కోల్పోయి అంధుడయ్యారు. పారిస్‌లోని అంధుల పాఠశాలలో చేరి లైన్‌టైపు పద్ధతిలో చదువుకుని 17 సంవత్సరాలకే అదే పాఠశాలలో ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. పగలు విద్యార్థులకు బోధిస్తూ రాత్రిళ్లు అంధులు తేలికగా చదవగలిగే, రాయగలిగే లిపి తయారీకి కృషి చేశారు అక్షరాలు నున్నగా కాకుండా చుక్కల రూపంలో ఉబ్బెత్తుగా ఉంటే అంధులు గుర్తించడానికి వీలుగా ఉంటుందని ఆరు చుక్కలతో బ్రెయిలీ లిపిని సృష్టించి వారి జీవితాల్లో వెలుగు నింపారు. బ్రెయిలీలో కుడి నుంచి ఎడమకు రాస్తారు. సంగీతాన్ని సైతం బ్రెయిలీ తన లిపిలో రాశారు. ఆయన శిష్యులు తమ గురువు రూపొందించిన లిపికి గుర్తింపు ఇవ్వాలని ఫ్రాన్స్ ప్రభుత్వంతో పోరాటం చేసి సాధించారు. నాటి నుంచి ప్రపంచంలోని అంధులు చదువుకోవడానికి పుస్తకాలు, పత్రికలు బ్రెయిలీ లిపిలోనే వస్తున్నాయి.

అంధులకు కొత్త జీవితం

అంధులు బ్రెయిలీ లిపితో కళ్లున్న వారిలా చదవగలరు. వర్ణమాల, సంఖ్యలను చుక్కలను తాకడం ద్వారా చదవగలరు. ఈ లిపిలోనే



బ్రెయిలీ పేరిట విడులైన నాణేలు

సంగీతం, గణితం చేసే విధానాలున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినా నేటికీ వారు ప్రాథమికంగా బ్రెయిలీ లిపిలోనే చదువుకోవాలి. ఈ విధంగా మొత్తం భాషలకు 250 గుర్తులు, ఆరు చుక్కలతో బ్రెయిలీ లిపి వాడుకలోకి వచ్చింది. అంధుల వికాసానికి కృషి చేస్తూనే లూయీ 1852లో క్షయ వ్యాధితో మృతి చెందారు. బ్రెయిలీ ద్విశత జయంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం రూ. రెండు నాణేలను , అమెరికా డాలర్ నాణేన్ని, ఇటలీ, ఫ్రాన్స్‌లు రెండు యూరోల నాణేన్ని విడుదల చేశాయి. బ్రెయిలీ జయంతి సందర్భంగా అంధుడైనా అంతులేని ఆత్మవిశ్వాసంతో పురోగమిస్తున్న ఓ బ్యాంకు అధికారి ప్రస్థానం తెలుసుకుందామా ...

జాలి పడొద్దు



అంధులను చూసి జాలిపడవద్దు. ఆసరాగా నిలవండి, అంధుల జీవితానికి భరోసా ఇవ్వండి. అంధ విద్యార్థులకు రూ. మూడు వేలు విలువ చేసే ఆడియా పరికరాలు, కంప్యూటర్ జాస్ సాఫ్ట్‌వేర్ ఉచితంగా ఆదరణ వెల్ఫేర్ అసోసియేషన్‌అందజేస్తోంది. సబ్జెక్ట్‌లు వివరించే సీడీలు ఇస్తే ప్రయోజనం ఉంటుంది. అంధులు ఎవరైనా ఆదరణ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఫోన్‌నెం. 9642285555లో సంప్రదించవచ్చు.

- అక్కిశెట్టి శ్రీనివాసులు, అధ్యక్షుడు, ఆదరణ వెల్ఫేర్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్

అంధత్వాన్ని జయించి ..

బ్రెయిలీ స్ఫూరితో అంధులు తాము ఎదుగుతూనే తోటివారికి తోడుగా నిలుస్తున్నారు. దృఢ సంకల్పం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం ఉండాలే కానీ కంటికి వెలుగు లేకపోయినా అద్భుతాలు సృష్టించవచ్చని నిరూపించారు విజయవాడ గవర్నర్‌పేట యూకో బ్యాంకు సీనియర్ మేనేజరు అక్కిశెట్టి శ్రీనివాసులు. ఆరేళ్లుగా ఆదరణ వెల్ఫేర్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్‌ను ఏర్పాటు చేశారు. అంధత్వంతో బాధపడే తనలాంటి వారికి సేవ చేయాలనే ఆలోచనతో శ్రీనివాసులు ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఎం.ఎస్. ఆఫీస్, బేసిక్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. పదో తరగతి, ఇంటర్ అన్ని గ్రూపుల పాఠాలను ఆడియో సీడీల రూపంలో అంధులకు అందజేస్తున్నారు. ఆండ్రాయిడ్ ఫోన్‌లో అంధుల సౌకర్యార్థం ఉన్న సౌకర్యాలపై ఇటీవల నగరంలోని గాయత్రి కన్వెన్షన్ సెంటర్‌లో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. పుట్టుక తోనే అంధుడైన శ్రీనివాసులు నెల్లూరు జిల్లా వెంకటగిరలో అక్కిశెట్టి సుబ్రహ్మణ్యం, సరస్వతి దంపతులకు జన్మించారు. ఆయన వెంకటగిరి సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకూ బ్రెయిలీ లిపిలో చదివారు. తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో ఇంటర్, డిగ్రీ, వైజాగ్ ఆంధ్రా యూనివర్శిటీలో ఎం.ఏ చదివారు. మార్కెటింగ్‌పై పట్టు సాధించాలనే తపనతో ఎంబీఏ దూరవిద్య విధానం ద్వారా పూర్తి చేశారు. ఎంబీఏ చదువుతూనే పోటీ పరీక్షల్లో సత్తా చాటి బ్యాంకు ఉద్యోగానికి ఎంపికయ్యారు.



ఆదరణ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఆశ్రయం పొందిన అంధులతో శ్రీనివాసులు

సంక్షిప్తం

చైన్‌మన్ పోస్టులను లైసెన్స్‌డ్ సర్వేయర్లతో భర్తీ చేయాలి

విజయవాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : చైన్‌మన్ పోస్టులను లైసెన్స్‌డ్ సర్వేయర్లతోనే భర్తీ చేయాలని పంచాయతీరాజ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు రెవెన్యూ లైసెన్స్‌డ్ సర్వేయర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. బుధవారం పెనమలూరు మం డలం పోరంకిలో జరిగిన 'మావూరు - జన్మభూమి' లో పాల్గొనడానికి వచ్చిన లోకేశ్‌ను అసోసియేషన్ ప్రతినిధులు నెమలకంటి శ్రీనివాస్, సీహెచ్‌ఆర్ జవహర్‌లాల్ శర్మ, చందు, మనోజ్ తదితరులు కలిశారు. పోలీసు ఉద్యోగాల్లో హోం గార్డులకు ఇస్తున్నట్లుగానే, డిప్యూటీ సర్వేయర్లు, వీఆర్‌ఓ పోస్టుల భర్తీలో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు రిజర్వేషన్, వయోపరిమితి సడలింపు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల సమస్యలకు సంబంధించిన వినతి పత్రాన్ని మంత్రి లోకేశ్‌కు అందించారు.

స్వగ్రామంలో జస్టిస్ చలమేశ్వర్



పెదముత్తేవి గ్రామస్తులతో చలమేశ్వర్

పెదముత్తేవి (కూచిపూడి) , జనవరి 3 : సుప్రీం కోర్టు న్యాయ మూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ బుధవారం స్వగ్రామమైన పెదముత్తేవికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మిత్రులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. వారితో పాడిపంటలు, గ్రామ పరిస్థితులు, యోగ క్షేమాలపై కొద్దిసేపు ముచ్చటించారు.

త్యాగరాజ కృతులు ఆలపించిన 18 బృందాలు

విజయవాడ కల్చరల్, జనవరి 3 : త్యాగరాజ కృతులు మధురంగా పాడి సంగీత విద్వాంసులు శ్రోతలను సంగీత సాగరంలో ఓలలాడించారు. సత్య నారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో సద్గురు శ్రీత్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలలో భాగంగా మూడో రోజు బుధవారం 18 బృందాలు పాల్గొని కచేరిలు చేశాయి. తొలుత బి. సాయికీర్త, శ్రీకరి, ప్రణతిల గాత్ర త్రయంతో ప్రారంభించిన సంగీత సభ అన్నవరపు రామస్వామి మోదుఎ మూడి సుధాకర్‌ల వయోలిన్, గాత్ర కచేరీలతో ముగిసింది. పోపూరి చారుమతిపల్లవి, పరమాత్ముడు వెలిగే - వాగధీశ్వరి రాగంలో శ్రావ్యంగా గానం చేశారు. పి.సాత్వికశ్రీజ, ముడుం బాయి లక్ష్మి, రమా భగవాన్, ఆస్ట్రేలియాకు చెందిన శక్తి రవి, కల్లూరి శ్రీనివాస్‌ల గాత్ర కచేరీలు అలరించాయి.

కె.శశిధర్, దుర్గేశ నందిని, ఎస్.సుజాత, ప్రభుత్వ సంగీత కళాశాల విద్యార్థుల బృంద వీణావాదన కచేరీలు పరవశింపజేశాయి.

రవాణాకు రూ. 313 కోట్ల ఆదాయం

- రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ మీరా ప్రసాద్ వెల్లడి



గుడివాడటౌన్, జనవరి 3 : వాహనాల పన్నులు, తనిఖీలు, ఫీజులకు సంబంధించి జిల్లా రవాణా శాఖకు రూ.313 కోట్ల రెవెన్యూ సమకూరిందని నూటికి నూరుశాతం ప్రభుత్వం నిర్ధేశించిన టార్గెట్ జనవరి 2017 డిసెంబర్ 31లోపు పూర్తి చేసినట్లు రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మీరా ప్రసాద్ చెప్పారు. స్థానిక ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది వాహనాల పన్నులు, తనిఖీలు, ఫీజులు ఇతర టాక్స్‌లకు సంబంధించి జిల్లాకు రూ.312.40 కోట్లు టార్గెట్‌గా నిర్ణయించగా 2017 డిసెంబర్ 31 నాటికి 23.59 శాతం అభివృద్ధి సాధించి రూ.313 కోట్ల ఆదాయం సమకూరినట్లు చెప్పారు. అదనంగా రూ.60 లక్షలు రెవెన్యూ వచ్చిం దన్నారు. పోలీస్, రవాణా శాఖ సంయుక్తంగా నిర్వహించిన డ్రైవ్‌లో జిల్లాలో ప్రమాదాలు, మరణాలు సంఖ్య 10 శాతం తగ్గించ గలిగామని మీరా ప్రసాద్ తెలిపారు. వారం కిందట ఆటో ప్రమాదంలో విద్యార్థులు దుర్మరణం చెందారన్నారు. దీని దృష్ట్యా ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

నిబంధనలు పాటించకుంటే పర్మిట్లు రద్దు

రవాణా శాఖ నిబంధనలు పాటించకుంటే లారీ, ఆటో, ద్విచక్రవాహనాల పర్మిట్లు, వారి లైసెన్సులు రద్దు చేస్తామని మీరా ప్రసాద్ హెచ్చరించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారన్నారు. భద్రతా నిబంధనలు పాటించని లారీ, ఆటో, ద్విచక్ర వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీవో సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలలో విజేత పీబీ సిద్ధార్థ



పోటీల్లో తలబడుతున్న ఏజీ అండ్ ఎస్‌జీ, వీఆర్ సిద్ధార్థ జట్లు

విజయవాడ స్పోర్ట్స్, జనవరి 3 : సిద్ధార్థ అకాడమీ అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పురుషుల వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను సిద్ధార్థ అకాడమి కార్యదర్శి పాలడగు లక్ష్మణరావు ప్రారంభించారు. మొత్తం ఎనిమిది కళాశాలల జట్లు పాల్గొన్నాయి. నాకౌట్ పద్ధతిలో జరిగిన ఈ పోటీల్లో పీబీ సిద్ధార్థ కళాశాల జట్టు ప్రథమ స్థానాన్ని, ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల ఉయ్యూరు ద్వితీయ స్థానాన్ని సాధించారు. ప్రిన్సిపాల్ ఎస్.రమేష్, అధ్యక్షత వహించారు. గౌరవ అతిథులుగా కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు డీన్ ఆచార్య రాజేష్, సి.జంపాల హాజరయ్యారు. పోటీల నిర్వహణను కళాశాల వ్యాయామ విద్యావిభాగాధిపతి ఎన్.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్ నూతన అధ్యక్షుడు?

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

1. **2017కి గాను పురుషుల విభాగంలో ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ విజేత?**
ఎ) మాగ్నస్ కార్ల్‌సన్(నార్వే)
బి) వ్లాదిమర్ ఫెడోసివ్(రష్యా)
సి) విశ్వనాథన్ ఆనంద్(ఇండియా)
డి) అలెగ్జాండర్ గ్రిషుక్(రష్యా)

2. **2017కి గాను మహిళల విభాగంలో ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ విజేత?**
ఎ) జువెన్‌జున్(చైనా)
బి) జుడిత్ పోల్గర్(హంగేరి)
సి) సోఫియా పోల్గర్(హంగేరి)
డి) అనా ఉషెనినా(ఉక్రెయిన్)

3. **2017కి గాను 'రాయల్‌కప్' ఏషియన్ టూర్ టైటిల్ విజేత శివకపూర్. అతడు ఏ క్రీడకు సంబంధించిన వ్యక్తి?**
ఎ) షూటింగ్ బి) బిలియర్డ్స్
సి) గోల్ఫ్ డి) జిమ్నాస్టిక్స్

4. **గ్లోబ్ సాకర్ అవార్డ్స్-2017 ఉత్తమ సాకర్ ఆటగాడిగా ఎవరు ఎంపికయ్యారు?**
ఎ) లియోనల్ మెస్సీ బి) క్రిస్టియనా రొనాల్డో
సి) నెయ్‌మార్(బ్రెజిల్) డి) ముల్లర్(జర్మనీ)

5. **ఢిల్లీపై గెలుపొంది 2017-18 రంజీ ట్రోఫీ చాంపియన్‌గా నిలిచిన జట్టు?**
ఎ) ముంబై బి) గుజరాత్
సి) తమిళనాడు డి) విదర్భ



6. **61వ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆతిథ్యమిస్తున్న వేదిక?**
ఎ) లుథియానా(పంజాబ్)
బి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
సి) బెంగళూరు(కర్ణాటక)
డి) తిరువనంతపురం(కేరళ)

7. **రంజీ ట్రోఫీ ఫైనల్‌లో హ్యాట్రిక్ సాధించిన రెండో బౌలర్ రజ్‌నీస్ గుర్బాని(విదర్భ). అయితే 1972-73లో ఈ ఘనత సాధించిన తొలి బౌలర్?**
ఎ) కళ్యాణ సుందరం(తమిళనాడు)
బి) ఆర్.పి.సింగ్(ఉత్తరప్రదేశ్)
సి) అర్షద్ అయూబ్(హైదరాబాద్)
డి) జవగళ్ శ్రీనాథ్(కర్ణాటక)

8. **క్రికెట్ చరిత్రలో తొలిసారిగా నాలుగు రోజుల టెస్ట్ మ్యాచ్‌ను ఏ రెండు దేశాల మధ్య నిర్వహించారు?**
ఎ) ఆస్ట్రేలియా - న్యూజిలాండ్
బి) దక్షిణాఫ్రికా-జింబాబ్వే
సి) దక్షిణాఫ్రికా - న్యూజిలాండ్
డి) వెస్టిండీస్ - జింబాబ్వే

9. **2018 జనవరి 12-16 వరకు 22వ జాతీయ యువజన ఉత్సవాలు ఏ నగరం వేదికగా నిర్వహించనున్నారు?**
ఎ) జైపూర్(రాజస్థాన్)
బి) రాయ్‌పూర్(చత్తీస్‌గఢ్)
సి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
డి) మధురై(తమిళనాడు)

10. **2017 డిసెంబర్ 27-31 వరకు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఆతిథ్యం ఇచ్చిన నగరం?**
ఎ) హైదరాబాద్(తెలంగాణ)
బి) గాంధీనగర్(గుజరాత్)
సి) కొచ్చి(కేరళ) డి) భువనేశ్వర్(ఒడిశా)

11. **2018 జనవరి 13-15 వరకు అంతర్జాతీయ తీపి పదార్థాల ఉత్సవాలకు ఆతిథ్యం ఇవ్వనున్న నగరం?**
ఎ) కాకినాడ(ఆంధ్రప్రదేశ్)
బి) నాగ్‌పూర్(మహారాష్ట్ర)
సి) అమరావతి(ఆంధ్రప్రదేశ్)
డి) హైదరాబాద్(తెలంగాణ)

12. **78వ 'ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్-2017' సదస్సును ఎక్కడ నిర్వహించారు?**
ఎ) ఉస్మానియా యూనివర్సిటీ(హైదరాబాద్)
బి) జాదవ్‌పూర్ యూనివర్సిటీ(కోల్‌కతా)
సి) షేర్-ఎ-కశ్మీర్ యూనివర్సిటీ(శ్రీనగర్)
డి) బర్కతుల్లా యూనివర్సిటీ(భోపాల్)

13. **2017 డిసెంబర్ 31న బహిరంగ మలవిసర్జన రహిత రాష్ట్రంగా దేన్ని ప్రకటించారు?**
ఎ) మిజోరాం బి) ఒడిశా
సి) అరుణాచల్‌ప్రదేశ్ డి) బీహార్

14. **కూరగాయలకు కనీస మద్దతు ధర ప్రకటించడం ద్వారా ఆ ప్రత్యేకత పొందిన తొలిరాష్ట్రంగా నిలిచింది?**
ఎ) పంజాబ్ బి) హర్యానా
సి) నాగాలాండ్ డి) బీహార్

15. **ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్‌కు నూతన అధ్యక్షుడు?**
ఎ) వినయ్ సహస్రబుద్దే బి) లోకేశ్ చంద్ర
సి) ప్రతిష్టశర్మ డి) నజ్మాహెప్తుల్లా

16. **కేంద్ర పునర్వినియోగ ఇంధన వనరుల శాఖ వివరాల ప్రకారం మునిసిపల్ వ్యర్థాల నుంచి తయారవుతున్న విద్యుత్ 65.75 మెగా వాట్స్. మొత్తం విద్యుత్‌లో ఎంత శాతం?**
ఎ) 1.6% బి) 0.02% సి) 0.8% డి) 0.6%

17. **2018 మార్చిలో 105వ సైన్స్ కాంగ్రెస్ సమావేశానికి ఆతిథ్యమిస్తున్నది?**
ఎ) ఉస్మానియా యూనివర్సిటీ(హైదరాబాద్)
బి) మణిపూర్ యూనివర్సిటీ(ఇంఫాల్)
సి) శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ(తిరుపతి)
డి) ఫిజికల్ రీసెర్చ్ లేబరేటరీ(అహ్మదాబాద్)

18. **పాసింజర్ రైళ్లకు ఎప్పటిలోగా బయోటాయ్‌లెట్లను 100% అమర్చాలని కేంద్రం నిర్ణయించింది?**
ఎ) 2018 డిసెంబర్ బి) 2019 మార్చి
సి) 2018 జూలై డి) 2022 మార్చి

19. **2017కి గాను PETA పర్సన్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపికైన బాలీవుడ్ నటి అనుష్కశర్మ. PETA ను విస్తరించండి.**
ఎ) పీపుల్ ఫర్ ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్
బి) ప్రొటెక్షన్ ఎంటాంజిబుల్ యానిమల్స్
సి) ప్రిజర్వేషన్ అండ్ ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్
డి) పీపుల్ ఫర్ ఎమోషనల్ ట్రాకింగ్ ఆఫ్ యానిమల్స్

20. **2018 జనవరి 12న కార్టోశాట్-2 సహా 31 ఉపగ్రహ ప్రయోగాలకు ఇస్రో ఉపయోగిస్తున్న వాహక నౌక?**
ఎ) PSLV-C36 బి) PSLV-C40
సి) PSLV-C342 డి) PSLV-C39

21. **2017 డిసెంబర్ 29న నిర్మలా సీతారామన్ 'సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆపర్చునిటీస్ అండ్ లెర్నింగ్' కేంద్రాన్ని ఎక్కడ ప్రారంభించారు?**
ఎ) మంగళూరు(కర్ణాటక)
బి) విశాఖపట్నం(ఆంధ్రప్రదేశ్)
సి) ట్యుటికొరిన్(తమిళనాడు)
డి) పనాజి(గోవా)

22. **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018 సంవత్సరాన్ని ఏ విధంగా ప్రకటించింది?**
ఎ) నవతేజ శిశు వికాస సంవత్సరం
బి) విద్యుదీకరణ సంవత్సరం
సి) రైతు సౌభాగ్య సంవత్సరం
డి) తెలుగు అభివృద్ధి సంవత్సరం

23. **ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ 2017కు గాను వెలువరించిన 'శాంతి అనుకూల సూచి'లో తొలి మూడు స్థానాలు పొందిన దేశాలు వరుసగా ...**
ఎ) స్వీడన్, స్విట్జర్లాండ్, డెన్మార్క్
బి) ఐస్‌లాండ్, నార్వే, ఫిన్లాండ్
సి) స్వీడన్, స్విట్జర్లాండ్, ఫిన్లాండ్
డి) ఫిన్లాండ్, స్వీడన్, నార్వే

24. **హిమాచల్‌ప్రదేశ్ నూతన ముఖ్యమంత్రి?**
ఎ) జయప్రకాశ్ నడ్డా బి) ప్రేమ్‌కుమార్ ధుమాల్
సి) జైరామ్ ఠాకూర్ డి) సత్పాల్‌సింగ్ సాధి

25. **జాతీయ ఇ-గవర్నెన్స్‌లో భాగాంగా చేపట్టిన క్రిమినల్ ట్రాకింగ్ అండ్ నెట్‌వర్క్ సిస్టం ఆధారంగా 2018 జనవరి 1 నుంచి అన్ని పోలీస్ కార్యకలాపాలను డిజిటలైజ్ చేసిన రాష్ట్రం?**
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) గోవా సి) గుజరాత్ డి) ఒడిశా

26. **2017 డిసెంబర్ 27న రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఏ రాష్ట్రానికి చెందిన ఫైబర్ నెట్ ప్రాజెక్టును ప్రారంభించారు?**
ఎ) మధ్యప్రదేశ్ బి) ఆంధ్రప్రదేశ్
సి) బీహార్ డి) తెలంగాణ

27. **2018 జనవరి 1న తెలంగాణ పోలీస్‌శాఖ ప్రవేశపెట్టిన 'TSCOP' యాప్ ద్వారా ఎన్ని రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి?**
ఎ) 100 బి) 63 సి) 44 డి) 54

28. **సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఇటీవల ఏ రాష్ట్రంలో ఆరు నెలల పాటు పొడిగించారు?**
ఎ) త్రిపుర బి) నాగాలాండ్
సి) మణిపూర్ డి) మేఘాలయ

29. **పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 700 మెగావాట్ల లక్ష్యంతో పాకిస్థాన్ ప్రభుత్వం 'ఆజాద్ పట్టాన్ జల విద్యుత్ కేంద్రం'ను ఏ నదిపై నిర్మిస్తోంది?**
ఎ) సింధు నది బి) జీలం నది
సి) స్వాత్ నది డి) కుర్రం నది

30. **ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ 2017కి గాను వెలువరించిన 'శాంతి అనుకూల సూచి'లో భారత ర్యాంక్?**
ఎ) 90 బి) 163
సి) 106 డి) 123

31. **ఆంధ్రప్రదేశ్ నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డిజిపి)?**
ఎ) నండూరి సాంబశివరావు
బి) గౌతం సవాంగ్
సి) మాల కొండయ్య
డి) అరవిందరావు



32. **లైబిరియా నూతన అధ్యక్షుడు?**
ఎ) జార్జి వా
బి) చార్లెస్ టేలర్
సి) ఎలెన్ జాన్సన్ సర్లీఫ్
డి) విలియం ట్యుబ్‌మన్



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

33. **కేర్‌రేటింగ్స్(క్రెడిట్ రేటింగ్స్ అండ్ రీసెర్చ్)-2017 నివేదిక ప్రకారం ప్రపంచంలో అత్యధిక నిరర్థక ఆస్తులు కలిగిన దేశం గ్రీసు, కాగా భారత్ ర్యాంక్?**
ఎ) 18 బి) 35
సి) 14 డి) 5

34. **దేశ చరిత్రలో తొలిసారి ప్రపంచ చెస్ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా ప్రాచుర్యం పొందిన దేశం?**
ఎ) లిబియ బి) ఖతార్
సి) సౌదీ అరేబియా డి) ఘనా

35. **2018 జనవరి 1 నుంచి VAT(వాల్యూ ఆడెడ్ ట్యాక్స్)ను ప్రవేశపెట్టిన దేశాలు?**
ఎ) సౌదీ అరేబియా, యుఎఇ బి) కెన్యా, దక్షిణాఫ్రికా
సి) గ్రీసు, వెనిజులా డి) ఇథియోపియా, గ్రీసు

36. **2017 డిసెంబర్ 26న భారత్ ఏ దేశానికి 1 మిలియన్ డాలర్ల మానవతాపరమైన వైద్య సహాయం అందించాలని నిర్ణయించింది?**
ఎ) గ్రీసు బి) యెమన్
సి) మయన్మార్ డి) శ్రీలంక

37. **జింబాబ్వే నూతన ఉపాధ్యక్షుడు?**
ఎ) అబ్దుల్లాహి ఫర్మాజో బి) ఒమర్-అల్-బషీర్
సి) సెబాస్టియన్ పినెరా డి) కాన్‌స్టాంటిన్ చివేగా

38. **మాలి నూతన ప్రధాని?**
ఎ) ఇబ్రహిం కేయిత బి) బొబయ్ మైగా
సి) మిచెల్లి బాబ్‌లెట్ డి) సెబాస్టియన్ పినెరా

సమాధానాలు

1) సి	9) ఎ	17) బి	25) డి	33) డి
2) ఎ	10) బి	18) బి	26) బి	34) సి
3) సి	11) డి	19) ఎ	27) డి	35) ఎ
4) బి	12) బి	20) బి	28) బి	36) బి
5) డి	13) సి	21) ఎ	29) బి	37) డి
6) డి	14) బి	22) డి	30) ఎ	38) బి
7) ఎ	15) ఎ	23) సి	31) సి	
8) బి	16) బి	24) సి	32) ఎ	

ఉద్యోగాలు

సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్

బెంగళూరులోని డిఆర్‌డిఒ-సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
జూనియర్ రీసెర్చ్ ఫెలో: 15
విభాగాలు:ఏరోడైనమిక్స్, స్ట్రక్చరల్ డిజైన్ అనాలసిస్, రాడార్ ఇంజనీరింగ్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, నెట్‌వర్కింగ్ & డిస్‌ప్లే సిస్టమ్స్, మిషన్ కంప్యూటర్, థర్మల్ మేనేజ్‌మెంట్.
అర్హత:బిఇ/బిటెక్/ఎంఇ/ఎంటెక్(ఎలక్ట్రానిక్స్/ఇసిఇ/ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇఇఇ/సిఎస్‌ఇ/ ఇన్ఫర్మేషన్ సైన్స్/ఏరోనాటిక్స్/మెకానికల్ ఇంజనీరింగ్). నెట్/గేట్ అర్హత ఉండాలి.
వయోపరిమితి: 28 సంవత్సరాలు మించకూడదు
ఫెలోషిప్: రూ.25,000 **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా **చివరి తేదీ:** 2018 జనవరి 19
చిరునామా: The Director, Centre for Airborne Systems (CABS), DRDO, Ministry of Defence, Belur, Yemlur PO., Bengaluru - 560 037.
వెబ్‌సైట్: https://www.drdo.gov.in

టిఫర్ వివిఎస్‌ఆర్‌పి-2018

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(టిఫర్) సమ్మర్ ప్రోగాంలో రీసెర్చ్ కోసం దరఖాస్తులు కోరుతోంది.
ప్రోగ్రాం: విజిటింగ్ స్టూడెంట్స్ రీసెర్చ్ ప్రొగ్రాం
కాల వ్యవధి: 2018 మే 7 నుంచి జూలై 4 వరకు
స్టయిపెండ్: నెలకు రూ.7000
అర్హత: ఆయా కోర్సుల్లో ప్రస్తుతం చదువుతున్న డిగ్రీ లేదా పీజీ విద్యార్థులు
ఎంపిఎ: అకడమిక్ మెరిట్, రైటప్, రిఫరీ నివేదికల ఆధారంగా **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్
చివరి తేదీ: 2018 ఫిబ్రవరి 28
వెబ్‌సైట్: http://www.tifr.res.in

ఎన్ఐపిజిఆర్

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ జినోమ్ రీసెర్చ్ సీనియర్ రీసెర్చ్ ఫెలో భర్తీకి దరఖాస్తు కోరుతోంది.
సీనియర్ రీసెర్చ్ ఫెలో:01
అర్హత: ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్/బయో టెక్నాలజీ/ బయో ఇన్‌ఫర్మాటిక్స్/మాలిక్యూలర్ బయాలజీ)
అనుభవం:సంబంధిత విభాగంలో రెండేళ్ల అనుభవం ఉండాలి. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
చివరి తేదీ: 2018 జనవరి 12
చిరునామా: Dr. Swarup Kumar Parida, Scientist, NIPGR. Aruna Asraf Ali Mrag, P.O. Box No. 10531, New Delhi - 110067.
వెబ్‌సైట్: http://www.nipgr.res.in/careers

భారతదేశంలో జనగణనను ఎవరు నిర్వహిస్తారు?

పాఠం-5

భారతదేశ నదులు, నీటి వనరులు

ఒక మార్కు ప్రశ్నలు

1. **భారత నదీ వ్యవస్థ ఏ అంశాలకు అనుగుణంగా రూపొందింది?**

జ: భారతదేశ నదీ వ్యవస్థ భౌతిక అంశాలకు అనుగుణంగా రూపొందింది. అవి 1)హిమాలయాలు, 2)ద్వీపకల్ప పీఠభూమి, 3)గంగా - సింధూ మైదానం.

2. **హిమాలయ నదులను జీవనదులని ఎందుకు పిలుస్తున్నారు?**

జ: హిమాలయ నదులు జీవనదులు, సంవత్సరమంతా వీటిలో నీరు ఉంటుంది. వర్షపాతం, కరుగుతున్న మంచుతో నీరు అందడం వల్ల వీటిని జీవనదులుగా పిలుస్తున్నారు.

3. **తుంగ భద్రానది పరివాహక ప్రాంతాన్ని ఎలా విభజిస్తారు?**

జ: తుంగభద్రానది పరీవాహక ప్రాంతాన్ని మూడుగా విభజిస్తారు. 1)కర్ణాటకలోని ఎగువ, మధ్య పరీవాహక ప్రాంతాలు, 2)ఆంధ్రప్రదేశ్‌లోని దిగువ పరీవాహక ప్రాంతం.

4. **భూగర్భ జలాలకు సంబంధించిన చట్టాలు ఎందుకు ప్రస్తుత పరిస్థితులకు అనుకూలమైనవి కావు?**

జ: భూగర్భ జలాల వినియోగం నామమాత్రంగా ఉన్న రోజుల్లో సంబంధిత చట్టాలను రూపొందించారు. దాంతో అవి నేటి కాలానికి అనువుగా లేవు.

5. **'వాటర్ షెడ్' పదాన్ని చర్చించండి.**

జ: ఒక ఎత్తయిన ప్రాంతంలో ఒక వైపు నీటి ప్రవాహాలు ఒక నదిలోనూ, మరో వైపు నీటి ప్రవాహాలు మరో నదిలోనూ కలిస్తే దానిని 'వాటర్ షెడ్' అని అంటారు. ఈ నీటిని భూమిలోకి ఇంకేలా చేయడానికి చెట్లు నాటవచ్చు. లేదా చెరువులు లాంటివి తవ్వించవచ్చు. అలా చేయడాన్ని 'వాటర్ షెడ్ అభివృద్ధి పథకం' అని అంటారు.

2 మార్కుల ప్రశ్నలు

1. **హిమాలయ నదుల గూర్చి తెలపండి?**

జ: హిమాలయ నదులు మూడు ముఖ్యమైన వ్యవస్థల కిందకు వస్తాయి. అవి గంగ, సింధూ, బ్రహ్మపుత్ర నదులు. ఈ నదులు దాదాపు ఒకే ప్రాంతంలో కొన్ని కిలోమీటర్ల వ్యత్యాసంతో పుట్టి పర్వత శ్రేణుల వల్ల వేరు అయ్యాయి. అవి మొదట పర్వతాల ప్రధాన అక్షానికి సమాంతరంగా ప్రవహిస్తాయి. తరవాత ఒక్కసారిగా అవి దక్షిణానికి మలుపు తిరిగి ఎత్తయిన పర్వత శృంఖలాలను కోసుకుంటూ ఉత్తర భారత మైదానాలను చేరుకుంటాయి. ఈ క్రమంలో ఇవి లోతైన V ఆకారపు లోయలను ఏర్పరిచాయి. ఇది సింధు, బ్రహ్మపుత్ర నదుల్లో బాగా కనిపిస్తుంది.

2. **అవపాతం అంటే ఏమిటి?**

జ: అవపాతం అంటే వర్షం ఒక్కటే కాకుండా వడగళ్లు, హిమం, పొగమంచు కూడా ఉంటాయి. అవపాతం అన్ని సంవత్సరాలు ఒకేలా కాకుండా ఏటా మారుతూ ఉంటుంది. అవపాతం సగటును పరిగణనలోకి తీసుకుంటారు.

3. **హివారే బజారులో నాలుగు ముఖ్యమైన నిషేధాలు ఏవి?**

జ: మహారాష్ట్రలో ఆదర్శ గ్రామ పథకాన్ని మొదలు పెట్టినపుడు గ్రామాల ఎంపికకు కొన్ని షరతులు పెట్టారు. దీంట్లో ముఖ్యమైన నాలుగు నిషేధాలు ఉన్నాయి. 'రాలేగావ్ సిద్ధి' సాధించిన విజయంతో అవి ప్రఖ్యాతిగాంచాయి. అవి..చెట్లను నరకడం నిషేధం, పశువులను స్వేచ్ఛగా మేయడానికి వదలడం నిషేధం, మత్తు పానీయాల నిషేధం, అధిక సంతానం నిషేధం. అంతే కాకుండా ప్రజలు కొంత శ్రమదానం కూడా చెయ్యాలి. భూమిలేని పేదలకు దీని నుంచి మినహాయింపు ఉంది.


4. **పుట్టుక ఆధారంగా మనదేశ నదీ జలవ్యవస్థను వర్గీకరించండి.**

జ: పుట్టుక ఆధారంగా మనదేశ నదీ జల వ్యవస్థను రెండుగా విభజించవచ్చు. అవి:1)హిమాలయ నదులు, 2)ద్వీపకల్ప నదులు. **హిమాలయ నదులు:** వీటిలో నీళ్లు ఉంటాయి. వర్షపాతం, కరుగుతున్న మంచుతో నీళ్లు అందడం వల్ల జీవనదులుగా పిలుస్తున్నారు. ఉదా: గంగా, సింధు, బ్రహ్మపుత్ర మొదలైనవి.

ద్వీపకల్ప నదులు: ద్వీకల్ప నదుల్లో సంవత్సరమంతా నీరు ఉండదు. ఇవి వర్షం మీద ఆధారపడి ఉంటాయి.

ఉదా: గోదావరి, కృష్ణా, కావేరి, మహానది మొదలైనవి

5. **పటాన్ని పరిశీలించి కింది ప్రశ్నలకు జవాబులు రాయండి?**



పటం : గంగా, బ్రహ్మపుత్రల సంగమం

1. హిమాలయాల్లో పుట్టి గంగానదిలో కలిసే ఉపనదులేవి?
2. బ్రహ్మపుత్ర నదిని టిబెట్‌లో ఏ పేరుతో పిలుస్తారు?
3. ద్వీకల్ప పీఠభూమిలో పుట్టి గంగానదిలో కలిసే ఉపనదులు ఏవి?
4. గంగానది ఏయే రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తోంది?

సమాధానాలు:

1) గోమతి, గండక్, కోసి, ఘగ్గర్ మొదలైన ఉపనదులు
2) బ్రహ్మపుత్ర నదిని టిబెట్‌లో సాంగ్‌పో నది అని పిలుస్తారు
3) చంబల్, బేత్వా, థమ్సా, సోన్ మొదలైనవి ద్వీపకల్ప పీఠభూమిలో పుట్టి గంగానదిలో కలిసే ఉపనదులు
4) గంగానది ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తోంది

4 మార్కుల ప్రశ్నలు

1. **మీ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. ఏయే కారణాల వల్ల ఇలా జరిగిందని నీవు భావిస్తున్నావు?**

జ: 1) భూగర్భ జలం ప్రధాన జలవనరుగా ఉన్నది
2) భూగర్భ జలాలు అక్కడికి చేరుకునే వాటి కంటే ఎక్కువ మొత్తంలో వాటిని తోడి వేస్తున్నారు.
3) పర్యవసానంగా ఎక్కువ లోతుకు బోరుబావులను తవ్వుతున్నారు
4) భూగర్భ జలాలను వ్యవసాయానికి ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.
5) పారిశ్రామిక, గృహ అవసరాలకు కూడా భూగర్భ జలాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు.
6) అడవుల నరికివేత వల్ల కూడా భూమిలోకి ఇంకే నీటి పరిమాణం తగ్గుతుంది.
7) ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కువగా భూమి మీద వదలడం వల్ల భూమిలోకి నీరు ఇంకే స్థాయి తగ్గి, భూగర్భ జల మట్టాలు తగ్గిపోతున్నాయి.
8) ఇంకుడు గుంతలను సరిగా వినియోగించకపోవడం మొదలైన కారణాల వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి.

పాఠం-6

ప్రజలు

ఒక మార్కు ప్రశ్నలు

1. **భారతదేశంలో జనగణనను ఎవరు నిర్వహిస్తారు?**

జ: సెన్సస్ ఆఫ్ ఇండియా అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ జనగణన, సేకరణ, నమోదు, విశ్లేషణ మొదలైన కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

2. **భారతదేశ అక్షరాస్యత ఎంత?**

జ: భారతదేశ అక్షరాస్యత: 74.04%, పురుషుల అక్షరాస్యత:82.14%, స్త్రీల అక్షరాస్యత: 65.46%

3. **జనాభా మార్పును ప్రభావితం చేసే అంశాలు ఏవి?**

జ: 1)జననాలు 2)మరణాలు 3)వలసలు

4. **2011లో భారతదేశ జనాభా వృద్ధి శాతం ఎంత?**

జ: 2011లో భారతదేశ జనాభా వృద్ధిశాతం : 17.58%

5. **భారతదేశంలో అత్యధిక జన సాంద్రత గల రాష్ట్రం ఏది?**

జ: అత్యధిక జన సాంద్రత గల రాష్ట్రం - పశ్చిమ బెంగాల్(904)

6. **భారతదేశంలో అత్యల్ప జనసాంద్రత గల రాష్ట్రం ఏది?**

జ: అత్యల్ప జనసాంద్రత గల రాష్ట్రం - అరుణాచల్ ప్రదేశ్(13)

7. **ఆంధ్ర ప్రదేశ్‌లో అత్యధిక జన సాంద్రత గల జిల్లా ఏది?**

జ: ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక జనసాంద్రత గల జిల్లా - కృష్ణా(519)

8. **ఆంధ్రప్రదేశ్‌లో అత్యల్ప జన సాంద్రతగల జిల్లా ఏది?**

జ: ఆంధ్రప్రదేశ్‌లో అత్యల్ప జన సాంద్రతగల జిల్లా - వైఎస్ఆర్ కడప జిల్లా(188)

9. **జనాభా వృద్ధి శాతం అంటే ఏమిటి?**

జ: జనాభా వృద్ధి శాతం చాలా ముఖ్యమైన అంశం. దీనిని సంవత్సరానికి శాతంలో లెక్కగడతారు. ఉదాహరణకు సంవత్సరానికి 2% వృద్ధి అంటే అంతకు ముందు సంవత్సరంలో ఉన్న ప్రతి వంద మందికి ఇద్దరు చొప్పున జనాభా పెరిగిందన్నమాట. ఇది చక్రవడ్డీలాగా ఉంటుంది. దీనిని వార్షిక వృద్ధి శాతం అంటారు.

10. **లింగ నిష్పత్తిని ఎలా లెక్కిస్తారు?**

జ: ప్రతి 1000 మంది పురుష జనాభాకు ఉండే స్త్రీ జనాభా ఆధారంగా లింగ నిష్పత్తిని లెక్కిస్తారు.

11. **మనదేశంలో గత దశాబ్దకాలంలో మరణాల శాతం తగ్గడానికి గల ప్రధాన కారణమేమిటి?**

జ: 1.మెరుగైన వైద్య సేవలను ప్రజలకు అందించడం వల్ల
2.వైద్య విధానంలో ఆధునిక సౌకర్యాల వినియోగం వల్ల
3.విద్య, సైన్స్, సాంకేతిక పరిజ్ఞానం పెరిగి, ప్రజల జీవన ప్రమాణం మెరుగవడం వల్ల

2 మార్కుల ప్రశ్నలు

1. **దేశ జనాభాను వయసుల వారీగా వర్గీకరించి వివరించండి.**

జ: భారతదేశ జనాభాను ప్రధానంగా మూడు వయసుల వర్గాలుగా విభజించారు. అవి...
1) పిల్లలు(సాధారణంగా 15 సంవత్సరాల లోపువారు) సంరక్షణను కుటుంబం చూసుకుంటుంది.
2) పనిచేసే వయసు(15-59 సంవత్సరాలు) సాధారణంగా సమాజంలో పనిచేసే జనాభా ఇది. వీరు పునరుత్పత్తి వయసులో కూడా ఉంటారు.
3) వృద్ధులు(59 సంవత్సరాలు పైబడిన వారు) వృద్ధాప్యంలో మద్దతు కోసం ఈ వయసు తమ కుటుంబాలపై ఆధారపడి ఉంటారు.

2. **భారతదేశ జనసాంద్రత హెచ్చు తగ్గులకు కారణమేమిటి?**

జ: 2011లో భారతదేశ జన సాంద్రత చదరపు కిలోమీటరుకి 382 వ్యక్తులు. ఈ సాంద్రతలో తేడాలు పశ్చిమబెంగాల్‌లో 904 నుంచి అరుణాచల్ ప్రదేశ్‌లో 13 వరకు ఉన్నాయి. అసోం, ద్వీపకల్ప ప్రాంత అనేక రాష్ట్రాల్లో జనసాంద్రత ఒక మాదిరిగా ఉంది. భూభాగం కొండలు, రాళ్లతో ఉండటం, ఒక మోస్తరు సారం నేలలు ఈ ప్రాంతంలోని జనసాంద్రతను ప్రభావితం చేశాయి. ఉత్తర మైదానాలు, కేరళలో చదునైన మైదానాలు, సారవంతమైన నేలలు, అధిక వర్షపాతం ఫలితంగా అధిక నుంచి చాలా అధిక జనసాంద్రత ఉంది.

3. **కింది పేరాగ్రాఫ్‌ను చదివి ప్రశ్నకు సమాధానం ఇవ్వండి.**

జ: 'ఆడపిల్ల కంటే మగపిల్లవాడు పుట్టాలని కోరుకునే వారు ఎక్కువ అవుతున్నారు. ఫలితంగా 'లింగ వివక్ష భారతదేశంలో ఇప్పట్లో పోయే సూచనలు కనిపించడం లేదు. మగపిల్లలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు దాంతో మగపిల్లల్లో కంటే ఆడపిల్లల్లో మరణాల శాతం ఎక్కువగా ఉంది. అనేక కుటుంబాలు ఆడపిల్లలను భారంగా భావిస్తాయి. మహిళల పట్ల ఈ వివక్షను తగ్గించడానికి బలమైన శక్తిగా మహిళల చదువు ఉపయోగపడుతుంది".



కె.తులసిలక్ష్మి
సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు

ప్రశ్న: లింగ నిష్పత్తిలోని తేడాల కారణంగా సమాజంపై పడే ప్రభావాలను పేర్కొనండి?

జ: 1) ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుంది
2) మగ పిల్లలందరికీ వివాహాలు జరిగే అవకాశాలు భవిష్యత్తులో తగ్గుతాయి.
3) కుటుంబ వ్యవస్థ దెబ్బతింటుంది
4) లింగ వివక్ష సమాజంలో పెరుగుతోంది
5) సమాజంలో నేర స్వభావం పెరిగిపోతుంది.


4 మార్కుల ప్రశ్నలు

1. **భారతదేశ జనగణన గూర్చి వివరింపుము?**

జ: భారత దేశంలోని జనాభాకి సంబంధించిన సమాచారాన్ని 'సెన్సస్ ఆఫ్ ఇండియా' అందిస్తుంది. జనాభా అంతటికి సంబంధించిన సమాచారాన్ని పద్ధతి ప్రకారం సేకరించి, నమోదు చేయడాన్నే జనగణన అంటారు. పదేళ్లకు ఒకసారి భారతదేశంలోని ప్రజల సమాచారాన్ని సేకరిస్తారు. ఈ పని చేసే వాళ్లు ప్రతి ఊరు, పట్టణం, నగరంలోని ప్రతి ఇంటికి వెళ్లి అందులో ఉంటున్న వాళ్ల వివరాలు సేకరిస్తారు. ప్రజల వయసు, వృత్తి, ఇంటిరకం, చదువు, మతం వంటి అనేక వివరాలను జనగణన అందిస్తుంది. 'సెన్సస్ ఆఫ్ ఇండియా' అనే కేంద్ర ప్రభుత్వం సంస్థ ఈ సమాచార సేకరణ, నమోదులను నిర్వహిస్తుంది.

భారతదేశంలో జనగణన: భారతదేశంలో మొదటి జనగణన 1872లో జరిగింది. అయితే మొదటి సంపూర్ణ జనగణన 1881లో జరిగింది. అప్పటి నుంచి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి క్రమం తప్పకుండా జనగణనను చేపడుతున్నారు. 2011లో భారతదేశ జనాభా 1, 21, 01,93,422. ఈ 121 కోట్ల జనాభాలో 62,37,24,248 మంది పురుషులు, 58,64,69,174 మంది స్త్రీలు ఉన్నారు.

2. **కింది గ్రాఫ్ ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి.**



ప్రశ్నలు

1) లింగ నిష్పత్తిలో 1951 నుంచి నీవు ఎలాంటి మార్పులు గమనించావు?
2) ఏ సంవత్సరంలో స్త్రీల సంఖ్య తక్కువగా ఉంది?
3) స్త్రీల సంఖ్య తగ్గడాన్ని నివారించడానికి ఏమి చేయాలి?
4) స్త్రీ, పురుష నిష్పత్తి అంటే ఏమిటి?

జవాబులు:

1) 1951 నుంచి 1971 వరకు స్త్రీ, పురుష నిష్పత్తి తగ్గుతూ వచ్చి, 1991 నుంచి క్రమేపీ పెరుగుతూ వచ్చింది.
2) 1991 సంవత్సరంలో స్త్రీల సంఖ్య తక్కువగా ఉంది.
3) ప్రకృతిలో స్త్రీ, పురుషులు సమానమే అనే భావనను ప్రచారం చేయాలి
4) జనాభాలో ప్రతి 1000 మంది పురుషులకు ఎంతమంది స్త్రీలు ఉన్నారో తెలియజేసే నిష్పత్తి స్త్రీ పురుష నిష్పత్తి.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 3, 7, 4

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిట్‌ఫండ్లు, డిపాజిట్లపై ప్రతిఫలం అందుకుంటారు. ప్రముఖులతో వేడుకల్లో పాల్గొంటారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ఆర్థిక విషయాల్లో సంకల్పం నెరవేరుతుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): మార్పు కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. బదిలీల విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యం సాధిస్తారు. బంధుమిత్రుల కలయికతో ఇంట్లో సందడిగా ఉంటుంది. ఇంటికి అవసరమైన వస్తువుల రవాణాకు అనుకూలం.

మిథునరాశి: (మే21-జూన్21): చెక్కులు, విలువైన డాక్యుమెంట్లు అందుకుంటారు. స్టేషనరీ, రవాణా, బోధన, ఏజెన్సీ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ప్రియతముల కోసం విలువైన వస్తువుల కొనుగోలు చేస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. భాగస్వాముల లాభిస్తాయి. స్నేహ పరిచయాల ఆధారంగా ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. కొత్త ప్రాజెక్టుల ప్రారంభానికి అనుకూల సమయం. విందు, వినోదాలతో ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగ సంస్థలు, పరిశ్రమలు, వైద్య రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): దూరంలో ఉన్న ప్రియతములు ఇల్లు చేరతారు. ప్రయాణాలు, చర్చలు, వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి. సినీ, రాజకీయ, న్యాయ రంగాల వారికి ఆర్థికంగా అనుకూలిస్తుంది. ప్రియతములకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. బంధు, మిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ప్రదర్శనలు, సభలకు అనుకూలం. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల వైఖరి గురించి ఆలోచిస్తారు.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఉద్యోగ, వ్యాపారాలకు సంబంధించిన శుభవార్త అందుకుంటారు. సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. పెద్దలతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. వృత్తి, ఉద్యోగాలకు సంబంధించిన కీలక సమాచారం లభిస్తుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ప్రయాణాలకు అవసరమైన నిధులు సమకూర్చుకుంటారు. సంకల్పం ఫలిస్తుంది. వేడుకల్లో పాల్గొంటారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. పెట్టుబడులకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): బీమా వ్యవహారాలకు అనుకూలం. ఆర్థిక వ్యవహారాలపై స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. ఆత్మావలోకనం చేసుకునేందుకు తగిన సమయం. పూర్వమిత్రులను కలుసుకుంటారు. మ్యూచువల్ ఫండ్స్, బ్యాంకు లావాదేవీలు లాభిస్తాయి.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): సినీ, రాజకీయ రంగాల వారికి కొత్త పరిచయాలు లాభిస్తాయి. భాగస్వామి గురించి ఆలోచిస్తారు. లక్ష్య సాధనకు పరిచయాలు తోడ్పడతాయి. సమావేశాలు, బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. దూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులతో అనుబంధం ఏర్పడుతుంది.

మీనరాశి: (ఫిబ్రవరి19-మార్చి20): ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వైద్యం, హోటల్, రిటైల్ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఆహార నియమాలు పాటిస్తారు. బంధుమిత్రులతో విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆస్పత్రులు సందర్శిస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

సిటీ డైరీ 2018

ప్రారంభం
విషయం: కేనన్ డ్రీమ్ ల్యాబ్ ప్రారంభం
సమయం: ఉదయం 8.30 గంటలకు
వేదిక: శాంతి, ప్రశాంతి వద్ద, గాంధీనగర్

జన్మభూమి-మా ఊరు
విషయం: జన్మభూమి - మా ఊరు
సమయం: ఉదయం 9 గంటలకు
వేదిక: 52వ డివిజన్ కేర్ అండ్ షేర్‌త, న్యూ ఆర్ఆర్‌పేట
సమయం: ఉదయం 9 గంటలకు
వేదిక: 11వ డివిజన్ తోటవారి వీధి, కమ్యూనిటీ హాల్
సమయం: ఉదయం 10 గంటలకు
వేదిక: 29వ డివిజన్ లేబర్ కాలనీ జీఎస్ఆర్ హైస్కూల్
సమయం: ఉదయం 11 గంటలకు
వేదిక: 16వ డివిజన్ సిమెంట్ గోడౌన్, రాణిగారితోట
సమయం: ఉదయం 11 గంటలకు
వేదిక: 54వ డివిజన్ సింగ్‌నగర్, ఎంబిపి స్టేడియం
సమయం: మధ్యాహ్నం 12 గంటలకు
వేదిక: 39వ డివిజన్ గాంధీజీ మున్సిపల్ హైస్కూల్, వన్‌టౌన్
సమయం: సాయంత్రం 4 గంటలకు
వేదిక: ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కాలేజీ, 5వ డివిజన్

సమావేశం
విషయం: దళిత బహుజన రీసెర్చ్ సెంటర్ సమావేశం
సమయం: మధ్యాహ్నం 2 గంటలకు
వేదిక: ప్రెస్‌క్లబ్

సమావేశం
విషయం:ప్రజా నాట్య మండలి సమావేశం
సమయం: ఉదయం 10 గంటలకు
వేదిక: ప్రెస్‌క్లబ్

ప్రారంభం
విషయం: ఫుడ్‌ప్రాసెసింగ్ ఎగ్జిబిషన్ ప్రారంభం
సమయం: ఉదయం 10 గంటలకు
వేదిక: శేషసాయి కళ్యాణ మండపం

పాదయాత్ర
విషయం: పుస్తక ప్రియుల పాదయాత్ర
సమయం: సాయంత్రం 4 గంటలకు
వేదిక: ప్రెస్‌క్లబ్ నుంచి

సమావేశం
విషయం: నివేదిత సంక్షేమ సంఘం సమావేశం
సమయం: సాయంత్రం 6 గంటలకు
వేదిక: ప్రెస్‌క్లబ్

మెప్మా ఆధ్వర్యంలో నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి

కానూరు (పెనమలూరు రూరల్), జనవరి 3: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), వీఏంసీ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు కార్పొరేషన్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.వి.వి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అశోక్‌నగర్‌లోని రూట్స్ హెల్త్ ఫౌండేషన్ సహకారంతో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కంప్యూటర్, అకౌంట్స్ అసిస్టెంట్ ట్యాలీ, వైద్యరంగంలో నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి పాస్ అయిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు 9849545117, 9490113583 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. అభ్యర్థుల ఎంపిక పూర్తయిన అనంతరం శిక్షణ తేదీని ప్రకటిస్తామన్నారు.


సదస్సు ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు

5, 6 తేదీల్లో కేబీఎన్‌లో జీఎస్‌టీపై అంతర్జాతీయ సదస్సు

వన్‌టౌన్, జనవరి 3: కొత్తపేటలోని కాకరపర్తి భావనారాయణ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీల్లో 'జీఎస్‌టీ ప్రాక్టీస్ ఏ క్రాస్ కంట్రీ ఎక్స్‌పీరియన్స్' అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పల సాంబశివరావు, ఎస్.రజిత్ కుమార్‌లు చెప్పారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్య ప్రజల్లోనూ, వ్యాపారుల్లోనూ, జీఎస్‌టీకి సంబంధించి అనేక గందరగోళ పరిస్థితులు నెలకొని ఉన్నాయన్నారు. దీనిపై మరింత లోతైన చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. ఆ క్రమంలో తమ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఈ నెల 5, 6 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తుందన్నారు. ఈ సదస్సుకు కెన్యాకు చెందిన డేస్టార్ విశ్వవిద్యాలయం హ్యూమన్ వాల్యూస్ విభాగ డీన్ వంగరోకనడీ, ఇతర ముఖ్యులు హాజరవుతారని వారు వివరించారు. అనంతరం సదస్సు ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, అకడమిక్ డైరెక్టర్ జే.పాండురంగారావు, విభాగాధిపతి డాక్టర్ బెజవాడ రామయ్య పాల్గొన్నారు.

పీఏసీఎల్ ఖాతాదారులకు ఊరట

గవర్నర్‌పేట, జనవరి 3: పీఏసీఎల్ ఖాతాదారులకు చెల్లింపు విషయమై సెబీ సానుకూలంగా స్పందించినందున ఖాతాదారులు వారి పూర్తి వివరాలను సెబీ తెలియజేసిన వెబ్‌సైట్‌లో ఫిబ్రవరి 28లోగా నమోదు చేసుకోవాలని పీఏసీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ మురళీబాబు, జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా కంపెనీ నుంచి పూర్తిగా రావలసిన రూ. 2,500 లోపు మొత్తం ఉన్న ఖాతాదారులు వారి వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపర్చాలన్నారు. ఏదైనా సందేహాలు ఉన్నట్లయితే దగ్గరలో ఉన్న పీఏసీఎల్ ఇన్వెస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను లేదా 99493 56667, 93484 55567 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సినిమా గైడ్

అలంకార్	2 కంట్రీస్
అన్నపూర్ణ	హలో
అప్సర	ఎంసీఏ
శ్రీదుర్గాకళామందిర్	కొండవీటి సింహం
జయరామ్	ప్రాజెక్ట్ జడ్
కళ్యాణచక్రవర్తి	టార్జన్
కపర్థి	ఒక్కక్షణం
నవరంగ్	జ్యూమంజి
నీలిమ	2 కంట్రీస్
రాజ్	ఒక్కక్షణం/జ్యూమంజి
రామ్‌గోపాల్	ఒక్కక్షణం
రాజకుమారి	హలో
రామవేంద్ర	ఎంసీఏ
స్వర్ణప్యాలెస్	2 కంట్రీస్
శకుంతల	జ్యూమంజి
శైలజ	జ్యూమంజి
శ్రీనివాసమహల్	ఒక్కక్షణం
స్వాతి	ఎంసీఏ
సౌమ్య	ఎంసీఏ
వెంకటేశ్వరప్యాలెస్	ప్రాజెక్ట్ జడ్
వెంకటస్వర్ణ ప్యాలెస్	ఒక్కక్షణం
యువరాజ్	హలో/ఎంసీఏ
పాయకాపురం	
రవీంద్ర సినిమాస్	ఒక్కక్షణం/ ఎంసీఏ/ హలో/2 కంట్రీస్
స్వర్ణలక్ష్మి	ఒక్కక్షణం
శ్రీవెంకటేశ్వరడీలక్స్	2 కంట్రీస్
పటమట	
దుర్గామహల్	2 కంట్రీస్
రామకృష్ణ	ఖాకీ
వినాయక్	ఎంసీఏ
విజయలక్ష్మి (కానూరు)	ఎంసీఏ
పోరంకి	
బాలాజీ సినీవిల్లా	హలో
వెంకటకృష్ణ	ఎంసీఏ
శ్రీనివాస	ఒక్కక్షణం
కంకిపాడు	
శ్రీవిజయలక్ష్మి	ఎంసీఏ
శ్రీచంద్ర	ఒక్కక్షణం
శ్రీరామచంద్ర	2 కంట్రీస్
గన్నవరం	
శాంతి	హలో
శ్రీవెంకటేశ్వర	ఎంసీఏ
ఇబ్రహీంపట్నం	
బాలాజీ	ఎంసీఏ
శ్రీ స్వర్ణ సినీమ్యాక్స్	హలో
శివకృష్ణ(కొండపల్లి)	ఒక్కక్షణం

ఊర్వశి ఐనాక్స్: 2 కంట్రీస్, ఒక్కక్షణం, హలో, ఎంసీఏ **మిరాజ్ సినిమాస్:** 2 కంట్రీస్, ఒక్కక్షణం, హలో, ఎంసీఏ, జ్యూమంజి, **పై స్క్రీన్స్:** 2 కంట్రీస్, ఒక్కక్షణం, హలో, ఎంసీఏ **పీవీఆర్ సినిమాస్:** 2 కంట్రీస్, ఒక్కక్షణం, హలో, ఎంసీఏ, టైగర్ జిందాహై, జ్యూమంజి **క్యాపిటల్ సినిమాస్:** 2 కంట్రీస్, ఒక్కక్షణం, హలో, ఎంసీఏ, జ్యూమంజి, మళ్లీ రావా, టైగర్ జిందాహై, ఖోఖో, ది గ్రేటెస్ట్ షోమాన్, **ఎల్ఈపీఎల్ ఐనాక్స్:** 2 కంట్రీస్, ఒక్కక్షణం, హలో, ఎంసీఏ, జ్యూమంజి, టైగర్ జిందాహై

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూపాయల్లో)		వెన్‌కాబ్ (రూపాయల్లో)	
బ్రాయిలర్ బర్డ్	89, 96, 106	ఫారం ధర	86
చికెన్ విత్ స్కిన్	172	రిటైల్ ధర	108
చికెన్ స్కిన్‌లెస్	182	చికెన్ విత్ స్కిన్	157
		చికెన్‌స్కిన్‌లెస్	178

నెక్ కోడిగుడ్ల ధర

విజయవాడ జోన్ రైతు ధర
రూ. 3.85

బులియన్

బిస్కెట్ (100 గ్రా)	రూ.3,05,000
బిస్కెట్ బంగారం	
22 క్యారెట్లు (10గ్రా)	రూ.28,300
వెండి (కిలో)	రూ.40,200
వెండి (10 గ్రా)	రూ.402



శుభాకాంక్షలు

గన్నవరం విమానాశ్రయంలో బుధవారం ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ రాష్ట్ర యువ నాయకుడు దేవినేని అవినాష్, పక్కన జిల్లా అధ్యక్షుడు దేవినేని చంద్రశేఖర్ -గుణదల

ఎయిర్‌పోర్టులో క్యాంటీన్ ప్రారంభం

ఎయిర్‌పోర్టు (గన్నవరం) జనవరి 3: గన్నవరం ఎయిర్ పోర్టుకు అంతర్జాతీయ హోదా లభించినపుడు క్యాంటీన్ల అవసరత ఉంటుందని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జి.మధుసూదనరావు అన్నారు. బుధవారం ఎయిర్ పోర్టులో అత్యాధునీకరించిన స్టాఫ్ క్యాంటీన్‌ను ఏపీడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీఎం ప్రభాకరన్, యూనియన్ నాయకులు మోహన్ ప్రసాద్, కెవిఎన్ రాజు పాల్గొన్నారు.


క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఏపీడీ మధుసూదనరావు


బంగారు, వెండి పతకాలు సాధించిన క్రీడాజట్లకు నగదు బహుమతి అందిస్తున్న శాప్ వీసీ ఎండీ బంగార్రాజు

బాల్‌బ్యాడ్మింటన్‌కు పూర్వ వైభవం తీసుకు రావాలి

- బంగారు, వెండి పతకాలు సాధించిన రాష్ట్ర బాలుర, బాలికల జట్లు
- శాప్ వీసీ అండ్ ఎండీ బంగార్రాజు

విజయవాడ స్పోర్ట్స్, జనవరి 3: రానున్న రోజుల్లో బాల్‌బ్యాడ్మింటన్ క్రీడకు పూర్వ వైభవం తీసుకు రావాలని శాప్ వీసీ అండ్ ఎండీ బంగార్రాజు ఆకాక్షించారు. సబ్‌జూనియర్ బాల్ బ్యాడ్మింటన్‌లో పతకాలు సాధించిన ఆంధ్రప్రదేశ్ క్రీడా జట్లను బంగార్రాజు అభినందించారు. డిసెంబర్ 26 నుంచి 30 వరకు భువనేశ్వర్‌లో జరిగిన 37వ సబ్ జూనియర్ జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర బాలుర జట్టు బంగారు పతకాన్ని, బాలికల జట్టు వెండి పతకాన్ని కైవసం చేసుకున్నారు. స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో శాప్ వీసీ అండ్ ఎండీ బంగార్రాజు క్రీడాకారులను శాలువాలతో సత్కరించి, బాలుర జట్టుకు లక్ష రూపాయలు, బాలికల జట్టుకు రూ.50,000 అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలకు శాప్ నుంచి ఎప్పుడు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ ఓఎస్‌డీ పి.రామకృష్ణ, రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ సంఘ కార్యదర్శి ఆర్. వెంకట్రావు పాల్గొన్నారు.

హాస్యనటులే తెలుగుచిత్రసీమకు పట్టుకొమ్మలు

హాస్యనటుడు కిషోర్‌దాస్


మాట్లాడుతున్న హాస్యనటుడు కిషోర్‌దాస్, పక్కన పుట్టగుంట సతీష్‌కుమార్

హనుమాన్‌జంక్షన్, జనవరి 3: తెలుగు చిత్రపరిశ్రమకు హాస్యనటులే పట్టుకొమ్మలని సినీ హాస్యనటుడు కిషోర్‌దాస్ అన్నారు. బుధవారం ఉదయం హనుమాన్‌జంక్షన్‌లోని పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ కార్యాలయానికి వచ్చిన కిషోర్‌దాస్ విలేకరులతో మాట్లాడారు. నేటితరం చిత్రాల్లో హాస్యరస ప్రధానమైన చిత్రాలకే ప్రజల నుంచి ఎక్కువ ఆదరణ లభిస్తోందన్నారు. ప్రజల జీవన విధానం గణనీయంగా మారిపోయిందని, కాస్త ఆనందం పొందేలా ఉండే సినిమాలనే ప్రజలు చూస్తున్నారన్నారు. తెలుగు చిత్ర రంగంలో హాస్యనటులకు కొదువలేదని, ఎవరికి వారే ఒకరికి మించి ఒకరు తమ నటనా కౌసల్యంతో ప్రేక్షకులను మెప్పిస్తున్నారని ఆయన తెలిపారు.

సుజాత శర్మకు జోషి శుభాకాంక్షలు

విజయవాడ, జనవరి 3: ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ వెలగా జోషి బుధవారం కాలేజియేట్ ఎడ్యుకేషన్ స్పెషల్ కమిషనర్ సుజాత శర్మను కలిశారు. కొత్త సంవత్సరం శుభాకాంక్షలను తెలియచేయడంతో పాటు ఆయన కాలేజీ అభివృద్ధికి సంబంధించిన వివరాలతో ఒక నివేదికను ఆమెకు అందచేశారు. ప్రభుత్వ కాలేజీ ప్రతిష్ఠను ఇనుమడింప చేసేందుకు చేస్తున్న కృషికి జోషిని ఆమె అభినందించారు.


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ విజేతలు

మైలవరం, జనవరి 3: మూడవ రాష్ట్రస్థాయి సీనియర్ (బాలున) అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ పోటీలు రెండో రోజు బుధవారం స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన పోటీల్లో విజేతలను ప్రకటించారు. తూర్పు గోదావరి జిల్లాపై కడప జట్టు ఒక గోల్‌తో విజయం సాధించగా, నెల్లూరు, పశ్చిమ గోదావరి మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ప్రకాశంపై కృష్ణా ఒక గోల్‌తో, కర్నూలుపై చిత్తూరు రెండు గోల్స్‌తో, గుంటూరుపై తూర్పు గోదావరి రెండు గోల్స్‌తో, తూర్పు గోదావరిపై నెల్లూరు ఒక గోల్‌తో గెలుపొందినట్లు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి సతీష్‌కుమార్ తెలిపారు.

ముఖ్య అతిథులుగా లకిరెడ్డి బాలిరెడ్డి, ఫుట్‌బాల్ సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జగన్నాథరెడ్డి, మలిరెడ్డి శ్రీనివాసులు, తదితరులున్నారు.



స్వామివారికి అభిషేకం..



కల్యాణానికి హాజరైన భక్తులు



స్వామివారికి పట్టు వస్త్రాలు

సప్తగిరీశునికి సహస్ర కలశార్చన

విజయవాడ కల్చరల్, జనవరి 3 : పటమట హైస్కూల్ రోడ్డులో శ్రీలక్ష్మీ శ్రీనివాస వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేంకటేశ్వర స్వామి నిత్యోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామిని హనుమంతుడి వాహనంపై ఊరేగించారు. భోగ శ్రీనివాసమూర్తితో పాటు శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్పస్వామికి సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. తొలుత వస్త్రం, యజ్ఞోపవీతంతో అలంకరించి స్వామి వారిని స్నానసదం మీద ఉంచి పసుపు, గంధం, కంకుమ, వాటికి ముందు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారికి, సుప్రభాత సేవ, విశ్వరూప దర్శనం, తోమాల సేవ, కొలువు, సహస్రనామార్చన, మొదటి గంటానివేదన, తొమ్మిది గంటలకు కలశాభిషేకం కన్నుల పండువగా జరిగాయి. అనంతరం శ్రీవారి కల్యాణం యథావిధిగా జరిగింది. హనుమంతుని వాహనంపై రాత్రి స్వామివారిని భక్తులకు దర్శించుకున్నారు.

వేద, నాదాల మధ్య ఊంజల్‌సేవ..

అర్చకుల వేదమంత్రాలు, కళాకారుల కోలాటం, గాయకుల సంకీర్తన మధుర గానం, మంగళ వాద్యాల నడుమ శ్రీదేవి భూదేవి సమేతుడైన స్వామికి ఊంజల్‌సేవ నిర్వహించారు. వేయిదీపాలు వెలిగించి కైంకర్యాలు అర్పించారు. త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార్ రామానుజ జీయర్ స్వామి, ఆధ్యాత్మికవేత్త బాచుపల్లి సంతోష్‌కుమార్‌శర్మ భక్తులనుద్దేశించి ప్రసంగించారు. నగరానికి చెందిన కళాకారులు స్వామివారి నృత్యార్చన చేశారు. ఈ కార్యక్రమంలో గరిమెళ్ల నాని, దూపగుంట్ల శ్రీనివాస్, గొల్ల శ్రీధర్, ఉదయగిరి, మానేపల్లి లక్ష్మీకుమారి, మామిడి కృష్ణారావు దంపతులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు నూరు శాతం వేయించాలి

విజయవాడ, జనవరి 3 : జిల్లాలో నూరు శాతం వ్యాధి నిరోధక టీకాలు అందించే విధంగా జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో స్పెషల్ ఇమ్యూనైజేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని కలెక్టరు బి.లక్ష్మీకాంతం తెలిపారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం రాత్రి ఆరోగ్య కుటుంబ సంక్షమ శాఖ అధికారులతో స్పెషల్ ఇమ్యూనైజేషన్ డ్రైవ్ నిర్వహణ ఏర్పాట్లను కలెక్టరు సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడు సంవత్సరాల లోపు పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా వేసేలా చూడాలని సూచించారు. జనవరి 8, 11, 12, ఫిబ్రవరి 15, 16, 19, మార్చి 26, 27, 29 తేదీల్లో ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. జిల్లాలో గతంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించని పిల్లలను గుర్తించి టీకాలు వేయాలన్నారు. మురికి వాడల్లో పిల్లలపై, సంచార జాతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లా వైద్య శాఖాధికారి పద్మజరాణి, డిఈవో రాజ్యలక్ష్మి, డిఐవో డాక్టర్ అమృతం, ఎస్ఎంవో డాక్టర్ మిషాహని, డాక్టర్స్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు
నియోజకవర్గం

పెనమలూరు - కంకిపాడు - ఉయ్యూరు

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత



ఉయ్యూరు, జనవరి 3: సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బాధితులకు ఎమ్మెల్సీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్ బుధవారం అందజేశారు. 24 మందికి రూ.17.44 లక్షలు అందించారు. టీడీపీ మం డల అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు, దాసు శ్రీనివాసరావు, ప్రవీణ్, రమణ పాల్గొన్నారు.

సంక్షిప్తం

పెన్షనర్ల సమావేశం 6న

ఉయ్యూరు, జనవరి 3: ఏజీ అండ్ ఎస్‌జీఎస్ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ నెల 6న మధ్యాహ్నం 2 గంటలకు పట్టణ సబ్‌ట్రెజరీ కార్యాలయ పరిధిలోని పెన్షనర్ల సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ యూనిట్ అధ్యక్షుడు బి.గిరిరెడ్డి తెలిపారు. బయోమెట్రిక్ విధానం, ఇన్‌కమ్‌ట్యాక్స్ గురించి సవివరంగా ఈ సమావేశంలో తెలియజేయనున్నట్లు చెప్పారు.

బీజేపీ అధ్యక్షుడు రాంబాబు మృతి

పెనమలూరు, జనవరి 3: యనమలకుదురు బీజేపీ అధ్యక్షుడు బట్టు రాంబాబు మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు.



గత కొన్నేళ్లుగా ఆయన బీజేపీ గ్రామ అధ్యక్షుడిగా పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. రాంబాబు మృతదేహాన్ని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిరుమామిళ్ల రాజా, నియోజకవర్గ నాయకులు నల్లాది సత్యనారాయణ, మండల అధ్యక్షుడు మరీదు రమేష్, ప్రదీప్, జగన్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కోడిపందేల స్థలాల పరిశీలన

ఉయ్యూరు, జనవరి 3: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు వేసే స్థలాలను అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. కోడి పందేలు వేయకుండా చర్యలు తీసుకోవాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత సంవత్సరం పందేలు వేసిన ప్రదేశాలను అధికారుల బృందం పరిశీలించి హెచ్చరికలు చేసింది. తహసీల్దార్ రోహిణీదేవి, ఎస్సైలు రాంబాబు, రామారావు, ఎంపీడీవో ఝాన్సీరాణి, పశువైద్యాధికారి కిరణ్‌చంద్ ఉన్నారు.

కార్లు అద్దాలు పగలగొట్టిన వ్యక్తిపై కేసు

యనమలకుదురు (పెనమలూరు), జనవరి 3: యనమలకుదురు జన్మభూమి వంతెనపై కార్ల అద్దాలు పగలకొట్టిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం యనమలకుదురుకు చెందిన చింతా వెంకట సుబ్బారావు జనవరి ఒకటో తేదీన తన కారులో వంతెనపై ప్రయాణిస్తుండగా పూటుగా మద్యం తాగిన అలిమ్ అద్దాలు పగలకొట్టాడు. అలాగే వంతెనపై నిలిపిన మరో కారు అద్దాలు పగలకొట్టాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.







పోరంకి జన్మభూమి సభలో మాట్లాడుతున్న ఎంపీ కొనకళ్ల నారాయణ, చినఓగిరాలలో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, గృహ నిర్మాణ మంజూరు పత్రాలు అందిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు ప్రసాద్

ప్రజలకు జవాబుదారీగా ఉండాలని..

పోరంకి (పెనమలూరు), జనవరి 3: ప్రజా సమస్యలను ప్రజల సమక్షంలోనే పరిష్కరించి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మభూమి గ్రామ సభలు నిర్వహిస్తున్నారని మచిలీపట్నం ఎంపీ కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు. పోరంకిలో సర్పంచ్ వి.స్వరూపరాణి అధ్యక్షతన బుధవారం జన్మభూమి - మా ఊరు గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆరు నెలలకోసారి ప్రతి గ్రామానికి అధికారులను రప్పించి అక్కడికక్కడే ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రోజుకు 18 గంటలు పని చేస్తున్నారని ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీడీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో రాజీ లేకుండా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. చంద్రన్న బీమా, సీఎం సహాయ నిధి, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీతో ఎన్నో కుటుంబాలకు ఆసరాగా నిలిచినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలు అమలు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు మాట్లాడుతూ ప్రజా సహకారంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. కలెక్టర్ బి.లక్ష్మీకాంతం మాట్లాడుతూ ముఖ్యమంత్రి కల సాకారం కావాలంటే ప్రజల సహకారం పూర్తిగా అవసరమన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ రామాంజనేయులు, ఎంపీపీ బొర్రా కనకదుర్గ, వైస్ ఎంపీపీ కోయా ఆనంద్‌ప్రసాద్, టీడీపీ నాయకులు పంచుమర్తి అనురాధ, వెలగపూడి శంకరబాబు, గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు, తహసీల్దార్ వి.మురళీకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీవో రామచంద్రరావు, స్పెషల్ ఆఫీసర్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి - మా ఊరు గ్రామ సభలు: ఎంపీ కొనకళ్ల

సమస్యల పరిష్కారమే లక్ష్యం

చినఓగిరాల (ఉయ్యూరు), జనవరి 3: అధికారులను గ్రామాలకు తీసుకువచ్చి ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నదే జన్మభూమి ఉద్దేశమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. చినఓగిరాల పంచాయతీ కార్యాలయం వద్ద జన్మభూమి - మా ఊరు గ్రామసభ బుధవారం జరిగింది. ఎమ్మెల్యే ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించారు. పట్టిసీమ ద్వారా సాగునీరు రాకపోతే పంటలు పండేవికావన్నారు. రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కష్టపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు అండగా నిలవాలన్నారు. పంచాయతీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి గ్రామస్థుడు పాలడుగు సాంబశివరావు రూ.1.5 లక్షలు విరాళం ప్రకటించగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎంపీపీ గంగారత్నం, జడ్పీటీసీ మోహనరాజు, ప్రత్యేకాధికారి అచ్యుత కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు శివజ్యోతి, ఎంపీడీవో ఝాన్సీరాణి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కృతనిశ్చయంతో పరిష్కారం

కంకిపాడు, జనవరి 3: జన్మభూమి - మాఊరు కార్యక్రమంతో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని జడ్పీటీసీ సభ్యుడు జి.శివరామకృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని మంతెన, ఉప్పలూరులో బుధవారం జన్మభూమి గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ మంజూరు చేసిన పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామ సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు

ఉయ్యూరు, జనవరి 3: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఐక్యవేదిక డివిజన్ అధ్యక్షుడు జి.శివరామకృష్ణ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం, కోర్కెల ఆమోదం కోరుతూ బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కార్మికులు నిరసన ప్రదర్శన చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇచ్చి, పీస్ రేటు రద్దు చేయకపోతే ఈ నెల 27 నుంచి సమ్మెకు దిగుతామని యాజమాన్యానికి నోటీసు అందించినట్లు చెప్పారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం అందించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డివిజన్ సెక్రటరీ ఎం.సుబ్బారావు, కార్మికులు పాల్గొన్నారు.



ఆయా విభాగాల్లో విజేతలుగా నిలిచిన నారాయణ విద్యార్థులు

క్రీడల్లో నారాయణ ఒలింపియాడ్ విద్యార్థుల ప్రతిభ

కానూరు (పెనమలూరు రూరల్), జనవరి 3: జిల్లా సెకండరీ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 2, 3 తేదీల్లో నిర్వ హించిన విజయవాడ రూరల్ సబ్‌జోన్ స్పోర్ట్స్ మీట్‌లో కానూరు నారాయణ ఒలింపియాడ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ మధుసూదనరెడ్డి తెలిపారు. అండర్ - 14 బాలుర విభాగంలో జరిగిన వాలీబాల్, త్రోబాల్, షటిల్, బ్యాడ్మింటన్, చెస్, ఖోఖో పోటీల్లో ప్రథమ, అండర్ - 17 బాలికల విభాగంలో త్రోబాల్, షటిల్, బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

259 జీవోను పరిగణలోకి తీసుకోవాలి



మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రవీణ్

ఉయ్యూరు, జనవరి 3: జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న గ్రామకంఠం, బీ ఫారం పట్టాల వారికి నష్ట పరిహారం చెల్లించే విషయంలో ప్రభుత్వం జారీ చేసిన 259 జీవోను కేంద్రం పరిగణలోకి తీసుకోవాలని టీడీపీ నాయకుడు కొండా ప్రవీణ్ అన్నారు. విజయవాడ - మచిలీపట్నం మధ్య జాతీయ రహదారి విస్తరణలో గండిగుంట పరిధి ఆనందపురంలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న గ్రామకంఠం, బీ ఫారం పట్టాల వారికి ఈజీవో పరిగణలోకి తీసుకునేలా కృషి చేయాలని కోరుతూ రాష్ట్ర ఐటీ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారాలోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

వణుకూరు జడ్పీ హైస్కూల్‌లో కళావేదిక ప్రారంభం



కళావేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వణుకూరు (పెనమలూరు), జనవరి 3: వణుకూరు జడ్పీ హైస్కూల్‌లో మాజేటి బాలసుబ్రహ్మణ్యం, శేషమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు, దాత రఘురామారావు నిర్మించిన కళావేదికను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో గ్రామాలు అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. సర్పంచ్ కోటా జేజిబాబు, ఎంపీపీ బొర్రా కనకదుర్గ, వైస్ ఎంపీపీ కోయా ఆనంద్ ప్రసాద్, ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసరనేని మురళీ, దాత మాజేటి రఘురామారావు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు నివాళి

యనమలకుదురు (పెనమలూరు రూరల్): భారతీయ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు యనమలకుదురు జడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన సైన్స్ ఉపాధ్యాయురాలు ఎస్.తులసీదేవిని సత్కరించారు. పీఆర్టీయూ సేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ డి.శ్రీను మాట్లాడారు. పీఆర్టీయూ కార్య దర్శి కె.వి.వి.స్వామి, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరి గ(డ్డి)డ్డు కాలం

- ఎకరం రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు
- పశు పోషణకు అవస్థలు పడుతున్న పశు పోషకులు

కంకిపాడు: వరి కోతలకు యంత్రాలను వినియోగించడంతో వరి గడ్డికి గడ్డు కాలం దాపురించింది. పశువుల మేతకు రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. వరి కోత యంత్రాలతో మాసూళ్ల చేసిన వరిగడ్డి పశువుల మేతకు పనికిరాకుండా పోతుంది. దీంతో అరకొరగా లభించే గడ్డికి రూ.వేలు వెచ్చించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. వ్యవసాయ కూలీలతో కోతలు కోయించే కాలంలో వరి గడ్డికి లోటు ఉండేది కాదు. చాలా మంది రైతులు పాడి గేదెల కోసం గడ్డిని ఉచితంగా ఇచ్చే వారు. ఏటా దాళ్వా సాగులో వచ్చే గడ్డిని మేటలుగా వేసుకొని కరువు కాలంలో వాటితో పశువులను మేపేవారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరుగుతుండటంతో ప్రతిఏటా వరి గడ్డి కొరత పెరుగుతోంది. ఈ సంవత్సరం


వరిగడ్డి మోపులు కడుతున్న రైతులు

ఖరీఫ్‌లో 90 శాతంపైగా కోతలు యంత్రాలతో నిర్వహించడంతో పొలంలో కేవలం వెన్ను భాగం మాత్రమే ముక్కముక్కలుగా పడి ఉంది. దీనిని మేటలుగా వేసుకోవడం కష్టసాధ్యం. కొద్ది మంది రైతులు వ్యవసాయ కూలీలతో చేయించినా ఎకరం వరి గడ్డిని రూ.7 వేల నుంచి రూ.10 వేలకు విక్రయిస్తున్నారు. దీనికి తోడు రవాణా చార్జీలతో తడిసి మోపెడవుతోంది. కొందరు రైతులు యంత్రాలతో కోసిన గడ్డి ముక్కలనే కూలీలతో ఏరించి భద్రపరుస్తున్నారు. దీనికి కూలి ఖర్చులు ఎక్కువవుతున్నాయి. పచ్చగడ్డితో కాలం గడుపుదామనుకుంటే పొలం, చెరువు, కాల్వ గట్లపై పచ్చగడ్డి కనపడని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు పశు దాణాపై ఆధారపడుతున్నారు. దాణా ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతుండటంతో పోషణ తగ్గించుకుంటున్నారు. కొందరు రైతులు పాడి పశువులకు దూరమవుతున్నారు.

అధికమైన గడ్డి కొరత



వరి కోతలకు యంత్రాలు వినియోగించడంతో గడ్డి కొరత అధికంగా ఉంటుంది. ప్రస్తుతం పచ్చి గడ్డితో పాటు వరి గడ్డి కూడా దొరికే పరిస్థితి కనిపించటం లేదు. ఎంతో కొంత వెచ్చించి కొనుగోలు చేద్దామంటే కొనలేని పరిస్థితి. ఎవరికి తోచిన ధర వారు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వరి గడ్డి ధర రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు పలుకుతోంది. - మద్దాలి సాయిబాబు

భారమైన పశుపోషణ



పంట పొలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించేస్తున్నారు. వ్యవసాయం భారమవుతుంటే పశుపోషణ మరింత దయనీయమై పోయింది. గడ్డి దొరక్క అటు పశువులు అల్లాడుతుంటే రైతు ఆర్థికంగా నలిగిపోతున్నాడు. - బాయిన మల్లేశ్వరరావు

కూలీలుగా మారుతున్నారు



పశు పోషణ చేయలేక రైతులు కూలీలుగా మారిపోతున్నారు. పూట పని కోసం కిలోమీటర్లు ప్రయాణిస్తున్నారు. ప్రభుత్వం పశుపోషకులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే అటు వ్యవసాయం, ఇటు పశుపోషణ రెండు అంతరించిపోతాయి. - గణిపిశెట్టి శ్రీనివాసరావు


క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు

ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు క్రీడలు

కానూరు (పెనమలూరు రూరల్): విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడానికి క్రీడలు దోహదపడతాయని సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు అన్నారు. సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో సిద్ధార్థ విద్యా సంస్థల విద్యార్థులకు బుధ వారం ఆటల పోటీలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు విశ్లేషణాత్మక ఆలోచనా ధోరణిని అలవర్చుకోవాలని సూచించారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భావన్నారాయణ, వ్యాయామోపాధ్యాయుడు శౌరిరెడ్డి, ఉపాధ్యాయులు రామచంద్ర, రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల నిరోధానికి మండల కమిటీ

తోట్లవల్లూరు: కోర్టు ఆదేశాల మేరకు కోడి పందేల నిరోధానికి మండల కమిటీ ఏర్పాటు చేశామని తహసీల్దార్ జి. భద్రు తెలిపారు. మండలంలోని కుమ్మమూరులో కోడిపందేలు వేసే ప్రాంతాన్ని బుధవారం కమిటీ సందర్శించింది. భద్రు మాట్లాడుతూ తహసీల్దార్, ఎస్సై ప్రసాద్, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక ఎన్జీవో, ఒక ఫొటో గ్రాఫర్‌తో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ మండలంలో పర్యటిస్తూ కోడి పందేలు జరుగకుండా చర్యలు తీసుకుంటుందన్నారు. మండలంలో ఎక్కడైనా కోడి పందేల బరి ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రసాద్ హెచ్చరించారు.

చినఓగిరాలలో ఉచిత పశు వైద్య శిబిరం


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న యెనిగళ్ల కుటుంబరావు

చినఓగిరాల (ఉయ్యూరు), జనవరి 3: సమగ్ర పశుపోషణతో పశు సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చినఓగిరాల పీఏసీఎస్ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు అన్నారు. పశువైద్యశాల ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పాల ఉత్పత్తి తగ్గిపోయి పాల ప్యాకెట్లు కొనుగోలు చేయాల్సి రావడం దురదృష్టకరమన్నారు. సర్పంచ్ డి.చినవెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు పొలడుగు శివజ్యోతి, పాల కేంద్రం అధ్య క్షుడు ఎం.సీతారామయ్య, వల్లూరుపల్లి మురళీకృష్ణ, కామయ్య, మండలపశువైద్యాధికారి ఎ.కిరణ్‌చంద్, డాక్టర్ వీణ, వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సౌండ్‌సిస్టమ్, క్రీడా సామగ్రి అందజేత


సౌండ్ సిస్టమ్, క్రీడా పరికరాలు అందజేస్తున్న జనార్ధనరావు

గొడవర్రు (కంకిపాడు), జనవరి 3: దాతృత్వం ఓ సుగుణమని గొడవర్రు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జి.వెంకటేశ్వరరావు అన్నారు. పాఠశాల పూర్వవిద్యార్థి యలమంచిలి వెంకటరమణ తండ్రి రామచంద్రరావు జ్ఞాపకార్థం రూ.35 వేలు విలువైన సౌండ్‌సిస్టమ్, రూ.26 వేలు విలువైన క్రీడా సామగ్రిని తన స్నేహితుడు యలమంచిలి జనార్ధనరావు ద్వారా బుధవారం అందజేశారు. విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని వక్తలు సూచించారు. చంద్రశేఖరరావు, టి.వెంకటేశ్వర్లు, శరత్, సుగుణాకరరావు, సునీత పాల్గొన్నారు.

సంక్షిప్తం


ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు శివరామకృష్ణ ప్రసాద్

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

మంతెన (కంకిపాడు), జనవరి 3: ఆర్వో ప్లాంటు ఏర్పాటుతో విద్యార్థులకు రక్షిత నీరు అందుతుందని జడ్పీటీసీ సభ్యుడు జి.శివరామకృష్ణప్రసాద్ అన్నారు. దివీస్ సౌజన్యంతో మంతెన జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీరు కలుషితం వల్ల అనారోగ్యం కలుగుతుందని, పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినందుకు దివీస్ సంస్థ అభినందనీయమన్నారు. డిప్యూటీ ఈవోవో ఎం.కృష్ణమోహన్, ఎంఈవో కనక మహాలక్ష్మి, తుమ్మలపల్లి హరికృష్ణ, దివీస్ ప్రతినిధులు కొల్లివర రామ్మోహనరావు, జి.వినోద్ పాల్గొన్నారు.

అన్నసమారాధనకు రూ.30 వేల విరాళం

ఉయ్యూరు: అయ్యప్ప స్వామి భక్తుల అన్నసమారాధనకు తెలుగు యువత మండల అధ్యక్షుడు దండమూడి చౌదరి బుధవారం రూ.30 వేల విరాళం అందజేశారు. అయ్యప్ప మాల ధరించిన భక్తులకు నిత్య అన్నసమారాధన చేస్తున్న నేపథ్యంలో తన వంతుగా ఆ మొత్తాన్ని అందజేసినట్లు తెలిపారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

మంతెన (కంకిపాడు), జనవరి 3: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని తెలుగు నాడు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి బొర్రా ప్రదీప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంతెనలో బుధవారం జరిగిన జన్మభూమి గ్రామసభలో వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ విధానం వల్ల లక్షలాది కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఈ పద్ధతిని రద్దు చేయాలన్నారు.

సామూహిక సీమంతాలు

చినఓగిరాల (ఉయ్యూరు), జనవరి 3: మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. చినఓగిరాలలో బుధవారం గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. సర్పంచ్ వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యుడు మోహనరాజు పాల్గొన్నారు.

'డ్వాక్రా' బలోపేతానికి చర్యలు తీసుకోండి

వన్‌టౌన్, జనవరి 3 : డ్వాక్రా సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, 40వ డివిజన్ కార్పొరేటర్ షేక్ ఆసిఫ్ అన్నారు. వించిపేట షాహీ మసీద్ రోడ్డులోని 40వ డివిజన్ కార్పొరేటర్ షేక్ ఆసిఫ్ కార్యాలయం వద్ద బుధవారం వెంకట కనకదుర్గ పొదుపు సంఘానికి మంజూరైన బ్యాంక్ రుణం రూ.57,500 పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో యూసీడీ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్

ఎమ్మెల్యే జలీల్‌ఖాన్

వన్‌టౌన్/వించిపేట, జనవరి 3 : కొండప్రాంత వాసుల ఇళ్ల పట్టాలకు త్వరలో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తుందని ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ తెలిపారు. కొత్తపేటలోని శిల్పాశ్రమం రోడ్డులో బుధవారం 38వ డివిజన్ కార్పొరేటర్ కొణపర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన, నోడల్ అధికారి కోటేశ్వరరావు పర్యవేక్షణలో జన్మభూమి జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి చెందుతోందన్నారు.

పలు ప్రధాన రోడ్లను వేశామని, మిగిలినవి త్వరలో వేయనున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ జె.నివాస్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం డివిజన్‌లో 60 డ్వాక్రా గ్రూపులకు రూ.2.85 కోట్ల రుణాల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మరుపిళ్ల తిరుమలేష్, వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ షేక్ ఖాజా, టీడీపీ అర్బన్ అధికార ప్రతినిధి వేమూరి మల్లికార్జునరావు, ఎ.బెనర్జి పాల్గొన్నారు.


జన్మభూమిలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు


లింకేజీ రుణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, వీఎంసీ కమిషనర్ నివాస్, డిప్యూటీ మేయర్ రమణారావు

25వ డివిజన్‌లో..

25వ డివిజన్ మల్లికార్జునపేటలో వాటర్ ట్యాంకు వద్ద బుధవారం జన్మభూమి జరిగింది. ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ మాట్లాడుతూ కొండప్రాంత వాసులు పట్టాల కోసం మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గర్భిణులకు సీమంతాలు చేయించామని, 57 డ్వాక్రా గ్రూపులకు రుణమాఫీ చేశామని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. రేషన్‌కార్డులు, పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రమణ, కార్పొరేటర్ చంటి, ఈఈ కోటేశ్వరావు, డీఈ రవి, ఏఈ రవీంద్ర, నగర ఫెడరేషన్ చైర్మన్ ఏడుకొండలు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ నివాస్, వేదికపై ఎమ్మెల్యే జలీల్‌ఖాన్

సంక్షిప్తం



సుందరీకరణ పనులు ప్రారంభం

చిట్టినగర్, జనవరి 3 : కె.ఎల్. పార్కుకు కొత్త శోభ సంతరించుకోనుంది. దానిలో భాగంగా బుధవారం పార్కులో గోడలపై వివిధ రకాల బొమ్మలు వేయడానికి పెయింటింగ్ పనులు మొదలు పెట్టారు. ఈఈ కోటేశ్వరరావు పర్యవేక్షణలో పనులు ప్రారంభమయ్యాయి. తొలుత పార్కు చుట్టూ గోడలపై రెండు, మూడు విడతలుగా రంగులు వేస్తారు. అనంతరం వాటిపై వివిధ రకాల బొమ్మలతో గోడలను తీర్చిదిద్దడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ పనులన్నీ సంక్రాంతి పండుగలోపు పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు.



చంద్రన్న బీమా బాండ్లు అందజేత

వించిపేట, జనవరి 3 : అర్హులకు వించిపేటలో కార్పొరేటర్ షేక్ బీజాన్‌బీ బుధవారం చంద్రన్న బీమా బాండ్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలని తెలిపారు. డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ రవికిరణ్, సునీల్, అబ్దుల్‌గని, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



షెల్టర్ ఏదీ..!

భవానీపురం, జనవరి 3 : క్రాంబ్వే రోడ్డులోని శివాలయం సెంటర్లో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దుర్గా ఫ్లైఓవర్ నిర్మాణంతో ఏడాదిన్నర నుంచి క్రాంబ్వే రోడ్డు మీదుగా గొల్లపూడి, ఇబ్రహీంపట్నం వైపు రాకపోకలు సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండలో నిల్చుంటున్నారు. అధికారులు స్పందించి షెల్టర్ ఏర్పాటుచేయాల్సి ఉంది.

పూర్ణానందంపేటలో కాలువగట్టు శుభ్రం

బహిరంగ మలమూత్ర విసర్జనకు బ్రేక్

పూర్ణానందంపేట(పాతరాజరాజేశ్వరిపేట), జనవరి 3 : పూర్ణానందంపేట రైవస్ కాలువ గట్టుపై బహిరంగ మలమూత్ర విసర్జన చేయకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇటువస్తే ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీనిపై ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. ఎట్టకేలకు స్పందించిన అధికారులు కాలువగట్టును శుభ్రం చేసి, ఎర్రమట్టి వేయడం, ఎవరూ బహిరంగ మలమూత్ర విసర్జనకు పాల్పడకుండా సెక్యూరిటీ గార్డ్‌ను ఏర్పాటు చేశారు. తర్వాత మొక్కలు నాటి శుభ్రంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.


కాలువగట్టుపై ఎర్రమట్టి, సెక్యూరిటీ

వేగంగా స్ట్రాం వాటర్ డ్రెయిన్ పనులు


31వ డివిజన్‌లో క్రేన్‌తో రెడీమేడ్‌గా చేసిన సిమెంట్ దిమ్మెలను డ్రెయిన్‌పై అమరుస్తున్న సిబ్బంది

చిట్టినగర్ జనవరి 3 : పాతబస్తీలోని పలు డివిజన్లలో స్ట్రాం వాటర్ డ్రెయిన్ పనుల్లో వేగం పెంచారు. ఈ పనులు ఆలస్యంగా జరుగుతుండటంపై 'ఎడాపెడా తవ్వేస్తున్నారు' శీర్షికతో ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. **ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్** దీనిపై అధికారులు స్పందించారు. ముందుగానే తయారు చేసిన సిమెంట్ దిమ్మెలను తీసుకొచ్చి కొన్నిచోట్ల పనులు చేస్తున్నారు. అయితే పలుప్రాంతాల్లో కాలువ పనులు దాదాపుగా పూర్తి చేసి కొన్ని చోట్ల జాయింట్లను కలపకుండా వదిలేయడంతో మురుగు పారుదల సక్రమంగా లేదని ప్రజలు కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

క్లిక్.. పోస్ట్

Click.. Post

వన్‌టౌన్, కుమ్మరిపాలెం, విద్యాధరపురం, భవానీపురం, కబేళా, పాలప్రాజెక్టు, కొత్తపేట, చిట్టినగర్, పాతరాజరాజేశ్వరిపేట, కేదారేశ్వరపేట తదితర ప్రాంతాల్లో సమస్యలు మీ దృష్టికి వచ్చిన వెంటనే ఫొటో తీసి వాట్సాప్ ద్వారా ఆంధ్రజ్యోతికి పంపవచ్చు. మీ పేరు, ప్రాంతం తప్పనిసరిగా తెలియజేయాలి. వాట్సాప్ నెంబర్ 9700255566 -చిట్టినగర్

వేపచెట్టు తొలగింపుపై వాగ్వాదం


కేదారేశ్వరపేటలో అధికారులతో స్థానికుల వాగ్వాదం.. ఇన్‌సెట్‌లో.. కార్పొరేటర్ కార్యాలయం ఎదురుగా వేప చెట్టు

కేదారేశ్వరపేట(పాతరాజరాజేశ్వరిపేట), జనవరి 3 : కేదారేశ్వరపేట మూడో లైన్‌లో స్ట్రాం వాటర్ డ్రెయిన్ నిర్మాణంలో అడ్డు వచ్చిన వేపచెట్టును తొలగించడంతో ఉద్రిక్తత నెలకొంది. స్థానికులకు చెప్పకుండా నీడను ఇచ్చే చెట్టును నరికేశారని, స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు జేసీబీ తాళాలను కూడా తీసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. కార్పొరేటర్ కార్యాలయం ఎదురుగా కాలువ పక్కనే వేపచెట్టు ఉంది. దాన్ని వదిలేసి ఈ చెట్టును నరకడమేంటని ఈ ప్రాంతవాసులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక పెద్దల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది.

నేడు 29, 39 డివిజన్లలో జన్మభూమి

విజయవాడ : స్థానిక 29వ డివిజన్‌లోని లేబర్‌కాలనీ జీవీఎస్‌ఆర్ నగరపాలక సంస్థ హైస్కూల్లో గురువారం ఉదయం 10 నుంచి 12గంటల వరకు జన్మభూమి కార్యక్రమం జరుగుతుంది. 39వ డివిజన్‌లోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తారు. నోడల్ అధికారి కె.కోటేశ్వరరావు పర్యవేక్షణలో టీమ్ లీడర్ ఎం.రవికుమార్ స్థానిక కార్పొరేటర్ అధ్యక్షతన కార్యక్రమం జరుగుతుంది.

అందరికీ ఆదర్శం.. సావిత్రిబాయి పూలే

చిట్టినగర్ జనవరి 3 : బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కె.ఎల్.రావునగర్ సెయింట్ ఆండ్రూస్ ఎడ్యుకేషనల్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నాగోతి వెంకటేశ్వరరావు(ఎన్.వి.రావు) పలువురు బీసీ నేతలు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్వీరావు మాట్లాడుతూ దేశంలో మహిళ లందరూ విద్యను అభ్యసించిననాడే పూలే ఆశయం నెరవేరుతుందన్నారు. మొట్టమొదటిగా మహిళా పాఠశాలలను స్థాపించిన ప్రథమ భారతీయ మహిళా ఉపాధ్యాయురాలు పూలే అని కొనియాడారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నమ్మి అప్పారావు, కార్యదర్శి బాయన శేఖర్‌బాబు, బీసీ నాయకులు ముదిపాల రామకృష్ణ, కోశాధికారి అవ్వారు శ్రీనివాసరావు(బుల్బాయి) తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయ్ పూలే చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న ఎన్.వి.రావు, బీసీ నేతలు

● **వించిపేట :** టీడీపీ జిల్లా కార్యదర్శి దూది బ్రహ్మయ్య ఆధ్వర్యాన బుధవారం చల్లపల్లి బంగళా సమీపంలోని ఆయన కార్యాలయంలో పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రహ్మయ్య మాట్లాడుతూ స్త్రీ విద్య కోసం పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో వి.బాలనారాయణ, లక్ష్మాధికారి, నారాబోయిన బాబూరావు పాల్గొన్నారు.



పూలే జయంతి వేడుకల్లో టీడీపీ జిల్లా కార్యదర్శి దూది బ్రహ్మయ్య, ఇతర నేతలు

సమస్యల పరిష్కారంలో విఫలం



మాట్లాడుతున్న వెలంపల్లి శ్రీనివాసరావు, పక్కన మల్లాది విష్ణు, ఇతర నేతలు

చిట్టినగర్, జనవరి 3 : ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు వెల్లంపల్లి శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లాది విష్ణు విమర్శించారు. వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రకు మద్దతుగా పార్టీ డివిజన్ అధ్యక్షుడు కూరాకుల నాగ అధ్యక్షతన బుధవారం రాత్రి కె.ఎల్.రావునగర్ జంబులాంబగుడి ప్రాంతంలో రచ్చబండ నిర్వహించారు. తొలుత వైఎస్ విగ్రహానికి వెల్లంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ వైఎస్ హయాంలో పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవ లందించారని గుర్తు చేశారు. చంద్రబాబు పాలనలో సర్కారీ వైద్యాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. కొండ ప్రాంత వాసుల ఇళ్లకు పట్టాలకు రిజిస్ట్రేషన్ చేస్తామంటూ కాలయాపనతో ప్రజలను మోసం చేస్తున్నా రన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు వారి సమస్యలను తెలియజేశారు. కార్య క్రమంలో కార్పొరేటర్ పూర్ణమ్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి పైలా సోమినాయుడు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు దాడి అప్పారావు, మైలవరపు దుర్గారావు, రాష్ట్ర యువజన సంఘం ప్రధాన కార్యదర్శి మండేపూడి చటర్జీ పాల్గొన్నారు.

ఉద్యోగాలు పొందిన
విద్యార్థులకు అభినందన



డేవిస్ ఎలక్ట్రానిక్స్ సంస్థలో ఉద్యోగాలు పొందిన పీఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్, కమిటీ సభ్యులు

వన్‌టౌన్, జనవరి 3 : డేవిస్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పొట్టి శ్రీరాములు (పి.ఎస్.ఆర్) ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఇ విభాగం నాలుగో సంవత్సరం చదువుతున్న నొప్పల శ్రీకాంత్ గోపీచంద్, బలసాని నరేంద్ర కుమార్ రెడ్డి, చిలకపాటి చేతన్ చంద్‌కు ఉద్యోగ అవకాశం లభించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం కొత్తపేటలోని కళాశాల ప్రాంగణంలో విలేఖర్ల సమావేశం ఏర్పాటుచేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కె.వెంకటేశ్వర్లు, ట్రిపుల్ ఇ విభాగాధికారి ప్రొఫెసర్ వై.రాజేంద్రబాబు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన ఉండాలి

చిట్టినగర్ జనవరి 3 : చెత్తను తడి, పొడిగా వేరు చేయడంపై ప్రజలకు అవగాహన ఉండాలని 31వ డివిజన్ కార్పొరేటర్ నాగోతి నాగమణి అన్నారు. తడి-పొడి చెత్తను విడి విడిగా సేకరించేందుకు వీఎంసీ అందిస్తున్న రెండు బుట్టలను బుధవారం టేనర్‌పేట కొండ ప్రాంతంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత విజయ్, పలువురు పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చిట్టి పార్కు సుందరీకరణ పనుల పరిశీలన



టైల్స్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగోతి నాగమణి

చిట్టినగర్, జనవరి 3 : మరుపిళ్ల చిట్టి పార్కును రూ. 8లక్షలతో అభివృద్ధి చేశామని 31వ డివిజన్ కార్పొరేటర్ నాగోతి నాగమణి అన్నారు. పార్కులో మరుపిళ్ల చిట్టి విగ్రహం చుట్టూ టైల్స్‌తో జరుగుతున్న సుందరీకరణ పనులను బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పాతబస్తీలోని పేదల అభ్యున్నతికి మరుపిళ్ల చిట్టి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. పార్కులో చిన్న పిల్లల కోసం వివిధ ఆట పరికరాలతోపాటు, చుట్టూ అందంగా ఐరన్ వాల్ ఏర్పాటు చేసి సుందరీకరించామన్నారు. వివిధ రకాల మొక్కలు ఏర్పాటు చేసి ఆహ్లాదకర వాతావరణాన్ని ప్రజలకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు నాగోతి రామారావు, నేతలు ఆనంద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

చేపల మార్కెట్‌లో మరుగు దొడ్ల ప్రారంభం

వన్‌టౌన్, జనవరి 3 : కొత్తపేట చేపల మార్కెట్ ప్రాంగణంలో మరుగుదొడ్లను ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, మున్సిపల్ కమిషనర్ జె.నివాస్ బుధవారం ప్రారంభించారు. చేపల మార్కెట్‌లో ప్రాంగణంలో శిథిలమైన మరుగుదొడ్లను బాగు చేయించాలని కార్పొరేటర్ కె.వెంకటేశ్వరరావు ఉన్నతాధికారులను కోరారు. దీంతో సుమారు రూ.5 లక్షలతో 8 మరుగుదొడ్లను అభివృద్ధి చేశారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

హమ్మయ్య.. మూతను మార్చారు..



పూర్ణానందంపేట(పాత రాజరాజేశ్వరిపేట), జనవరి 3 : పూర్ణానందం పేట జోసఫ్ వీధిలోని యూజీడీ మ్యాన్‌హోల్ మూత పాడైంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు అవస్థలు ఎదుర్కొన్నారు. వీరి అవస్థలను వివరిస్తూ ఆంధ్రజ్యోతి వరుస కథనాలను ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు మూత మార్చారు.

పేదలకు ఇళ్లు కేటాయించండి



అజిత్‌సింగ్‌నగర్, జనవరి 3 : జన్మభూమి సభలను ముట్టుకుడిగా నిర్వహించకుండా సింగ్‌నగర్‌లో జీప్లస్‌త్రీ ఇళ్లలో ఫ్లాట్లను అర్హులకు కేటాయించాలని కోరుతూ బుధవారం సీపీఎం ధర్నా నిర్వహించింది. ఆ పార్టీ నగర నేత బి.రమణారావు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం మూడున్నరేళ్లలో ఒక్కరికి కూడా ఇళ్లు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగ్‌నగర్ యార్డురోడ్డులో నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించి జన్మభూమి సభల్లో ధ్రువీకరణ పత్రాలను పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నేతలు మూర్తి, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్య నియోజకవర్గం

గవర్నర్‌పేట - గాంధీనగర్ - సత్యనారాయణపురం -మధురానగర్
అజిత్‌సింగ్‌నగర్ - పాయకాపురం - హిమాయత్‌నగర్

పూర్తి స్థాయిలో యూజీడీ



పాయకాపురం, జనవరి 3 : డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రయినేజ్(యూజీడీ)ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చామని 55వ డివిజన్ కార్పొరేటర్ పిరియా జగదాంబ చెప్పారు. శాంతినగర్‌లో యూజీడీ పైప్‌లైన్ పూడుకుపోయింది. దీనికి ఇటీవల మరమ్మతులు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు కనెక్షన్లు తీసుకోవచ్చని తెలిపారు.

సంక్షిప్తం



పేదలకు ఇళ్లు కేటాయించండి

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 3 : జన్మభూమి సభలను మొక్కుబడిగా నిర్వహించకుండా సింగ్‌నగర్‌లో జీప్లస్‌త్రీ ఇళ్లలో ఫ్లాట్లను అర్హులకు కేటాయించాలని కోరుతూ బుధవారం సీపీఎం ధర్నా నిర్వహించింది. ఆ పార్టీ నగర నేత బి.రమణారావు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం మూడున్నరేళ్లలో ఒక్కరికి కూడా ఇళ్లు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగ్‌నగర్ యార్డ్‌రోడ్డులో నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించి జన్మభూమి సభల్లో ధ్రువీకరణ పత్రాలను పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నేతలు మూర్తి, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రతపై కళాజాత

పాయకాపురం, జనవరి 3 : పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం వీఎంసీ బుధవారం పాయకాపురంలో కళాజాత నిర్వహించింది. శాంతి కల్చరల్ కళాసమితికి చెందిన పలువురు కళాకారులు ప్రకాశ్‌నగర్ సెంటర్‌లో ఆట, పాటలతో స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రాముఖ్యతను తెలియజెప్పారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించాలని, కాలువల్లో, రోడ్ల పక్కన చెత్త వేయవద్దని, తడి, పొడి చెత్తను విడివిడిగా పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలని గంగాధర్ బృందం పాటల ద్వారా వివరించిన విధానం ఆలోచింపజేసింది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.నాగభూషణం పర్యవేక్షించారు.

తరగతి గదులు ప్రారంభం

సత్యనారాయణపురం : విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చునని ఎమ్మెల్యే బొండా ఉమా అన్నారు. ముత్యాలంపాడులోని గొట్టుముక్కల సూర్యనారాయణరాజు పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులను బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రూ.7.4 లక్షలతో అదనపు తరగతి గదులు నిర్మించామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ త్రిమూర్తిరాజు, డివిజన్ అధ్యక్షుడు చెంచు రామకృష్ణప్రసాద్, పి.రామకృష్ణ, మాల్యాద్రి పాల్గొన్నారు.

ప్రజల చెంతకు 'సంక్షేమం'

మధురానగర్/సత్యనారాయణపురం, జనవరి 3 : ప్రజలందరికీ సంక్షేమ పథకాలను చేరువ చేశామని ఎమ్మెల్యే బొండా ఉమా తెలిపారు. 45వ డివిజన్ మధురానగర్‌లో బుధవారం కార్పొరేటర్ ఆత్కూరి రవికుమార్ అధ్యక్షతన జన్మభూమి కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పేదలకు ఇబ్బంది కలగకుండా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. పేదలు వైద్యం చేయించుకోవడానికి సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. త్వరలో మహిళల పేరుపై ఇళ్ల పట్టాలు ఇవ్వబోతున్నామని పేర్కొన్నారు. కార్పొరేటర్ రవికుమార్ మాట్లాడుతూ 50 లక్షల వ్యయంతో డివిజన్‌లోని మెయిన్ రోడ్డులో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించామని ఫిబ్రవరి నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇది సహించని కొంతమంది వేరే డివిజన్‌లో కర్మల భవనం నిర్మించలేదని ఇక్కడ అల్లరి చేసి ప్రజల దృష్టి మరలుస్తున్నారంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం 25 మంది గర్భిణులకు సీమంతం చేయించారు. నిరుపేద విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.1200 స్కాలర్‌షిప్‌లను అందించారు. ఓ మహిళకు చంద్రన్న బీమా కింద మంజూరైన రెండు లక్షలను అందించారు. 118 డ్వాక్రా గ్రూపుల్లో 1180 మందికి రూ.2.70 కోట్ల లింకేజీ రుణాలను ఇచ్చారు. కొత్తగా మంజూరైన 90 తెల్లరేషన్ కార్డులను, 143 మందికి పింఛన్లను పంపిణీ చేశారు. 600 మందికి చంద్రన్న బీమా బాండ్లను అందించారు. కొత్తగా రేషన్ కార్డుల కోసం 176, ఇళ్ల కోసం 104, వృద్ధాప్య పింఛన్లకు 25, వితంతు పింఛన్లకు 4, వికలాంగ పింఛన్‌కు ఒక దరఖాస్తు చొప్పున రాగా వాటిని ఆయా శాఖల అధికారులు తీసుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పి.వి.ఆర్., కార్యదర్శి కొండా మాలక్ష్మయ్య, అర్బన్ ఉపాధ్యక్షుడు ఎస్.పి.యాదవ్, ఏఎంసీ వైస్ చైర్మన్ సింగం వెంకన్న తదితరులు పాల్గొన్నారు. తొలుత ముఖ్యమంత్రి సందేశం వినిపించారు.



118 డ్వాక్రా గ్రూపులకు మంజూరైన 2.70 కోట్ల లింకేజీ రుణాల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా, కార్పొరేటర్ రవికుమార్

సీపీఎం నేతల బైఠాయింపు

డివిజన్‌లో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లపై ఎమ్మెల్యే స్పష్టమైన ప్రకటన చేయాలంటూ సీపీఎం డివిజన్ నేతలు కృష్ణమూర్తి, స్వామి, కృష్ణ, శ్రీదేవి, ప్రసాద్, మురళీ తదితరులు సమావేశంలోకి దూసుకొచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతుండగా మధ్యలో అలజడి రావడంతో పోలీసులు వారిని అడ్డుకుని సభా ప్రాంగణం నుంచి బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. దీంతో వారు అక్కడే బైఠాయించారు.



సభా వేదిక ఎదుట బైఠాయించిన సీపీఎం నేతలు

సమస్యల పరిష్కార వేదికగా.. జన్మభూమి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమా

ప్రజా సమస్యల పరిష్కారానికి జన్మభూమి కార్యక్రమం వేదికగా మారుతోందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 45, 46 డివిజన్లలో బుధవారం జన్మభూమి జరిగింది. 46వ డివిజన్ ముత్యాలంపాడు జీవీఎస్ఆర్ మున్సిపల్ స్కూల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 45 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నారన్నారు. ఈసారి మరో ఐదు లక్షల మందికి ఇస్తారని చెప్పారు. అవినీతి రహిత పాలనే టీడీపీ ధ్యేయమన్నారు. గతంలో 227 మంది పెన్షనర్లు డివిజన్‌లో ఉండగా ఇప్పుడు 495 మంది ఉన్నారన్నారు. డివిజన్ అభివృద్ధికి రూ.9కోట్లు కేటాయించారని తెలిపారు. మేయర్ కోనేరు శ్రీధర్ మాట్లాడుతూ నిత్యం పిల్లల కోసం గంట సమయం కేటాయించాలని సూచించారు. డివిజన్‌లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను కార్పొరేటర్ త్రిమూర్తిరాజు వివరించారు. అనంతరం సామూహిక సీమంతాలు చేశారు. కొత్త కార్డులు, చంద్రన్న బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎడిషనల్ ఎస్పీ అమరనాథ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో దళారుల ప్రమేయం లేదు

» అందుబాటులో నాణ్యమైన కూరగాయలు

» ఎస్. కరుణాకర్, ఈఓ, సింగ్‌నగర్ రైతుబజార్



అజిత్‌సింగ్‌నగర్, జనవరి 3 : నాణ్యమైన కూరగాయలను అందుబాటు ధరకు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అజిత్‌సింగ్ నగర్ రైతుబజార్ ఈవో ఎస్.కరుణాకర్ చెప్పారు. రైతుబజార్‌లో దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులే వచ్చి విక్రయించేట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇటీవల అజిత్‌సింగ్‌నగర్ రైతుబజార్ ఈఓగా బాధ్యతలు తీసుకున్న ఆయన బుధవారం పలు వివరాలను ఆంధ్రజ్యోతికి వెల్లడించారు.

రైతుబజార్‌లో మొత్తం షాపులు వినియోగంలో ఉన్నాయా..?

మొత్తం 39 దుకాణాలు ఉన్నాయి. ఇందులో 16 పొదుపు సంఘాల మహిళలు, 23 షాపులను రైతులు నిర్వహిస్తున్నారు. క్యాంటిన్ ఒక్కటే అందుబాటులో లేదు. జేసీ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే దాన్ని ప్రారంభిస్తాం.

ఇంటర్వ్యూ

రైతుబజార్‌లో అన్ని రకాల కూరగాయలు అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి?

వాస్తవమే. రోజువారీగా అవసరమైన వస్తువులు అందుబాటులో ఉంటున్నాయి. ఇతర వస్తువులు ఉంచడానికి చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాం.

నిర్ణయించిన ధరలకే విక్రయిస్తున్నారా?

తెల్లవారుజామునే రైతులు, దుకాణదారుల గిట్టుబాటు కోసం నగర వ్యాప్తంగా ఉన్న రైతుబజార్లలో ధరలు నిర్ణయిస్తారు. ప్రతి దుకాణం ఎదుట ధరల పట్టిక ఉంటుంది. ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

రైవస్ కాలువ ఒడ్డు శుభ్రం



చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

సత్యనారాయణపురం : మున్సిపల్ కమిషనర్ జె.నివాస్ ఆదేశాలపై రైవస్ కాలువ ఒడ్డును శుభ్రం చేస్తున్నారు. 44వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంపిళ్ల రామ్ ప్రసాద్ ఆధ్వర్యాన సిబ్బంది బుధవారం కొత్తవంతెన రైవస్ కాలువ ఒడ్డుపై పేరుకు పోయిన చెత్తను తొలగించారు. ఇక్కడ గతంలో ఉడా.. పార్కును నిర్వహించేది. ఆరు నెలలుగా వాచ్‌మెన్‌కు డబ్బు ఇవ్వక పోవడంతో అతను వెళ్లిపోయాడు. దీంతో ఆ ప్రాంతంలో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. మందుబాబులకు నిలయంగా మారిపోయింది. ఇటీవల పర్యటించిన కమిషనర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి శుభ్రం చేయాలని ఆదేశించడంతో బుధవారం ఆ ప్రాంతంలో చెత్తను తొలగించారు. ఆ సమయంలో అక్కడ అనేక మద్యం సీసాలు లభించాయి.

నిర్మాణ సామగ్రి.. కాలువల్లో..



సుందరయ్యనగర్ సెంటర్ వద్ద సైడు కాలువలో సెంట్రింగ్ సామగ్రి

- రెండు నెలలుగా కదలని కాలువలు
- డ్రెయిన్ల అనుసంధానం లేదు

పాయకాపురం, జనవరి 3 : కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా మారింది సుందరయ్యనగర్‌లో కాలువల నిర్మాణ పనులు. కాంట్రాక్టు సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సుందరయ్యనగర్ ప్రాంతంలో కాలువల నిర్మాణం చేపట్టినా మురుగు ముందుకు కదలని పరిస్థితి ఏర్పడింది. కొత్తగా నిర్మించిన వాటి కంటే గతంలో ఉన్నవే నయమనిపిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. ఈ ప్రాంతంలో మూడు నెలల కిందట సైడ్ కాలువల నిర్మాణం పనులు మొదలుపెట్టారు. ఎన్టీఆర్ విగ్రహం ఎదురురోడ్డులో రెండు నెలల కిందట సిబ్బంది పనులు పూర్తి చేశారు. పనుల సమయంలో కాంక్రీట్ వేసేందుకుగా ఇనుపరేకులతో బిగించిన సెంట్రింగ్‌ను తొలగించకుండా వదిలేశారు. రెండు నెలలు గడుస్తున్నా ఎవరూ తొలగించక పోవడంతో మురుగు పారుదలకు ఆటంకం కలుగుతోంది, ఎక్కడికక్కడ మురుగు నిలిచి దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలువల్లోని ఇనుపరేకులను తొలగించాలని కోరుతున్నారు.

అనుసంధానం లేకే సమస్య

కొత్తగా నిర్మించిన కాలువలను పాత వాటితో అనుసంధానించకపోవడం ప్రధాన సమస్యగా మారింది. పాత కాలువల నుంచి మురుగునీరు కొత్తగా నిర్మించిన వాటి ద్వారా బయటకు పోవాల్సి ఉంది. కొత్తగా నిర్మించిన కాలువలు ఎత్తుగా ఉండి ఎక్కడికక్కడే మురుగు నిలుస్తోందని స్థానికులు చెబుతున్నారు అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో..

సంక్షిప్తం

హమ్మయ్య.. మూతను మార్చారు..



పూర్ణానందంపేట(పాత రాజరాజేశ్వరిపేట), జనవరి 3 : పూర్ణానందంపేట జోసఫ్ వీధిలోని యూజీడీ మ్యాన్‌హోల్ మూత పాడైంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు అవస్థలు ఎదుర్కొన్నారు. వీరి అవస్థలను వివరిస్తూ ఆంధ్రజ్యోతి వరుస కథనాలను ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు మూత మార్చారు.

గంజాయి విక్రయిస్తున్న సస్పెక్ట్ షీటర్ అరెస్ట్

అజిత్‌సింగ్‌నగర్ : గంజాయి విక్రయిస్తున్న పాత నేరస్థుడిని బుధవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుడమేరు మధ్యకట్టలో నివసించే అద్దంకి సతీష్‌కుమార్‌పై సస్పెక్ట్ షీట్ ఉంది. పలు పాత కేసులలో నిందితుడిగా ఉన్న సతీష్‌కుమార్ 15 రోజుల కిందట జైలు నుంచి విడుదలయ్యాడు. బుధవారం మధ్యకట్టలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. గంజాయి విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలడంతో గంజాయిని సీజ్ చేసి, నిందితుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అత్యవసరమైనా అంతే..



వాంబేకాలనీ డిస్నీల్యాండ్ మలుపు వద్ద బహిరంగ మలమూత్ర విసర్జన నివారణకు ప్రజారోగ్యశాఖ చర్యలు

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 3 : అత్యవసర ఇబ్బందులు ఎదురైనా.. ఇంటికెళ్లే వరకూ ఇక ఉగ్గ పట్టుకోవాల్సిందే. ఎందుకంటే బహిరంగ మలమూత్ర విసర్జన నివారణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పబ్లిక్ టాయిలెట్లు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లక్ష మందికి పైగా ప్రజలు నివసించే అజిత్‌సింగ్‌నగర్ పరిసరాల్లో కేవలం డాబాకొట్ల సెంటర్‌లోనే పబ్లిక్ టాయిలెట్లు ఉన్నాయి. లూనాసెంటర్, లెనిన్ సెంటర్, గంగానమ్మ గుడి సెంటర్, కృష్ణాహోటల్ సెంటర్, పైపులరోడ్డు సెంటర్లు వ్యాపార కూడళ్లుగా ఉండటంతో నిత్యం అనేకమంది ఇక్కడకు వస్తుంటారు. షాపుల్లో పని చేసే వారు వందల సంఖ్యలోనే ఉంటారు. స్థానికంగా కార్పొరేషన్‌కు చెందిన పబ్లిక్ టాయిలెట్స్ ఈ ప్రాంతాల్లో లేకపోవడంతో పురుషులు స్థానికంగా ఉన్న ఖాళీ ప్రదేశాల వైపు పరుగులు పెడుతుంటారు. అటువంటి ఖాళీ స్థలాలను ఓడీఎఫ్ పాయింట్లుగా గుర్తించిన ప్రజారోగ్య విభాగం అధికారులు అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు స్వచ్ఛాగ్రహి వాలంటీర్లను ఏర్పాటు చేసింది. వీరి పని ఎవరైనా అక్కడకు మలమూత్ర విసర్జనకు వస్తే కర్ర పట్టుకుని తరమడమే. ఈ నేపథ్యంలో ఇళ్లకు వెళ్లే వరకు అలా ఉండాల్సిందే. అవసరమైన టాయిలెట్లు ఏర్పాటుచేయకుండా ఇలాంటి నిబంధనలు అమలుచేస్తే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

షుగర్ వ్యాధిగ్రస్తుల పరిస్థితి ఏంటి

వివిధ పనుల నిమిత్తం వచ్చే షుగర్ వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వ్యాపార కూడలిగా ఉన్న పైపులరోడ్డు సెంటర్‌లో పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో షుగర్ వ్యాధి గ్రస్తులతో పాటు మహిళలు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

- పి.శ్రీనివాస్, పైపులరోడ్డు

టాయిలెట్లు నిర్మించండి

బహిరంగ మలమూత్ర విసర్జన చేస్తున్న ప్రాంతాలను గుర్తించిన కార్పొరేషన్ అధికారులు అక్కడ పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలి. మరుగుదొడ్లు లేక అత్యవసర పరిస్థితిలో రోడ్డు పక్కకు వెళ్లే వారికి జరిమానాలు విధించడం సరికాదు.

- ఎస్.వెంకటేశ్వరరావు, ఆటోడ్రైవర్

పేద, బలహీన వర్గాలకు అండగా టీడీపీ

సత్యనారాయణపురం : పేద, బడుగు బలహీన వర్గాలకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 47వ డివిజన్ శివాలయం వీధిలో చంద్రన్న బీమా బాండ్లను బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జననం నుంచి మరణం వరకు పేదోడికి అన్నివిధాల టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. చంద్రన్న బీమా ప్రతి పేదవాడికి అవసరమన్నారు. మేయర్ శ్రీధర్ మాట్లాడుతూ ఇంకా ఎవరైనా చంద్రన్న బీమాలో చేరాలనుకుంటే మళ్లీ నమోదు చేస్తారన్నారు. కార్పొరేటర్ మహేష్ మాట్లాడుతూ హామీల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు కె.ఆర్.కృష్ణ, సెక్రటరీ విజయకుమార్, నాళం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రన్న బీమా బాండ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉమా, మేయర్ శ్రీధర్

- ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేయర్ కోనేరు శ్రీధర్ అన్నారు. ఎస్ఎన్‌పురం తిరుమల శెట్టి వారి వీధిలో స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే ఉమా, మేయర్ శ్రీధర్, కార్పొరేటర్ మహేష్ చెత్త బుట్టల పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

పని చేయని చేతి పంపు

పాయకాపురం : ప్రజాశక్తినగర్ 93వ బ్లాకులో చేతి పంపు పని చేయడంలేదు. దీనికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలి.

- ఎం,దుర్గారావు, స్థానికుడు

సమాధానం : మంచినీటి విభాగం సిబ్బంది బదిలీ కావడంతో కొంత జాప్యం జరుగుతోంది. వీలైనంత త్వరలో డివిజన్‌లో చేతిపంపులను బాగుచేయిస్తాం.

- అవుతు శైలజ. కార్పొరేటర్, 59వ డివిజన్



క్లిక్.. పోస్ట్

Click.. Post

సామాజిక సమస్యల పరిష్కారానికి ముందుకు రండి. మీప్రాంతంలో ఉన్న సమస్యలపై ఫొటో తీసి ఆంధ్రజ్యోతి వాట్సప్‌కు వివరాలను పంపండి. మీకు, అధికారులకు వారధిగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. సెంట్రల్ నియోజకవర్గంలో మీ సమస్యలను ఈ కింది వాట్సప్ నెంబర్లకు పంపండి.

అజిత్‌సింగ్‌నగర్ (52,53,54,55,56 డివిజన్లు)	9494126786
పాయకాపురం (55,57,58,59)	9966881178
గవర్నర్‌పేట (20, 21)	7396124801
గాంధీనగర్ (42, 51)	9440915485
సత్యనారాయణపురం (43,44,46,47)	8885972333
మధురానగర్ (45)	9866004979
గుణదల (1, 5)	9440671864

తూర్పు నియోజకవర్గం

మొగల్రాజపురం । ఆటోనగర్ । పటమట । కృష్ణలంక । లబ్బీపేట । గుణదల । భారతీనగర్ । బెంజ్‌సర్కిల్ । మాచవరం

నలంద విద్యానికేతన్‌లో సంక్రాంతి ఫెస్ట్-2018

పటమట, జనవరి 3 : స్థానిక నలంద విద్యానికేతన్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శుక్రవారం సంక్రాంతి ఫెస్ట్ 2018ను నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెడ్ మిస్ట్రెస్ మాదల పద్మజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మహిళలకు వివిధ అంశాలలో పోటీలు ఉంటాయని తెలిపారు. సూపర్ కిడ్‌షో, సూపర్ చెఫ్ వంటల పోటీ, హ్యాపీ ఫ్యామిలీ మొదలగు పోటీలు ఉంటాయి. నగర మహిళలందరూ ఈ పోటీలలో పాల్గొనవచ్చు. పాల్గొనదలచిన వారు 77997 87852, 77997 87853 నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

సంక్షిప్తం

దోమల నిర్మూలనకు చర్యలు : ఐలా చైర్మన్



డ్రెయిన్‌లో సిల్ట్ తొలగింపు పనులను పరిశీలిస్తున్న సుంకర దుర్గాప్రసాద్

ఆటోనగర్, జనవరి 3: జవహర్ ఆటోనగర్‌లో దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ తెలిపారు. ఫేస్-3 లోని విజయ కాస్టింగ్స్ రోడ్డులో బుధవారం డ్రయిన్‌లలో సిల్ట్ తొలగింపు, రోడ్ల మార్జిన్లలోని మట్టి దిబ్బలు, చెత్త తొలగింపు పనులను ఆయన పర్యవేక్షించారు. డ్రెయిన్‌లో సిల్ట్ తొలగింపునకు సాయి ప్రీకా సర్వీసెస్ యజమాని సతీష్, కోస్టల్ ట్రేడింగ్ యజ మాని కృష్ణ మోహ న్‌లు సహకారం అందించారని, వారికి ఐలాపాలకవర్గం తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నా మన్నారు. సిల్ట్ తొలగింపు పనులను ఐలా కార్యదర్శి అన్నే శివనాగేశ్వరరావు, పిఆర్ఓ దొనే శ్రీనివాసరావు, సభ్యులు వి.దివాకరరావు, పి.హరిశ్చంద్రప్రసాద్, కె.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

రచ్చబండ- పల్లెనిద్రలో సమస్యలు వివరించిన స్థానికులు



రచ్చబండలో ప్రసంగిస్తున్న 24వ డివిజన్ కార్పొరేటర్ చందన సురేష్

కృష్ణలంక , జనవరి 3: కృష్ణలంక 22 వ డివిజన్‌లోని ఫీడర్ రోడ్డులో బుధవారం రాత్రి జరిగిన రచ్చబండ-పల్లెనిద్రలో స్థాని కులు పలు సమస్యలను వైసీపీ నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. తూర్పు ఇన్‌చార్జి బొ ప్పన భవకుమార్ మాట్లాడుతూ కృష్ణలంక లో రైతుబజారు, సబ్‌వేలు ఏర్పాటు, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇలా అనేక సమస్యలు ప్ర జలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్పొ రేటర్లు చందన సురేష్, పి.రవికుమార్, వైసీపీ నాయకులు నెల్లిబండ్ల రాజు, ముళ్ల పూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'డ్వాక్రా' బలోపేతానికి చర్యలు తీసుకోండి

వన్‌టౌన్, జనవరి 3 : డ్వాక్రా సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, 40వ డివిజన్ కార్పొరేటర్ షేక్ ఆసిఫ్ అన్నారు. విద్యాధరపురం... చిట్టినగర్... విరిపేట షాహీ మసీద్ రోడ్డులోని 40వ డివిజన్ కార్పొరేటర్ షేక్ ఆసిఫ్ కార్యాలయం వద్ద బుధవారం వెంకట కనకదుర్గ పొదుపు సంఘానికి మంజూరైన బ్యాంక్ రుణం రూ.57,500 పంపిణీ చేశారు.

ఇదేనా ఆహ్లాదం...?



- ఆట పరికరాలు, కూర్చోడానికి బెంచీలు లేదు
- పెరిగిపోతున్న చీమల పుట్టలు
- ప్రహరీ లేదు .. ఆకతాయిలకు అడ్డా

పటమట జనవరి 3 : ఆహ్లాదాన్ని కలిగించాల్సిన ఉద్యానవనాలు ఎందుకూ పనికిరాకుండా తయారయ్యాయి. పిల్లలు ఆడుకోవడానికి ఉండాల్సిన ఆటపరికరాలు తుప్పుపట్టాయి. పచ్చదనంతో కళకళలాడాల్సిన ఉద్యానవనం వనం కళావిహీనంగా తయా రవుతున్నాయి. ప్రహరీలు శిథిలమవడంతో ఆకతాయిలు యథేచ్ఛగాలోనికి ప్రవేశించి అసాంఘిక కార్యకలపాలకు పాల్పడుతున్నారు. అలాగే పారిశుధ్య సిబ్బంది చెత్తనంతా తీసి పార్కులో పడేస్తున్నారు. చీమల పుట్టలు పెరిగి పోయాయి. ఉన్న ప్రదేశంలోనే ఆడుకోవడానికి వస్తే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. పార్కులో మరుగుదొడ్డి అధ్వానంగా తయా రైంది. ఇందుకు ఉదాహరణ తొమ్మిదో డివిజన్‌లోని న్యూఆర్టీసీ కాలనీలో, ఆటోనగర్ గేటు దగ్గర్లోని గణపతి సచ్చిదానంద ఆశ్రమ గోశాల రోడ్డులోని నగరపాలక సంస్థ ఉద్యా నవనాలు ఇందుకు నిదర్శనం.

న్యూ ఆర్టీసీ కాలనీలో

ఇక్కడి రామాలయం వీధిలోని పార్కును ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. కొత్తగా ప్రహరీని నిర్మిస్తామని గోడ కూల్చారు నిర్మిం చలేదు. ఆట పరికరాలు తుప్పుపట్టాయి. కొన్ని చెట్లు నేలకూలాయి. ప్రహరీని కూల్చివేయటంతో ఇప్పుడు చెత్త డంపింగ్ ప్రదేశంగా మారింది. పార్కులోని విద్యుత్ మీటర్ బాక్సు ఫ్యూజ్ బాక్సులు వేలాడుతున్నాయి. ఇక మరుగుదొడ్డి విషయం చెప్పనక్కర లేదు. అటువైపు వెళ్లడానికి మనిషన్నవారు ఎవరూ సాహసం చేయరు. అంత అధ్వానంగా ఉంటాయి. రాత్రి వేళల్లో పార్కులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. అధికారులు పట్టించుకుని పార్కు పునర్నిర్మాణానికి కృషి చేయాల్సిందిగా కాలనీ వాసులు కోరుతున్నారు.

అధికారులపై ఒత్తిడి తెస్తాం



ఇచ్చిన హామీ మేరకు కార్పొ రేషన్ అధికారులు పనులు త్వర గా చేయాలి. ఈ మేరకు అధి కారులపై ఒత్తిడి తెస్తాం.

వీరంకి డాంగే కుమారి (11వ డివిజన్ కార్పొరేటర్)

ఆశ్రమం రోడ్డులో

ఆటోనగర్ గేటు దగ్గర్లోని గణపతి సచ్చిదానంద ఆశ్రమం గోశాల రోడ్డులో నగరపాలక సంస్థ పార్కు నిరుపయోగంగా ఉంది. గతంలో ఈ పార్కు పిల్లలు, పెద్దవారు కాసేపు సేదతీరటానికి ఎంతగానో ఉపయుక్తంగా ఉండేది. కానీ సరైన పర్యవేక్షణ లేక ఈ పార్కు శిథిలావస్థలో ఉన్నది. పార్కులో ఎదురుగా పెద్ద చీమల పుట్ట దర్శనమిస్తుంది.. పర్యవేక్షించే నాథుడు లేడు.. పిల్లల ఆట పరికరాలు ఎందుకూ పనికి రాకుండా ఉన్నాయి. అధికారులు స్పందించి ఈ పార్కును వినియోగంలోకి తీసుకురావల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.



విరిగిపోయిన పార్కు గేటు



అధ్వానంగా మరుగుదొడ్డి



ఆర్టీసీకాలనీ : పార్కులోని ఫ్యూజ్ బ్యాక్సు



గణపతి సచ్చిదానంద ఆశ్రమం వెనుక రోడ్డులో ..



ఉపయోగపడని ఆట పరికరం

క్లిక్.. పోస్ట్

Click.. Post

అయ్యప్పనగర్, పటమట, ఆటోనగర్, పటమటలంక, బెంజ్‌సర్కిల్, భారతీనగర్ మొగల్రాజపురం, గుణదల, కృష్ణలంక, రాణిగారితోట, లబ్బీపేట తదితర ప్రాంతాల్లో సమస్యలు మీ దృష్టికి వచ్చిన వెంటనే ఫొటో తీసి వాట్సాప్ ద్వారా ఆంధ్రజ్యోతికి పంపవచ్చు. క్లుప్తంగా సమస్య రాసి, మీ పేరు, ప్రాంతం తప్పనిసరిగా తెలియజేయాలి.

వాట్సాప్ నెంబర్ 9985411602

పూడిక తీయడం లేదు



ఈఎస్ఐ ఆసుపత్రి జంక్షన్ వద్ద డ్రైన్ పూడిక సకాలంలో తొలగించకపోవడంతో మురుగునీరు పారుదల నిలిచిపోయింది. ఈ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. పూడిక తీయాలి.

- రామకృష్ణ స్థానికుడు గుణదల

సమాధానం : డ్రైన్ పూడిక గురువారం ఉదయాన్నే తీస్తాం

- ఆయూబ్ రెండో డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్

డంపర్‌బిన్ నిండింది



మారుతీనగర్ చైతన్య టెక్నో స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన డంపర్ బిన్లు నిండి తొలగించడం లేదు. దుర్గంధం వెదజల్లుతోంది. వెంటనే డంపర్ బిన్లు తొలగిస్తే బాగుంటుంది.

- లక్ష్మి ,మారుతి నగర్

సమాధానం : సిబ్బంది కొరతగా ఉంది. గురువారం నిండిన డంపర్ బిన్లను తొలగిస్తాం

-సహేరాభాను (6వ డివిజన్ కార్పొరేటర్)

పొంగుతున్న మ్యాన్‌హోల్



బందరు రోడ్డులోని మురళీ ఫార్చ్యూన్ హోటల్ ఎదురు రోడ్డులో నెల రోజుల నుంచి మ్యాన్‌హోల్ పొంగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

రాజేష్, స్థానికుడు

సమాధానం : సమస్యను త్వరగా పరిష్కరిస్తాం

- రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పదవీ విరమణ చేసిన డిప్యూటీ సీఎస్ఆర్ ఎంవోకు సన్మానం



రవి కుమార్ దంపతులను సన్మానిస్తున్న సూపరింటెండెంట్ డాక్టరు చక్రధర్, భీమేశ్వరనాయక్, గీతాంజలి తదితరులు

ప్రభుత్వాసుపత్రి, జనవరి 3 : ప్రభుత్వా సుపత్రిలో డిప్యూటీ సీఎస్ఆర్ ఎంవోగా పనిచేసి పదవీ విరమణ చేసిన రవికుమార్‌కు సన్మానం జరిగింది. ఈ కార్యక్రమం బుధవారం ప్రభుత్వా సుపత్రి సూపరింటెండెంట్ చాంబర్‌లో జరిగింది. పలువురు వైద్యులు, సిబ్బంది సన్మానించారు. సూపరింటెండెంట్ చక్రధర్ మాట్లాడుతూ డాక్టర్ రవికుమార్ సేవలు మరువలేనివని, అతని శేషజీవితం ప్రశాంతంగా కొనసాగాలని కోర కుంటున్నట్లు తెలిపారు. డాక్టర్లు నాయక్, శివశంకర్, గీతాంజలి మాట్లాడుతూ రవి కుమార్ పాత ప్రభు త్వాసుపత్రిలో, కొత్త ఆసుపత్రుల్లో డిప్యూటీ సీఎస్ఆర్ ఎంఓగా విశేష సేవలందించారని తెలిపారు. పలు వురు వైద్యులు, సిబ్బంది పాల్గొని సన్మానించారు. రవికుమార్ మాట్లాడుతూ తనకు సహకరించిన ఆరోగ్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రగతిపథంలో రాష్ట్రం

- 10 వ డివిజన్ జన్మభూమిలో మంత్రి కొల్లు రవీంద్ర
- 24వ డివిజన్‌లో సీపీఎం ఆందోళన
- సర్దిచెప్పిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక : లోటు బడ్జెట్ ఉన్నా పలు పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలోకి నడిపిస్తున్న ముఖ్యమంత్రి సమర్థనీయుడని న్యాయ, క్రీడా శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. 24వ డివిజన్ కృష్ణలంక గంగానమ్మ గుడి వద్ద జన్మభూమి-మా ఊరు 2018, 5వ విడత జన్మభూమి జరిగింది. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి కొత్తగా ఏర్పడిన అమరావతి వరకు ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టనన్ని పథకాలు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టారన్నారు. జన్మభూమి స్పెషల్ ఆఫీసర్ అనంత్‌రామ్ మాట్లాడుతూ జన్మభూముల ద్వారా ప్రజలకు ఇళ్లపట్టాలు, రేషన్‌కార్డులు, పింఛన్లు అందజేస్తున్నారన్నారు. ప్రజలంతా తమ సమస్యలను జన్మభూమిలో అర్జీ ద్వారా సమర్పిస్తే వాటిని సత్వరం అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు.

పబ్లిసిటీ కోసం పాకులాడొద్దు

సభలో రాద్ధాంతం చేసి... పబ్లిసిటీ కోసం పాకులాడొద్దని సీపీఎం కార్యకర్తలు, నాయకులకు చురకలు వేశారు. శ్మశాన భూముల్లో ఇళ్లు వేసుకొని ఏళ్ల తరబడి జీవిస్తున్న వారికి ఇళ్లపట్టాలు ఇవ్వాలంటూ స్థానిక సీపీఎం నాయకులు నోడల్ ఆఫీసర్ సీఎం సందేశం చదువుతున్న సందర్భంలో నినాదాలు చేసి సభకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు కొన్ని అడ్డంకులు వున్నాయని. అవి తొలగగానే అతి త్వరలో అందరికీ ఇళ్ల పట్టాలను మహిళలకు పసుపు, కుంకుమ పెట్టి అందిస్తామని స్పష్టం చేశారు. అనంతరం గద్దె రామ్మోహన్ సొంత నిధులతో డివిజన్‌లోని బాలింతలకు సభా ప్రాంగణంలోనే సీమంతం చేయించారు. బాలింతలకు పసుపు, కుంకుమ, చీర, పండ్లు పంపిణీ చేశారు. నోడల్ ఆఫీసర్ కోటేశ్వరరావు, ఎఎస్ఓ ఉదయ్‌భాస్కర్, కార్పొరేటర్లు చందన సురేష్, జి.నర్సింహారావు, టీడీపీ నాయకులు ముమ్మనేని ప్రసాద్, కొమ్మారెడ్డి పట్టాభి, చెన్నుపాటి ఉషారాణి, చెన్నుపాటి గాంధీ, పలిశెట్టి అన్నారావు తదితరులు పాల్గొన్నారు.



జన్మభూమి సభలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులకు సర్దిచెపుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్.

సమస్యల పరిష్కార అన్వేషణకే జన్మభూమి : గద్దె

పటమట, జనవరి 3 : డివిజన్‌లోని ప్రజలందరూ ఒక చోట చేరి స్థానిక సమస్యలపై చర్చించుకుని పరిష్కార మార్గాలను అన్వేషించుకోవాలనే ఉద్దేశంతోనే జన్మభూమి చేపట్టినట్లు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, అర్హులు వాటిని లబ్ధిపొందేలా చూడటమే జన్మభూమి లక్ష్యమని ఆయన చెప్పారు. పదో డివిజన్‌లో శ్రీనివాస కల్యాణ మండపంలో బుధవారం ఐదో విడత జన్మభూమి జరిగింది. గద్దె రామ్మోహన్, మేయర్ కోనేరు శ్రీధర్‌లు రేషన్ కార్డులు, పింఛన్లు, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. మేయర్ కోనేరు శ్రీధర్ మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతూ ఇంటికి పెద్దదిక్కులా మారారన్నారు. కార్పొరేటర్ షేక్ నజీర్ మాట్లాడుతూ ప్రజలు దరఖాస్తు చేసుకున్న వాటన్నింటిని ఈ జన్మభూమిలో అందజేస్తామని తెలిపారు.. ఈ సందర్భంగా 70 సంఘాల ద్వారా మహిళలకు రూ. 3.5 కోట్ల రుణాలను గద్దె రామ్మోహన్, కోనేరు శ్రీధర్, అధికారులు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన చెక్కులను లబ్ధి దారులకు గద్దె అందజేశారు. కార్పొరేటర్లు చెన్నుపాటి గాంధీ, వీరంకి డాంగే కుమారి, చెన్నుపాటి ఉషా రాణి, ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, పట్టాభిరామ్, గల్లా సదాశివరావు, అధికారులు ప్రభాకర్, చంద్రశేఖర్, ఉదయభాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వయం సహాయక సంఘాలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్

సంక్షిప్తం

సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినుల ప్రతిభ

లబ్బీపేట : అంతర్ కళాశాల జాతీయ స్థాయి పోటీలలో తమ కళాశాల విద్యార్థినులు పర్యావరణహిత ఎంట్రీలలో ఉత్తమ బహుమతులు సాధించినట్లు సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ టి. విజయలక్ష్మి తెలిపారు. హరితప్రియ ప్లాంట్ లవర్స్ అసోసియేషన్, రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన 36వ జాతీయ గులాబీ ప్రదర్శనలో పూల ముగ్గుల పోటీలో ద్వితీయ బహుమతి జాహ్నవి, గెలుచుకున్నారు. తృతీయ బహుమతి జి.హారిక, రెండు కన్సో లేషన్ బహుమతులు లలితాంబిక, సుకన్య జట్లు గెలుపొందారని తెలిపారు.

అదే విధంగా గుంటూరు టీజీపీఎస్ పి.సింధుమానస, ఎస్ ప్రీతీలు ప్రథమ బహుమతి, గోరాసైన్స్ సెంటర్ నిర్వహించిన ఇన్నోవేటివ్ లైవ్ సైన్స్ ప్రాజెక్టు పోటీలలో పాల్గొని ప్రియాంక, హేమలత, సింధుమానస, అంజలి, పావనిలు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. విద్యార్థినులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

వైసీపీ బలోపేతానికి కృషి చేయాలి

భారతీనగర్, జనవరి 3: రాబోయే రోజులలో కార్యకర్తలందరై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ బొప్పన భవకుమార్ అన్నారు. మూడో డివిజన్ పార్టీ కార్యాలయంలో నూతన కార్యవర్గం సమావేశం బుధవారం జరిగింది.

ఆయన మాట్లాడుతూ రాబోయే రోజులలో జగన్ సిఎం చేయాలన్నారు. కార్యకర్తలందరూ పార్టీ సంక్షేమ పథాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని కోరారు. జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మాతంగి రాజేష్, 18వ డివిజన్ అధ్యక్షుడు కోడాలి రవి, నగర కార్యదర్శిగా హరసా కృష్ణ తదితరులు ఆయన్ని కలిశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

259 జీవోను పరిగణలోకి తీసుకోవాలి

ఉయ్యూరు, జనవరి 3: జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న గ్రామకంఠం, బీ ఫారం పట్టాల వారికి నష్టపరిహారం చెల్లించే విషయంలో ప్రభుత్వం జారీ చేసిన 259 జీవోను కేంద్రం పరిగణలోకి తీసుకోవాలని టీడీపీ నాయకుడు కొండా ప్రవీణ్ అన్నారు.

విజయవాడ - మచిలీపట్నం మధ్య జాతీయ రహదారి విస్తరణలో గండిగుంట పరిధి ఆనందపురంలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న గ్రామకంఠం, బీ ఫారం పట్టాల వారికి ఈజీవో పరిగణలోకి తీసుకునేలా కృషి చేయాలని కోరుతూ రాష్ట్ర ఐటీ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారాలోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

ఎండిపోయిన మొక్కలు తొలగించారు

కొత్త మొక్కలు నాటుతాం : కార్పొరేషన్ ఏడీహెచ్ ప్రదీప్

రాణిగారితోట : కృష్ణలంక గద్దె రామ్మోహన్ ఫీడర్ రోడ్డులో మొక్కల దుస్థితిపై ఆంధ్రజ్యోతిలో బుధవారం వచ్చిన కథనానికి ఉద్యానశాఖ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కార్యాలయం స్పందించింది. ఎండిపోయిన మొక్కలను బుధవారం ఉదయం తొలగించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వందల రూపాయల ఖర్చుతో నాటిన మొక్కలకు కనీసం నీళ్లు పోసేవారు లేకపోవడంతో సుమారు ఐదు మొక్కలు చనిపోయాయి. ఇంత వరకు ఎవరు పట్టించు కోకపోగా 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో ఇక నుంచి వాటి సంరక్షణ ఎవరిదన్న ప్రశ్న తలెత్తింది. ప్రత్యేకంగా ట్రాక్టర్ పెట్టించి నీళ్లు పోస్తున్నాం. అయితే కొంత మంది మాత్ర విసర్జన చేయడం కారణంగా అవి చని పోతున్నాయనీ, ప్రజలలో అవగాహన రావాలని చనిపోయిన వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటుతామని కార్పొరేషన్ ఏడీహెచ్ ప్రదీప్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

బీజేపీ అధ్యక్షుడు రాంబాబు మృతి

పెనమలూరు, జనవరి 3: యనమలకుదురు బీజేపీ అధ్యక్షుడు బట్టు రాంబాబు మంగళవారం అర్థరాత్రి గుండెపోటుతో మృతి చెందారు.

స్వచ్ఛ విజయవాడ లక్ష్యం

- మేయర్ కోనేరు శ్రీధర్

భారతీనగర్ : స్వచ్ఛ విజయవాడ సాధించడమే లక్ష్యమని మేయర్ కోనేరు శ్రీధర్ అన్నారు. గుణదల దళితవాడలో తడి, పొడి చెత్త డస్ట్‌బిన్స్, చెత్త ట్రాలీలను బుధవారం మేయర్ కోనేరు శ్రీధర్, స్థానిక కార్పొరేటర్ దేవినేని అపర్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలందరూ చెత్తను వేరు చేసి తడిచెత్త, పొడి చెత్త వేర్వేరుగా అందాలన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వకపోవడంతో చాలా సమయం వృథా అవుతోందని, రెండు బుట్టలలో తడి, పొడి చెత్త వేరు చేసి శానిటరి సిబ్బందికి అందజేసి సహకరించాలని కార్పొరేటర్ దేవినేని అపర్ణ తెలిపారు. కార్పొరేషన్ అధికారి దుర్గారావు, దాసరి హరికృష్ణ, వెంకటేశ్వరరావు, కోనేరు కొండయ్య, శానిటరి ఇన్‌స్పెక్టర్ ఆయుబ్ తదితరులు పాల్గొన్నారు.

13 వ డివిజన్‌లో

పటమట, జనవరి 3 : ప్రతి ఇంటి నుంచి తడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలని ఎస్ఎం జి. ఇక్బాల్ హుస్సేన్ అన్నారు.

13వ డివిజన్ శ్రీరామనగర్, ప్రగతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం బుధవారం జరిగింది. అలాగే కాలనీలో తడి చెత్త నిల్వ ఉంచే కంపోస్టును ఏర్పాటు చేయాలన్నారు. కాలనీ నుంచి వచ్చే తడి చెత్తను వారం రోజుల వరకు ఉంచి కుళ్లించి దాని నుంచి వర్మికంపోస్టుకు పంపిస్తామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుప్పల నరసింహారావు మాట్లాడుతూ పై అంశాలను తప్పనిసరిగా పాటించాలని కాలనీ వాసులను కోరారు.

15వ డివిజన్‌లో

రాణిగారితోట : ప్రతి ఒక్కరు తమ నివాసాల నుంచి వచ్చే చెత్తను తడి, పొడి చెత్తగా విభజించి చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలని డిప్యూటీ మేయర్ గోగుల రమణ అన్నారు. 15వ డివిజన్ సిద్ధం రామకృష్ణారావు భవన్‌లో బుధవారం జరిగిన చెత్తబుట్టల పంపిణీ జరిగింది. ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని విభజించిన చెత్తను కంపోస్ట్ చేయడం వలన మొక్కల ఎరువు లభిస్తుందని తెలిపారు. . అనంతరం స్థానిక ప్రజలకు బుట్టలను పంపిణీ చేశారు. కార్పొరేటర్ కావటి దామోదర్, యూసీడీ పిఓ సత్యనారాయణ, పీవో నాగలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్‌పిళ్లై తదితరులు పాల్గొన్నారు.



ట్రాలీలు పంపిణీ చేస్తున్న మేయర్ కోనేరు శ్రీధర్, కార్పొరేటర్ దేవినేని అపర్ణ



చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న గోగుల రమణ, దామోదర్ తదితరులు



సమావేశంలో పాల్గొన్న13 వడివిజన్ కాలనీ వాసులు

గన్నవరం నియోజకవర్గం

నేరాలు తగ్గాయి : జిల్లా ఎస్పీ

మైలవరం, జనవరి 3: జిల్లా పరిధిలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు ఎస్పీ సర్వశ్రేష్ట త్రిపాఠి తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం మైలవరం విచ్చేసిన ఆయన పోలీస్‌స్టేషన్‌లో అధికారులతో పలు విషయాలపై చర్చించారు. డిసెంబరు 30న పట్టణ పరిధిలో జరిగిన ఆటో, కారు యాక్సిడెంట్ జరిగిన ప్రాంతాన్ని పరిశీ లించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ రెండేళ్లగా నేరాలు తగ్గాయని, అందరూ కలసికట్టుగా పనిచేస్తుండటంతో చక్కని ఫలితాలు వస్తున్నాయన్నారు. ప్రమాదాల సంఖ్య పెరుగుతోందన్న ప్రశ్నకు సౌకర్యాలు పెరిగే కొద్దీ ప్రమాదాలు పెరగడం సహజమన్నారు.

సంక్షిప్తం

సమస్యల పరిష్కారానికే...

తేలప్రోలు (ఉంగుటూరు), జనవరి 3 : ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ మూడున్నరేళ్లలో ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టినట్లు ఎంపీపీ గుదె ఇందిర అన్నారు. మండలంలోని చాగంటిపాడు, తేలప్రోలు, చికినాల గ్రామాల్లో బుధవారం జన్మభూమి-మాఊరు గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాసరావు సారథ్యంలో ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను సభల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం గర్భిణిలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. 120 మంది విద్యార్థులకు రూ.1.40 లక్షలు చంద్రన్న స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. మూడు గ్రామాల నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా 582 అర్జీలు వచ్చాయి. వాటిలో ఎక్కువ నివేశన స్థలాలకే వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఆర్.యుగంధర్, వైస్ ఎంపీపీ ఆర్నేపల్లి సింహాచలం, ఈవోపీఆర్డీ నరసింహారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ లు, జన్మభూమి కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గన్నవరం జనవరి 3 : బహుళ ప్రయోజక సైకిల్ ఆవిష్కరణకు కృషిచేస్తున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యే వంశీ ఆర్థిక సాయం చేయడం గొప్ప విషయమని తెలుగు యువత మండల అధ్యక్షుడు బండ్లమూడి ఆంజనేయ ప్రసాద్ అన్నారు. కోనేరు లక్ష్మయ్య యూనివర్సిటీ మెకానికల్ విభాగంలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు సైకిల్ ఆవిష్కరణకు ఎమ్మెల్యేను సాయం అడగ్గా రూ.25 వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు నగదును స్థానిక పార్టీ కార్యాలయంలో ఆంజనేయ ప్రసాద్ బుధవారం అందజేశారు. చెన్నూరి చిన వెంకటేశ్వరరావు, చింతల వెంకటేశ్వరరావు, విద్యార్థులు కాటూరి సాయికుమార్, శ్రీనివాస్, అనూప్ వర్మ, జతిన్ పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

గన్నవరం జనవరి 3 : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేసేందుకు టీడీపీ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్లు ఉప సర్పంచ్ జాస్తి శ్రీధర్ అన్నారు. కొత్తగా మంజూరైన చేనేత పింఛన్లను లబ్ధిదారులకు పంచాయతీ కార్యాలయంలో బుధవారం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఐదురెట్లు ఒకేసారి పెంచి అందించడం టీడీపీ ప్రభుత్వ ఖ్యాతి అన్నారు. మర్లచెరువు సాగునీటి సొసైటీ అధ్యక్షుడు మేడసాని వెంకట రామకృష్ణారావు (కిట్టు), వార్డు సభ్యులు కె.మాణిక్యాలరావు, పఠాన్ అజిత్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి పార్థసారథి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

▸▸ ఎమ్మెల్యే వంశీ



బూతిమిల్లిపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీ

బూతిమిల్లిపాడు (గన్నవరం), జనవరి 3 : మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా తెలుగుదేశం ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అన్నారు. మండల పరిధిలోని బూతిమిల్లిపాడులో బుధవారం జరిగిన జన్మభూమి సభకు ముఖ్య అతిధిగా విచ్చేశారు. మండల ప్రత్యేకాధికారి సుధాకర్ అధ్యక్షతన సభలో మండలస్థాయి అధికారులు వారి పనితీరును వివరించారు. అనంతరం ఎమ్మెల్యే వంశీ మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయి ఇబ్బందులు పడుతున్నా ప్రజలకు అండగా నిలిచేందు కు సీఎం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా 1066 జబ్బులకు ఉచితంగా వైద్య సేవలు అందజేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని 40గ్రామాల్లో పూర్తిగా సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. మిగిలిన గ్రామాల్ని కూడా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతులను ప్రోత్సహించేందుకు ఇన్‌పుట్ సబ్సిడీ, మద్దతు ధర, రుణమాఫీ చేశామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా విరివిగా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. ధాన్యం అమ్ముకునేందుకు రెవెన్యూ శాఖ సర్టిఫికెట్‌లు ఇవ్వడం లేదని రైతు ఫిర్యాదు చేయగా అధికారులు సమన్వయంతో పనిచేసి ఎవరినీ ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. గ్రామంలో పశువైద్య ఉప కేం ద్రాన్ని తిరిగి ప్రారంభించాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు పడమట సురేష్, ఎంపీపీ పత్రా కవిత, జడ్పీటీసీ సభ్యురాలు మరీదు లక్ష్మీదుర్గ, సర్పంచ్ ఫణీంద్రకుమార్, ఎంపీడీవో వై.ఇందిరా ప్రియదర్శినీ, తహసీల్దారు ఎం.మాధురి, ఏడీఏ జయప్రద, ఎంఈవో మార్గరెట్, ఎంపీటీసీ గంటా జాన్, ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.

అల్లాపురంలో....

అల్లాపురం పంచాయతీ కార్యాలయం వద్ద జన్మభూమి సభ నిర్వహించారు. సీఎం సందేశాన్ని చదివి ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ అనగాని రవి ఆధ్వర్యంలో కార్యక్రమంలో సంక్రాంతి కానుకలు అందజేశారు. రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యదర్శి గంటా సత్యసాయిబాబు, పార్టీ గ్రామ అధ్యక్షుడు డొక్కు సాంబశివ వెంకన్న బాబు, బాలశౌరి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అజ్జంపూడిలో కూడా జన్మభూమి సభ నిర్వహించారు.

మల్లవల్లిలో ఇంటింటికీ తెలుగుదేశం

● సమస్యలు తెలుసుకునేందుకు ఎమ్మెల్యే పాదయాత్ర

హనుమాన్‌జంక్షన్ రూరల్ జనవరి 3 : బాపులపాడు మండలం మల్లవల్లిలో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రంతా, బుధవారం ఉదయం ఐదు గంటల వరకు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కొత్త మల్లవల్లిలో ప్రజానీకం, కార్యకర్తలు ఆయన కోసం చలిమంటలు వేసుకుని మరీ ఎదురుచూశారు. పాతమల్లవల్లిలో మధ్యాహ్నం రెండు గంటలకు మొదలు పెట్టిన కార్యక్రమం రాత్రి 11 గంటల వరకు సాగింది. కొత్తమల్లవల్లిలో కొత్తగా ఏర్పాటు చేసిన పార్టీ స్థూపంపై జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి చెన్నుబోయిన శివయ్య, గ్రామ అధ్యక్షుడు యనమదల వెంకయ్యరావు, కార్యదర్శి వణుకూరి జోజి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, పార్టీ గ్రామ నేతలు ఆలూరి సురేష్, సత్యనారాయణ, జాన్ భాష, ఆదాం సాహెబ్, మస్తాన్ పాల్గొన్నారు.

సమష్టి ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం



నాయీబ్రాహ్మణ చైతన్యయాత్ర సదస్సులో ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు యానాదయ్య

హనుమాన్‌జంక్షన్, జనవరి 3 : అపరిష్కృత సమస్యల పరిష్కారానికి సమష్టి ఉద్యమాలే శరణ్యమని నాయీబ్రాహ్మణ సేవాసంఘ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధవటం యానాదయ్య పిలుపు నిచ్చారు. రాష్ట్ర వ్యాప్త నాయీబ్రాహ్మణ చైతన్యయాత్ర బుధవారం హనుమాన్‌జంక్షన్ చేరుకుంది. ఈ సందర్భంగా కాకాని కల్యాణ మండపంలో జరిగిన సదస్సులో మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి రాష్ట్రం కార్పొరేషన్ ఏర్పాటు చేయాని డిమాండ్ చేశారు. వంద ఎకరాలున్న భూస్వామికి ఉచిత విద్యుత్ ఇస్తూ, ఏ ఆధారంలేని పేద బార్బర్ షాపులకు ఇవ్వక పోవడం శోచనీయ మన్నారు. వారికి కూడా 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కేటాయించాలన్నారు. సమావేశంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడు రావులపల్లి మల్లేశ్వరరావు, కృత్తివెంటి వెంకటరామారావు, ఎం.సుబ్బారావు, డి.కృష్ణ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో సెయింట్ జాన్స్ ప్రతిభ

గన్నవరం జనవరి 3 : జాతీయస్థాయి వ్యాసరచన పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థినులు అల్లు జాహ్నవిదేవి, నర్రా కృష్ణహాస పాల్గొని ప్రతిభ చూపి బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపల్ బ్రదర్ బాలశౌరి తెలిపారు. విజేతల అభినందన సభ బుధవారం జరిగింది. ప్రిన్సిపల్ మాట్లాడుతూ పెట్రోలియం కన్జర్వేషన్ రీసెర్చి అసోసియేషన్, సీబీఎస్ఈ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో తెలుగు ద్వితీయ భాషగా చదువుతున్న తమ విద్యార్థులు జాహ్నవిదేవి ప్రథమ, కృష్ణహాస ద్వితీయస్థానాలు కైవసం చేసుకుని రూ.20 వేలు నగదు బహుమతితోపాటు ల్యాప్‌టాప్ గెల్చుకున్నారని తెలిపారు. వారికి ఢిల్లీలో ఈనెల 16న జరిగే సభలో బహుమతులు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో బ్రదర్ జిమ్మి కురియోకోస్, బ్రదర్, జేసు రాజు, సిస్టర్ బిమ్లా పాల్గొన్నారు.



తెంపల్లెలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీకాంతం

ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

▸▸ కలెక్టర్ లక్ష్మీకాంతం

తెంపల్లి(గన్నవరం) జనవరి 3 : ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం నివ్వాలని కలెక్టర్ లక్ష్మీకాంతం సూచించారు. మండల పరిధిలోని తెంపల్లి జన్మభూమి సభల్లో భాగంగా జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు పరిశీలించేందుకు బుధవారం ఆయన వచ్చారు. ఆహారం-ఆరోగ్యం అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. తప్పనిసరిగా అందరూ మరుగుదొడ్లను వినియోగించాలన్నారు. జిల్లాను ఓడీఎఫ్‌గా ప్రకటించామనీ, ఎవరూ బయటకు వెళ్లకూడదని వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. బయోఫెన్సింగ్, కిచెన్‌గార్డెన్ రంగులు చూపి ఉపాధ్యా యురాలు కల్పనను అభినందించారు. చిన్నారులకు ఆటలపాట లతో కూడిన విద్యనందించాలన్నారు. అనంతరం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. జన్మభూమి లక్ష్యాన్ని వివరిస్తూ కళాకారులు గీతాలు ఆలపించారు. సర్పంచ్ విజయకుమార్, మండల ప్రత్యేకాధికారి సుధాకర్, తహసీల్దారు ఎం.మాధురి, ఎంపీడీవో వై.ఇందిరా ప్రియదర్శిని, ఎంఈవో మార్గరెట్, హెచ్‌ఎం మాణిక్యమ్మ, వీఆర్వో జె.వెంకటేశ్వరరావు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అట్టహాసంగా చింతమనేని పుట్టినరోజు

హనుమాన్‌జంక్షన్, జనవరి 3 : రాష్ట్ర ప్రభుత్వ విప్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పుట్టిన రోజును జంక్షన్‌లో టీడీపీ శ్రేణులు నిర్వహించాయి. అభయాంజనేయ దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ పావులూరి రామారావు, వేమూరి శ్రీనివాసరావు తదితర టీడీపీ నేతలు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేమూరి యూత్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏలూరు రోడ్డులోని ఆశాజ్యోతి వికలాంగుల పాఠశాలలో దివ్యాంగ విద్యార్థుల మధ్య ఎమ్మెల్యే కేక్‌కట్ చేశారు. దివ్యాంగ విద్యార్థులకు వేమూరి యూత్ ఆర్గనైజేషన్ అన్నదానం నిర్వహించింది. కార్యక్రమాల్లో దేవాలయం ఛైర్మన్ పావులూరి రామారావు, వేమూరి శ్రీనివాసరావు, రావి ప్రసాద్, వీరపనేని రాజా, సర్పంచ్ కొత్తూరి రంగమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడతున్న కాట్రగడ్డ స్వరూపరాణి

ఘనంగా సావిత్రిబాయి పూలె జయంతి

గన్నవరం జనవరి 3 : కులవ్యవస్థ నిర్మూలనకు పాటుపడిన సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలె దేశ చరిత్రలో ధ్రువ తారగా వెలిగొందుతున్నారని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ స్వరూపరాణి అన్నారు. దేశంలోనే తొలి ఆదర్శ ఉపాధ్యాయిని సావి త్రిబాయి పూలె జయంతి బుధవారం ఐద్వా ఆధ్వర్యంలో వీకేఆర్ కళాశాలలో నిర్వహించారు. సభకు విద్యావేత్త డాక్టర్ కె.రాజేశ్వరీ అధ్యక్షత వహించారు. స్వరూపరాణి మాట్లాడుతూ కులవ్యవస్థ నిర్మూలనకు, పీడిత ప్రజానీకం పట్ల ఆమె మనస్సులో ఆలోచనలను గుర్తించిన జ్యోతిరావు బాలికల పాఠశాల ప్రారంభించారని తెలిపారు. న్యాయవాది ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలకు చట్టాలు ఉన్నప్పటికీ సక్రమంగా అమలు కాకపోవటంతో వివక్ష కొనసాగుతుందన్నారు. ఐద్వా డివిజన్ కార్యదర్శి మల్లంపల్లి జయమ్మ, అధ్యాపకులు జ్యోతి భాస్కర్, అడవి రాణి పాల్గొన్నారు.

గన్నవరం
నియోజకవర్గం

• గన్నవరం • బాపులపాడు • ఉంగుటూరు • విజయవాడ రూరల్

కొత్తగా 569 రేషన్ కార్డులు

విజయవాడ రూరల్, జనవరి 3 : జన్మభూమిలో భాగంగా రూరల్ మండలానికి కొత్తగా 569 రేషన్‌కార్డులు మంజూరైనట్లు డిప్యూటీ కలెక్టర్ (అండర్ ట్రైనీ తహసీల్దార్) ఎ.రవీంద్రరావు బుధవారం చెప్పారు. గత జన్మభూమిలో రేషన్‌కార్డుల కోసం 1223 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 569 మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. గొల్లపూడికి 202 కార్డులు, ఎనికేపాడుకు 36, అంబాపురానికి ఐదు, గూడవల్లికి నాలుగు, జక్కంపూడికి 46, కొత్తూరుకు నాలుగు, నిడమానూరుకు ఒకటి, నున్నకు 28, పైడూరుపాడుకు ఐదు, పాతపాడుకు ఆరు, పినైనవరానికి 13, ప్రసాదంపాడుకు 84, రాయనపాడుకు 13, జక్కంపూడికి 28, షాబాద, వేమవరం గ్రామాలకు రెండు కార్డులు మంజూరైనట్లు తెలిపారు.

కోడి పందేలకు అడ్డుకట్ట

» పోలీసు, రెవెన్యూ ఉమ్మడి కమిటీలు » పందేలు, జూద క్రీడల నిర్వహణపై దాడులు

విజయవాడ రూరల్, జనవరి 3 : సంక్రాంతి కోడి పందేల నిర్వహణకు అడ్డుకట్ట పడనుంది. కోడి పందేలు, జూద క్రీడల నిర్వహణపై హైకోర్టు సీరియస్ అయిన నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక వచ్చింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ ఆదేశాల మేరకు కలెక్టర్లు, ఎస్పీ, నగర పోలీస్ కమిషనర్ ఆగమేఘాలపై అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పోలీసు, రెవెన్యూ, పశుసంవర్ధకశాఖ అధికారులతో దాడులకు ఉమ్మడి కమిటీలు వేశారు. జిల్లాలోని తహసీల్దార్లతో కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, పోలీసు అధికారులతో విజయవాడ సీపీ గౌతమ్ సవాంగ్ వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. కోడి పందేల నిర్వహణపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా కమిటీలు వేసి పందేల నిర్వాహకులపై దాడులు చేయాలని ఆదేశించారు. కలెక్టర్, నగర సీపీ ఆదేశాల మేరకు అన్ని మండలాల్లో ఉమ్మడి కమిటీలను ఏర్పాటుచేశారు. రూరల్ మండలంలో డిప్యూటీ కలెక్టర్ (అండర్ ట్రైనీ తహసీల్దార్) ఎ.రవీంద్రరావు, ఎంపీడీవో కొడాలి అనురాధ, ఈవోఆర్డీ సుహాసినితోపాటు పశుసంవర్ధకశాఖ నున్న ఏడీ రాధాకృష్ణ, గూడవల్లి, నిడమానూరు, గొల్లపూడిలోని పశుసంవర్ధకశాఖతోపాటు నున్న, భవానీపురం, పటమట, కొత్తపేట, గన్నవరం, ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ల అధికారులు ఉమ్మడి కమిటీల్లో ఉన్నారు. కోడి పందేల కోసం కోడి పుంజులను పెంచుతున్న పొరాలపై ఈ కమిటీలు దాడులు చేసేందుకు ప్రభుత్వం అనుమతించినట్లు అధికారులు తెలిపారు. అలాగే పందేలు, జూద క్రీడల నిర్వహణ చట్టరీత్యా నేరమని, సంక్రాంతి రోజుల్లో జంతు చట్టం 1960, గేమింగ్ చట్టం 1974ను పకడ్బందీగా అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. దీనిపై గ్రామాల్లో ప్రజలకు ఉమ్మడి కమిటీలు అవగాహన కల్పించనున్నాయి. రాజకీయ నేతలు, ప్రజా ప్రతినిధుల అండతో కోడి పందేలు నిర్వహించాలని భావిస్తున్న వారికి హైకోర్టు నిర్ణయం, ప్రభుత్వ చర్యలు గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లు తయారైంది. రూరల్ మండలంలో నున్న, కొత్తూరు తాడేపల్లి, పాతపాడు తదితర గ్రామాల్లో కోడి పందేల నిర్వహణకు ఇప్పటికే పలువురు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పందేలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమవడంతో నిర్వాహకులు ఖంగుతింటున్నారు.

కోడి పందేలు, జూద శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఉంగుటూరు, జనవరి 3 : మండలంలో కోడిపందేలు, జూద శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. స్థానిక విలేకరుల సమావేశంలో బుధవారం మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు సంక్రాంతికి గ్రామాల్లో కోడిపందేలు, పేకాట వంటివి నిర్వహించడం నేరమన్నారు. ఇప్పటికే పాత నేరస్తులను గుర్తించి బైండోవర్ చేస్తున్నామన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, డీవో, ఎస్సై, ఎన్జీవోలు కలిసి యాక్షన్ టీమ్‌గా ఏర్పడి గ్రామాల్లో జూదం నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో కోడిపందాలు, పేకాట నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఫోన్ నెంబర్లు 100, 9440627043 లకు తెలియజేయాలని కోరారు.

ఓవరాల్ ఛాంపియన్ బాపులపాడు

» వీరవల్లికి ద్వితీయ స్థానం

హనుమాన్‌జంక్షన్ రూరల్ జనవరి 3 : బాపులపాడు మండలం వీరవల్లిలో రెండు రోజులు జరుగుతున్న 81వ గ్రిగ్ మెమోరియల్ బాలుర ఆటల పోటీల్లో బాపులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించి ప్రథమ స్థానంలో, వీరవల్లి విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. ఆటల పోటీలు బుధవారంతో ముగిశాయి. విజేతలను గ్రామ పెద్దలు షీల్డు అందించి అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు అధ్యక్షతన సభలో విజేతలకు సర్పంచ్ మురళీకృష్ణ ప్రసాద్, తెలుగుదేశం గ్రామ అధ్యక్షుడు సురేంద్రమోహన్‌బెనర్జీ, స్వర్ణలత స్పిన్నింగ్ మిల్ ఎండీ గోపీచంద్, పాఠశాల కమిటీ ఛైర్మన్ గోళ్లవిష్ణు షీల్డు అందించారు.



విద్యార్థులతో కరచాలనం చేస్తున్న టీడీపీ గ్రామ అధ్యక్షుడు సురేంద్ర మోహన్‌బెనర్జీ

బాలుర ఆటల పోటీల్లో విజేతలు

జూనియర్, సీనియర్ విభాగాల్లో వాలీబాల్, ఖో ఖో, షార్టుబాల్, కబడ్డీ, రింగ్, టెన్నిస్, బాల్ బాడ్మింటన్, షటిల్, త్రోబాల్, సాఫ్ట్ బాల్ పోటీలు నిర్వహించారు. అందులో సాఫ్ట్‌బాల్ జూనియర్ విభాగంలో వీరవల్లి ప్రథమ స్థానం, వేలేరు ద్వితీయ, సీనియర్ విభాగంలో వేలేరు ప్రథమ, వీరవల్లి విద్యార్థులు ద్వితీయ స్థానాలు సాధించారు. వాలీబాల్ జూనియర్ విభాగంలో రేమల్లె ప్రథమ, బాపులపాడు ద్వితీయ, ఖోఖో సీనియర్ విభాగంలో వీరవల్లి ప్రథమ, రేమల్లె ద్వితీయ స్థానం, జూనియర్ విభాగంలో వీరవల్లి ప్రథమ, రేమల్లె ద్వితీయ, కబడ్డీ జూనియర్ విభాగంలో ఆరుగొలను ప్రథమ, బాపులపాడు ద్వితీయ, షటిల్ సీనియర్ విభాగంలో రేమల్లె ప్రథమ, వీరవల్లి ద్వితీయ, జూనియర్ విభాగంలో రేమల్లె ప్రథమ, వేలేరు ద్వితీయ, త్రోబాల్ సీనియర్ విభాగంలో బాపులపాడు ప్రథమ, వేలేరు ద్వితీయ, జూనియర్ విభాగంలో బాపులపాడు ప్రథమ, వీరవల్లి ద్వితీయ, బాల్ బాడ్మింటన్ జూనియర్ విభాగంలో వీరవల్లి ప్రథమ, ఆరుగొలను ద్వితీయ, టెన్నికాయిట్ సీనియర్‌లో బాపులపాడు ప్రథమ, వీరవల్లి ద్వితీయ, జూనియర్ విభాగంలో బాపులపాడు ప్రథమ, వీరవల్లి ద్వితీయ స్థానాలు సాధించారు.

మహిళా ఉపాధ్యాయులకు సత్కారం

హనుమాన్‌జంక్షన్ రూరల్ జనవరి 3 : విద్యార్థులకు అంకిత భావంతో విద్యనందించినప్పుడే మంచి పౌరులుగా ఎదుగుతారని ప్రవంతి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. బాపులపాడు మండలం పెరికీడు జెహెచ్‌పి ప్రాథమిక పాఠశాలలో బుధవారం పీఆర్‌టీయూ సేవాదళ్ ఉత్తమ మహిళా ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సావిత్రిబాయి పూలే అవార్డులు అందించి సత్కరించింది. రాష్ట్ర కన్వీనర్ డి.శ్రీను ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సత్కరించి సేవలను కొనియాడారు. చింతా సీతయ్య జూనియర్ కళాశాల సివిక్స్ అధ్యాపకురాలు కృపావతి, ఫిజిక్స్ అధ్యాపకురాలు బి.ర్యూబీ, శేరినరసన్నపాలెం ఎంపీయూపీ పాఠశాల గణితం ఉపాధ్యాయురాలు మాణిక్యమ్మ, ఉమామహేశ్వరపురం, మల్లవల్లి ఎలిమెంటరీ పాఠశాలల నుంచి సుభాషిణి, సునీత యు.ఎం. రూబీ, బొమ్ములూరు నుంచి డి.జె.లక్ష్మీబాయి, బండారుగూడెం నుంచి డి.ఎల్.మేరి, పెరికీడు నుంచి టి.జె.బి.బి.ఎన్.ఆర్.కుమారి, ఎస్.ఎస్.లలిత కుమారి, బాపులపాడు ఎంజీనగర్ నుంచి కె.సుజ్ఞానం, శేరినరసన్నపాలెం నుంచి వి.అక్షా సత్కారాలు పొందిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ బాపులపాడు మండల అధ్యక్షుడు బి.డి.ఎస్.రాజు, కార్యదర్శి పి.రమేష్, సేవాదళ్‌సహాయ అధ్యక్షుడు కృపావతి, సంఘం నేతలు అనిత, టిపుల్ల య్య, ఎం.ఎస్.ఆర్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

యూటీఎఫ్ టెన్తు మోడల్ టెస్టు ఏడున

హనుమాన్‌జంక్షన్ రూరల్ జనవరి 3 : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ బాపులపాడు మండల శాఖ ఆధ్వర్యంలో ఈనెల ఏడో తేదీన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పదో తరగతి మండల స్థాయి మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.జార్జ్‌ప్రసాద్, వి.రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్ సాయి గీతాంజలి జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం ఒంటి గంటకు పరీక్ష ఉంటుందనీ, పాల్గొనే విద్యార్థులు ప్రవేశ రుసుం కింద రూ.10 చెల్లించాలని తెలిపారు. తెలుగు, ఇంగ్లీషు మీడియంలో పరీక్ష జరుగుతుందని తెలిపారు.

శతాధిక వృద్ధుడు గోపయ్య మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్ జనవరి 3 : కానుమోలులో శతాధిక వృద్ధుడు దన్నే గోపయ్య (102) బుధవారం రాత్రి మృతి చెందాడు. ఆయనకు నలుగురు కుమార్తెలు. గోపయ్య మృతిపై గ్రామస్తులు సానుభూతి వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్‌లు దుర్గారావు, వెంకట శివఅప్పారావు, గ్రామస్తులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

బధిర విద్యార్థులకు అన్నదానం

హనుమాన్‌జంక్షన్, జనవరి 3 : నూజివీడు రోడ్డులోని ఆదిత్య బధిరుల పాఠశాలకు చెందిన 60మంది విద్యార్థులకు బుధవారం అన్నదానం చేశారు. ఏసీటీవో అల్లాడ గోపీకృష్ణ, డాక్టర్ యువ ప్రశాంతి దంపతులు బధిర విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆకుల వెంకటరమణ, అన్నపూర్ణ, శ్రీనివాస్, కృష్ణకుమారి, ఆనందకుమార్ పాల్గొన్నారు.

54 మందికి దుల్హన్ పథకం నిధులు

విజయవాడ రూరల్, జనవరి 3 : విజయవాడ రూరల్ మండలంలో దుల్హన్ పథకం కింద 54మంది మైనార్టీ యువతులకు నిధులు మంజూరైనట్లు డిప్యూటీ కలెక్టర్ (అండర్ ట్రైనీ తహసీల్దార్) ఎ.రవీంద్రరావు బుధవారం తెలిపారు. పథకం కింద ఒక్కొక్కరికి రూ.50 వేలు ఆర్థిక సాయం చేయనున్నట్లు తెలిపారు. గొల్లపూడిలో 14 మందికి, జక్కంపూడిలో ఐదుగురికి, కుందావారి కండ్రికలో 12 మందికి, ఎనికేపాడులో ఒక్కరికి, నిడమానూరులో 15 మందికి, నున్నలో ఇద్దరికి, పినైనవరం, పాతపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు, కొత్తూరు తాడేపల్లిలో ఒక్కొక్కరికి ఈ పథకం కింద ఆర్థికసాయం మంజూరైనట్లు తెలిపారు. అందుకు సంబంధించిన నగదు రూ.50 వేలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయన్నారు.



ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న రామవరప్పాడు గ్రామస్తులు

పుట్టింటికి పేరంటాలమ్మ

గుణదల : వెంకమ్మ పేరంటాలమ్మ ఉత్సవ విగ్రహాలకు మెరుగులు దిద్దేందుకు పుట్టింటి వారు బుధవారం పుట్టింటికి తీసుకెళ్లారు. రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏటా నాలుగు రోజులపాటు జాతర నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారి విగ్రహాలను పుట్టింటివారు రెండేళ్లకు ఒకసారి తీసుకెళ్లి మెరుగులు దిద్ది పంపడం ఆచారం. అందులో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పూలపల్లకీలో ఆలయం నుంచి రామవరప్పాడులోని రాజులబజారులోని పుట్టింటికి బుధవారం ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకట సాంబశివరావు, రామవరప్పాడు, ప్రసాదంపాడు ఉప సర్పంచ్‌లు కొల్లా ఆనంద్‌కుమార్, కోటేశ్వరరావు(కోట్లు), రామవరప్పాడు పంచాయతీ సభ్యుడు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పసల్ బీమా పరిహారం ఎప్పుడు?

» కాకులపాడు, తిప్పనగుంట జన్మభూమిలో రైతుల ఆగ్రహం

హనుమాన్‌జంక్షన్ రూరల్ జనవరి 3 : అపరాల పంట నష్టపోయిన రైతులకు పసల్ బీమా పరిహారం అందక ఇబ్బంది పడుతున్నట్లు బాపులపాడు మండలం కాకులపాడు, తిప్పనగుంట రైతులు జన్మభూమి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకులపాడు, తిప్పనగుంట, దంటగుంట్ల, చిరివాడలో బుధవారం జన్మభూమి గ్రామసభలు జరిగాయి. కాకులపాడు, తిప్పనగుంట సభల్లో పసల్‌బీమా పరిహారం కొంతమందికి బ్యాంకుల్లో వేశారని, మరికొంతమందికి వేయలేదని కాకులపాడులో ఎంపీటీసీ సభ్యులు ఎలీషారావు, వెంకట రంగారావు, శేషయ్యరావు, ఏవో శ్రీనివాసరావుపై ధ్వజమెత్తారు. గ్రామంలో దాదాపు 127మందికి పరిహారం సొమ్ము రాలేదన్నారు. తిప్పనగుంటలో తెలుగుయువత మండల ఉపాధ్యక్షుడు ఎం.ప్రభుకాంత్ నాయకత్వంలో రైతులు మొవ్వా మల్లికార్జునరావు, కాజ పున్నయ్య, సదర్ల వెంకటేశ్వరరావు, తదితరులు అధికారులపై ధ్వజమెత్తారు. దీంతో ఏవో బీమా సంస్థ మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతులు ఆందోళన చెందుతున్నారని, తక్షణం పరిహారం అందించాలని విజ్ఞప్తిచేశారు. ఎంపీడీవో కోమలి గర్భిణిలకు సీమంతాలు చేశారు. కాకులపాడు, దంటగుంట్ల సభలకు ఎంపీడీవో ఆర్.కేశవరెడ్డి, తిప్పనగుంట, చిరివాడ సభలకు తహసీల్దార్ కె.గోపాలకృష్ణ నాయకత్వం వహించారు. తిప్పనగుం, చిరివాడ సభల్లో మండల స్పెషలాఫీసర్ పి.సత్యనారాయణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గన్నవరం జనవరి 3 : టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గొంది శివకోటేశ్వరరావు రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఆవిష్కరించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే వంశీ ఫోటోలతో ముద్రించిన క్యాలెండర్‌ను పార్టీ శ్రేణులకు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. గొంది శివకోటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ గొన్నూరు సీమయ్య, వెంకట్రామయ్య, పండుబాబు పాల్గొన్నారు.